
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ    సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
**కందర్ప రామచంద్ర రావు**
**ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డాక్టర్ తుమ్మూరి**
**సి.వి. శ్యామల రావు**
**డి.వి.ఆర్. మూర్తి**

సంపుటి 9 - సంచిక 7
**నవంబర్ 2008**

**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 90**
**3 సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**
**శాశ్వత చందా రూ॥ 1800**

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD**

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722

## జ్ఞాన స్పర్శ లేకుండా త్యాగం లేనే లేదు

జ్ఞానం యొక్క పరిణామ స్వరూపమే త్యాగం. హృదయంలో జ్ఞాన స్పర్శ లేకుండా త్యాగంచెయ్యాలని ప్రయత్నిస్తుంటారు. కాని అది త్యాగం కాదు. ఆడంబరం మాత్రమే. త్యాగం చెయ్యడమనేది పై పై మాటలతో, పై పై ఆలోచనలతో జరిగేది కాదు. అంతరాంతరాలలో జ్ఞానం స్థిరపడాలి. అంతర్మథనం జరగాలి. అప్పుడే పాలసముద్రం నుండి అమృతం వెలువడినట్లు త్యాగం పుట్టుకొస్తుంది. త్యాగం చెయ్యడానికి ముందుతయారీ ఉండదు. పథకాలు అవసరంలేదు. ప్రచారంతో పనిలేదు. మరొకరి సలహా సంప్రదింపులు కోరనక్కరలేదు.

అంతరాంతరాలలో స్ఫూర్తిని పొందిన జ్ఞానం ఉవ్వెత్తున ఎగిసిపడుతూ త్యాగ మార్గంలో పయనిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి సన్యాసిగా మారాలనుకుంటే గృహాన్ని త్యజించడంకోసం ప్రణాళికను తయారు చేసికోడు. వేషం మార్చుకోవడానికి ముమ్మందుగా సన్యాసి దుస్తులు సిద్ధం చేసుకోడు. పేరు మార్చుకోవడం కోసం పదిరకాల పేర్లను వ్రాసి చూచుకోడు. భార్యా బిడ్డలను, సాధన సంపత్తిని ఇతరుల చేతిలో పెట్టి అప్పగింతలు మొదలు పెట్టడు. ఇల్లువదలి వెళ్లిపోతూ మాటి మాటికి వెనుదిరిగి చూడడు. ఇన్ని విధాలుగా జాగ్రత్తలు తీసికుంటే అది త్యాగం అనిపించుకోదు.


ఏది శాశ్వతమో ! ఏది అశాశ్వతమో ! ప్రస్తుత సమాజానికి తానందించవలసిందేదో తన కర్తవ్యం ఏమిటో ! మొదలైన విషయాలు అనుకోనివిధంగా మస్తిష్కంలో తళుక్కుమంటాయి అంతే. హఠాత్తుగా లేచివెనుకముందు ఆలోచించకుండా కర్తవ్యపథంలో సాగిపోతాడు. కావలసిన అన్ని మార్పులను కాలమే ప్రసాదిస్తుంది. అదే జ్ఞానవంతమైన త్యాగం.

★★★

అధర్మంగా సంపాదించిన డబ్బుంటే - పామును పైపంచెగా వేసికున్నట్లే.

# విషయ సూచిక


1. **సంపాదకీయం**
   జ్ఞాన స్పర్శలేకుండ త్యాగం లేనేలేదు 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం**
   బుద్ధికి అంకుశంగా శ్రద్ధ 2
4. **వేద మంత్రం :** న్యాయంగా సంపాదించు 3
5. **వర్తమాన భారతం**
   ఒత్తిళ్ల మధ్య నలిగిపోతున్న దాంపత్య జీవితం 4
6. **ప్రత్యేక వ్యాసం : గురునానక్ జయంతి**
   లాభసాటి బేరం 7
7. **ధారావాహిక : హనుమత్ కథామృతం-7**
   అంజనీ ప్రియపుత్రుడు-మహారుద్రుడు 9
8. **ముఖచిత్ర కథనం**
   ఎర్రకాగడా-ఒక విశ్లేషణ 11
9. **తత్వచింతన**
   త్రవ్విన గోతిని పూడ్చడం-ప్రాయశ్చిత్తం 13
10. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-18**
    అధ్యాత్మవాదం 14
11. **మనం-మన ఆరోగ్యం : పంచతత్వాలతో చికిత్స-10**
    పంచతత్వాల దైనిక సాధన-సమన్వయం 16
12. **ధారావాహిక : భక్తి గాథ-13**
    పరమత్యాగశీలి-పరమభక్తుడు దధీచి 18
13. **బోధకథ :** అమృతం పుట్టింది 20
14. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-36**
    నాద సాధన 22
15. **ఆచరణలో అధ్యాత్మ :** పునర్జన్మ-ఆస్తికత 25
16. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-56**
    సరికొత్త వెలుగులో-2 27
17. **మహిళా జాగరణ :** మాతాజీ అమృతలేఖిని 30
18. **అమూల్యమైన సమయం వర్తమానమే** 32
19. **బోధకథ :** మానవతావాది - అబ్బేపియర్ 34
20. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-27**
    గ్రామాల పర్యటనలో అనుభవాలు 37
21. **ఒక్క రొట్టె చాలు - ఆకలి తీరడానికి** 39
22. **సద్గురులీలామృతం :** ఉత్తరం దెబ్బకే జ్వరం పరార్
    గురుసత్తా అంటే ఇదే 41
23. **సిద్ధికి సంబంధించిన సిద్ధాంతాలు** 42
24. **వార్తలు** 44
25. **నేత్ర రక్షణకు చాక్షుషీ విద్యాప్రయోగం** 48

# సద్గురు వచనామృతం

## బుద్ధికి అంకుశంగా శ్రద్ధ

బుద్ధిఇని అదుపులేకుండా పెంచుకుంటూ పోవడం ఇతరులకు దుఃఖాన్ని కలిగించడమే కాక- స్వయంగా తనకూ హానిచేస్తుంది. అతి బుద్ధివాది అయిన మానవుడు చివరికి అసంతృప్తి అనే మంటలో రగిలిపోతాడు. అతడు ఎన్నింటిని పొందినా దేనినీ పొందనివాడే. బుద్ధివాది గొప్ప శాస్త్రవేత్త కావచ్చు. నిపుణుడు కావచ్చు. దార్శనికుడు కావచ్చు. వైజ్ఞానికుడు కావచ్చు. తత్వవేత్త కావచ్చు. బుద్ధి యొక్క అహంకారం అతడి హృదయంలో శాంతిని నిలువనీయదు. ఇతరులకు జ్ఞానాన్ని ఇస్తూకూడ అతడు ఆత్మశాంతి కోసం తహతహలాడతాడు. బుద్ధి రెండువైపులా పదును గల చురకత్తి. అది ఇతరులను కాని దాన్ని కలిగిఉన్న వ్యక్తిని కాని రాత్రింబవళ్లు కోస్తూనే ఉంటుంది. అడ్డూ అదుపూ లేని మానవుని బుద్ధిశక్తి మానవ జాతికి బద్ధ శత్రువు. కనుక- బుద్ధిని పెంచుకోవడంతోపాటు దాన్ని అదుపుచేయడంకూడ అవసరం.

ఒక శక్తిశాలిపై అదుపు అంతకన్న శక్తిశాలి ద్వారానే సాధ్యపడుతుంది. సృష్టి మొత్తాన్ని తన గుప్పిడిలో ఇముడ్చుకున్న బుద్ధిశక్తిని అదుపుచేయడానికై మనిషివద్ద మరో శక్తి ఏముంది? ఆ రెండవ శక్తి శ్రద్ధ. శ్రద్ధ ద్వారా బుద్ధివంటి విచ్చలవిడి శక్తిపై అంకుశాన్ని ప్రయోగించవచ్చు; దాన్ని నియంత్రించవచ్చు; దాన్ని విధ్వంసంవైపు వెళ్లకుండా ఆపవచ్చు; దాన్ని సృజన మార్గంలో పురోగమింపజేయవచ్చు.

శ్రద్ధపై ఆధారపడని బుద్ధి ఒక పెను తుఫానుతప్ప మరేదీ కాదు. శ్రద్ధ లోపించిన బుద్ధి ఎక్కడకు వెళితే అక్కడ దుఃఖమయ పరిస్థితులనే సృష్టిస్తుంది.

★★★

## పండుగలు

**నవంబరు 2008**

| | |
|---|---|
| **13** | గురునానక్ జయంతి |
| **14** | నెహ్రూ జయంతి |

**డిసెంబరు 2008**

| | |
|---|---|
| **9** | గీతా జయంతి |
| **12** | దత్తాత్రేయ జయంతి |
| **25** | క్రిస్మస్ |

నీ ఎదుటివారిని భయపెట్టిందంటే - అది అధర్మమైనదన్నట్లే.

వేద మంత్రం

# న్యాయంగా సంపాదించు

**యదింద్ర యావతస్త్వమేతావదహమీశీయ ।**
**స్తోతారమిహిధిషేయ రదావసో న పాపత్వాయ రాసీయ ॥**
**(ఋగ్వేదం 7/32/18)**

**భావార్థం :** ఉచిత రీతిలో సంపాదించిన ధనం, సత్కార్యాలలో వినియోగిస్తే సద్గతి నిస్తుంది. పాపకృత్యాలలో వినియోగిస్తే అది నశిస్తుంది.

**సందేశం :** ధన ప్రాధాన్యం అంతటా ఉన్నది. రాజూ-పేద, ధనికుడు-లేనివాడు, భోగి-యోగి ధనంలేకుండా ఎవరి పనీ సాగదు. ఈ ధన ప్రధాన ప్రపంచంలో ప్రతిఒక్కరూ ధనదేవత ఉపాసనలో మునిగి పోయారు. ధన సంపాదనకు ఉపాయాలు ఆలోచించవలసిందే. అయితే- నింద, అపకీర్తి పొందే విధంగా ఆ పద్ధతులు ఉండకూడదు. సంపాదన శుద్ధమైనది కావాలి.

ప్రాపంచిక విషయాలలో ధనం ఆవశ్యకం అనేదానిలో సందేహం లేదు. దీనిని తిరస్కరించటం సర్వథా అసంభవం. మన వాస్తవిక లక్ష్యప్రాప్తికి శరీర రక్షణ ఎంత అవసరమో, అలాగే ధనం కూడా. కానీ మానవ జీవనంలో ఇదే అంతిమ ధ్యేయంకాదు. **నేటి మన సమస్త సమస్యలకు కారణం, ధనమే సర్వస్వంగా భావించటమే**. దాని ముందు మరింకేదీ కనిపించటం లేదు. రూపాయే అన్నిటికన్నా మిన్న- అనే సూక్తి వాస్తవమనిపిస్తుంది. ఇంతేకాదు. భగవంతుని కంటే నేడు ధనమే ఎక్కువ. ధన సంపాదనలో భగవంతుడు గుర్తురాని జనం తమ ధన సంపాదనా సమయంలో ఏదైనా ఇబ్బంది రాగానే భగవంతుణ్ణి నిందిస్తూ ఉంటారు. వారి అనైతిక కార్యాలలో సహకరించటం, వారి సంపత్తిని రక్షించటం భగవంతుడిపని, ఆ పనిలో భగవంతుడు విఫలుడైనాడని వారి అభిప్రాయం.

డబ్బే సర్వస్వమని భావించే వారు తాము ధనవంతులు కావాలనే కపోలకల్పనలు చేసుకుంటూ, ఈ అనుచిత పద్ధతి సమాజానికి ఎంత నష్టమో ఆలోచించనే ఆలోచించరు. వారికి తమ స్వార్థమే కన్పిస్తుంది. ఏదోవిధంగా అధికాధికంగా డబ్బు సంపాదించాలి. బంగారు లంక నిర్మించాలి. చివరకు తమ అనైతిక ఆచరణ ఫలితంగా దానితోపాటు స్వయంగా భస్మమైనా ఫరవాలేదు.

'సర్వేగుణాః కాంచన మాశ్రయంతి' - ప్రపంచంలో అన్ని గుణాలు బంగారాన్ని ఆశ్రయిస్తాయి. ధనం నుండి కామ, లోభ, మోహది అనేకానేక దుర్గుణాలు జన్మిస్తాయి. కానీ నిజాయితీతో ధనం సంపాదిస్తే ఆ 'చమటోడ్చిన సంపాదన'లో ఒక సుగంధం ఉంటుంది. అటువంటి ధనాన్ని సత్కర్మలలో వినియోగిస్తే మనుష్యుడు యశస్వి అవుతాడు. కష్టపడి సంపాదించిన ధనాన్ని మనుష్యుడు దుర్వ్యయం చేయలేడు. అవినీతితో వచ్చిన సొమ్ము వల్ల జూదం, మద్యపానం మొదలైన వ్యసనాలు అతణ్ణి ఆకర్షిస్తాయి. అనాచారం, వ్యభిచారంలో అది దురుపయోగమవుతుంది. పాపకర్మల క్రమం ఒకటి ఏర్పడి మనుష్యుడు దానిలో ఎంతగా ఇరుక్కుపోతాడంటే- కోరుకున్నా దానిలోనుండి బయటపడటం కష్టమవుతుంది. తమో గుణంలో మునిగి, జనకల్యాణం అనేది ఆలోచించనే లేదు.

నిజాయితీతో సంపాదించిన ధనం సాత్విక బుద్ధిని వికసింప చేస్తుంది; మనుష్యుడు లోకహితం కొరకు. ధర్మాన్ని అనుసరించి ఆచరించటానికి ప్రేరణ ఇస్తుంది.

★★★

## అందరికీ ఆహ్వానం - మౌన సాధనాశిబిరం

8-11-08, 9-11-08 రెండు రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో మౌన సాధనా శిబిరం నిర్వహింపబడుతుంది. ఆసక్తి గల పరిజనులు శిబిరంలో పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి (0863 2534440, 9292202139) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 7-11-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

డబ్బు వ్యామోహంలో పడిపోతే - మానవ సంబంధాలన్నీ మటుమాయం.

వర్తమాన భారతం

# ఒత్తిళ్లమధ్య నలిగిపోతున్న దాంపత్య జీవితం

"గృహస్థజీవనం ఒక తపోవనం" అన్నారు పరమపూజ్య గురుదేవులు. "గృహమేకదా ! స్వర్గసీమ" అని మన సినీగాయకులు ఎలుగెత్తి గానం చేశారు. సహజీవనానికి, ప్రేమను ఇచ్చి పుచ్చుకోవడానికి ఆధారభూతమైనది కుటుంబమే. అందుకే తార్కికులు కుటుంబాన్ని మినీ ప్రజాతంత్రం అన్నారు. భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మ కుటుంబవ్యవస్థయే. ఈనాటికీ భారతీయ సంస్కృతి నిలబడగలగడానికీ ముఖ్యకారణం ఇక్కడున్న కుటుంబ జీవనవిధానమే. అటువంటి పటిష్ఠమైన వ్యవస్థమీద ఏదుష్టశక్తుల దృష్టిపడిందో గాని, నేడది కకావికలమై పోతున్నది. అధికశాతం చదువుకున్న వారి మధ్యనే దాంపత్యం చీలిపోతోంది. సుప్రీంకోర్టు జడ్జి ఒక తీర్పులో– "ఈ రోజుల్లో గృహహింస మహావేగంగా పెరిగిపోతున్నది. ఎక్కడ చూచినా విడాకుల పెనుతుఫాను విజృంభిస్తోంది. భారతీయ సంస్కృతికి మూలభూతమైన కుటుంబ వ్యవస్థ తన అస్తిత్వాన్నే కోల్పోతున్నది." అని తన ఆవేదనను వ్యక్తం చేశారు.

## మచ్చుకు ఒక్క ఉదాహరణ

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఈ విధంగా విచ్చిపోయిన సంసారాలు లెక్కకు మిక్కిలిగా కానవస్తున్నాయి.

'అలక–ఆకాశ్' ఇద్దరు కలసి చదువుకున్నారు. ఒకర్నొకరు ఇష్టపడ్డారు. ఒకరు లేకుంటే ఇంకొకరికి జీవితమే లేదనుకున్నారు. ప్రయాసపడి రెండు కుటుంబాల పెద్దలను తమ మార్గంలోకి తెచ్చుకున్నారు. పెద్దల అంగీకారంతో బంధుమిత్రుల సమక్షంలో వారి ఆశీర్వాదాలతో వివాహం చేసికున్నారు. అలక తనకలల రాజకుమారుడికి మనసు నొచ్చుకోకుండా జాగ్రత్తగా మసలుకుంటోంది. అత్తమామలకు సేవలు చేస్తోంది. వారి ఇష్టానికి అనుకూలంగా చీరకట్టుకుంటున్నది. వారికి కావలసిన వంటకాలు చేసిపెడుతోంది. అయినా వారిలో అసంతృప్తి రాజుకుంటోంది. వారికి ఆమెలో అన్నీ లోపాలే కనిపించసాగాయి. అందరికోరికమేరకు ఉద్యోగంలో చేరింది. నెలకు 40 వేలరూపాయల జీతం. అన్నివిధాల అందర్నీ సంతృప్తిపరచే ప్రయత్నమే చేస్తోంది. ఆఫీసు పనులు, ఇంటిపనుల మధ్య నలిగిపోతోంది. రెండుచోట్ల తన పాత్రను విజయవంతం చేసుకోవాలని తాపత్రయపడుతోంది. శక్తికి మించి కృషిచేస్తోంది. ఎన్ని విధాల శ్రమపడినా అప్పుడప్పుడు ఆమె చరిత్రను వేలెత్తిచూపడం మొదలుపెట్టారు.

ఒకప్పుడు అందాల రాణిగా ఆరాధించిన ఆకాశ్ దృష్టిలో అలక చులకనైపోయింది. అతని స్వచ్ఛమైన మనస్సును అనుమానభూతం ఆవరించింది. అప్పుడప్పుడు ఏదో ఒక మిషతో అరవడం మొదలు పెట్టాడు. ఆమెవెనకాల ఒకప్రైవేటు డిటెక్టివ్‌ను పెట్టాడు. అలకకు సహనం నశిస్తోంది. ఇంట్లో పోట్లాటలు ప్రారంభమయ్యాయి. ఆకాశ్ ఒక్కొక్కసారి చేయిచేసికోవడం మొదలుపెట్టాడు. గతిలేని పరిస్థితుల్లో ఒక క్లీనికల్ సైకాలజిస్ట్‌ను ఆశ్రయించారు. ఆయన ఇద్దరినీ కూర్చుండబెట్టుకుని ఎంతగానో చెప్పిచూశాడు. కాని ఫలితం శూన్యం. చివరకు విడాకులు తీసికున్నారు.

## 'స్త్రీ' అంటే సొంత సంపద అన్నభ్రమ

ఇది కల్పించబడిన కథకాదు. అక్షరాల జరిగిన అంశం. ఇప్పుడు ఇది ప్రతి 'మెట్రో'లోను, మహానగరాల్లోను జరుగుతున్నవే. భర్త లేక ప్రేమికుడు స్త్రీని అవసరానికి మించి తనదిగా భావిస్తున్నాడు. ఆ పిచ్చిలో తానేంచేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో ఉంటున్నాడు. కనుముక్కు తీరు కొంచెమంత చక్కగా ఉంటేచాలు, నలుగురిలోకి వెళ్లి ఉద్యోగం చేస్తున్నదంటే అనుమానంతో దహించుకపోతున్నాడు. రకరకాలుగా హింసిస్తున్నాడు. ఆవేశం పెరిగిపోతే అంతం చేస్తున్నాడు. కట్టుకున్న భార్యమీదనే యాసిడ్‌పొయ్యడానికి వెనుకాడడం లేదు. స్త్రీని తనసొంత ఆస్తిగా భావించడమనేది అనాదిగా వస్తున్నదే. ఆమెను గురించిన తీర్పును తానే చెపుతుంటాడు. ఆమె చెప్పవలసిన తీర్పును కూడ తానే చెపుతాడు. గ్రామాధికారిణిగా, సర్పంచ్‌గా, వార్డ్ మెంబరుగా, నగరాధికారిణిగా ఎన్నికైన స్త్రీలను కూడ భర్తలు రిమోట్ కంట్రోలు చేస్తూ నడిపిస్తున్నారు. స్వతంత్రించి చేయగల సమర్థత కలిగి ఉన్నవారికి కూడ భర్తలు అనుమతిని ఇవ్వరు. ఇదీ నేటిసమాజ పరిస్థితి.

## సంస్కారాలన్నీ మూలపడ్డాయి

నూతన శకంలో దాంపత్యంలో గ్లామర్‌కే ఎక్కువ ప్రాధన్యత ఇవ్వబడుతోంది. సినిమాస్థాయి ప్రేమలు ప్రారంభమయ్యాయి. మాటల వ్యామోహంలో పెళ్లిళ్లు జరుగుతున్నాయి. పెండ్లైన కొద్దికాలానికి భర్తయొక్క నిజస్వరూపం బయటపడుతోంది. పది సంవత్సరాలక్రితం ఆవేశంతో చేయబడిన గృహసంబంధ హత్యలు 15% ఉండేవి. ఇప్పుడు ప్రేమ, అసహ్యం, ఈర్ష్య, భ్రమ మొదలైన ప్రవృత్తుల కారణంగానే హత్యలు జరుగుతున్నాయి. చదువుకున్న వారిమధ్యలోనే ఇది అధికంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వివాహేతర సంబంధాలు కూడ పవిత్రమైన కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ మెరుపుల ప్రపంచంలో సోషలిజం పేరుతో ఎవరికి? ఎవరితో? ఎప్పుడు? అనైతిక సంబంధాలు ఏర్పడుతాయో ఊహకు అందని

**చుట్టాలు దగ్గరయ్యేది 90 శాతం డబ్బు వల్లనే.**

విషయమైపోయింది. అసలు "ఏదీ తప్పుకాదు" అన్న పరిస్థితి ఎదురౌతోంది. ఏది జరిగినా అదే ఆధునికత అయిపోతున్నది. ఆధునికత పేరుతో సంస్కారాలనన్నీ మూటగట్టి మూలకు విసరివేస్తున్నారు.

## నేరాల పరంపర

ఢిల్లీలోని మానసిక డాక్టరు రేఖాత్రేహన్ మాటల్లో– ఇప్పుడు ఈర్ష్య, గుడ్డిప్రేమ, కామవాసనల కారణంగా జరిగే అపరాధాల సంఖ్య అధికమైపోతున్నది. దీనికి ఒక కారణం మీడియా కూడ అయిఉండవచ్చు.

"బొంబాయిలో పనిచేస్తున్న మోడల్ మూనదాస రూర్కెలాలో ఉన్న అవినాశ్‌ను ప్రేమిస్తుండేది. కాని బొంబాయి వచ్చిన తరువాత ఈ మోడల్ ప్రపంచంలోనే బంధించబడింది. ఈ ఆకర్షణల నుండి విడిపడలేకపోయింది. మోడలింగ్ ప్రపంచం చాల విచిత్రమైంది. దానిలో అవినాశ్ జ్ఞాపకాలకు కూడ చోటులేకుండాపోయింది. ఈ పరిస్థితిని తట్టుకోలేక అవినాశ్ మూనదాస తల్లిని, మేనమామను హత్యచేసి, ఆత్మహత్య చేసికున్నాడు. ఇది అభద్రతకు చిహ్నమో! పరిపక్వతలేని ప్రేమకు చిహ్నమో! చెప్పగలగడం కష్టమే. హతాశుడైన వ్యక్తి అంతిమ చర్యగా చెప్పుకున్నారు.

ప్రేమ వివాహాల తర్వాత భార్య లేక భర్తల హత్య గాని, అనతికాలంలో విడాకులు కాని, కలసి ఉన్నా ప్రతిరోజూ జరిగే కొట్లాటలు గాని భారత దేశంలో కూడ మామూలు విషయాలై పోయినాయి. నూటికి 50 మంది పరిస్థితి ఇలాగే ఉంది. అధిక శాతం పట్టణాలలో, మహానగరాలలో, మెట్రోలలో సాధారణ విషయమైపోయింది. మెల్ల మెల్లగా పల్లెలకు ప్రాకివచ్చింది. ఎక్కడా దేనికీ విలువ అనేది లేకుండా పోయింది. ఈ ఆవేశకావేశాల వల్ల మానసిక వ్యాధులు పెరిగిపోతున్నాయి. దాంపత్య జీవనానికి మూలాధారం ప్రేమ వివాహాలా? పెద్దలు చేసిన పెళ్ళిళ్లా? అనేవి నిర్ణయించలేకపోతున్నాం. ఈ అయోమయ పరిస్థితిలో దాంపత్య జీవితం ప్రమాదంలో పడిపోయిందని మాత్రం చెప్పగలం. ఈ పరిస్థితుల్లో వీరి సంతానం ఏమైపోవాలి? అని అనుకుంటే చాలు భయం పుట్టుకొస్తోంది.

## ఈనాటి స్త్రీ

ఈనాడు స్త్రీ స్వేచ్ఛాజీవి. తన కాళ్లపై తాను నిలబడగల స్తోమతను సంపాదించుకున్నది. ఆ స్తోమతయే పరిస్థితులను తారుమారు చేస్తున్నది. అది భారతీయ సంస్కృతి మూల్యాలను పెంచేదికాదు. ఇది ఆధునిక భావాల్లో పుట్టుకొచ్చిన స్వశక్తి. దీనిలో బదులు తీర్చుకునే భావన ఎక్కువ. ఈ రోజు స్త్రీలు పురుషునితో సమంగా భుజం భుజం కలిపి, పదం పదం కలుపుతూ అడుగులు వేస్తున్నారు. కొన్ని పరిస్థితుల్లో ఒక అడుగు ముందే ఉంటున్నారు. వారికి తమ భవిష్యత్తును గూర్చిన ఆలోచన ఎక్కువైంది. మల్టీనేషనల్ కంపెనీలు, బేంకులు, బి.పి.ఒ. ఆఫీసులు తమ ఉద్యోగులకు వేతనాలు అధికంగా ఇస్తున్నాయి. గడచిన పదిసంవత్సరాల నుండి ఇది కొనసాగుతోంది. వేగంగా పరుగులు తీస్తున్న ప్రపంచంలో స్త్రీలు అనుకున్నది సాధించగలుగుతున్నారు. దేనినీ సర్దుకుపోలేక పోతున్నారు. ఇంతకాలం స్త్రీ అణచివేయబడింది. ఇప్పుడు లభించిన అవకాశాన్ని వదులుకోలేకపోతున్నది. చాల మంది స్త్రీలు వివాహం చేసికోకుండానే సంబంధాలు పెంచుకుంటున్నారు. దాంపత్యాన్ని సంకెళ్లుగా భావించి దూరంగా ఉంటున్నారు. ఇది 10–15 సంవత్సరాలక్రిందటి పశ్చిమదేశాల సంస్కృతి. అక్కడ తండ్రిలేని సంతానం అధికంగా ఉండేది. పరివారం లేకుండా వారేవిధంగా వృద్ధి చెందగలరు? పాపం వారికి తండ్రిపేరుకూడ తెలియదు. ఈనాటి ఆధునిక స్త్రీ ఆ స్థితినే కోరుకుంటున్నది. రోజువారీ కలహాలు ఆమెను పూర్తిగా మార్చివేశాయి. కలహాల కాపురం నుండి రక్షించుకోవడానికి తనకాళ్లపై తాను నిలబడుతోంది. మనసుకు నచ్చిన వారితో స్నేహం చేస్తూ కోర్కెలను తీర్చుకునే యత్నం చేస్తున్నది. నైతికత దృష్టిలో ఇది సరైనది కాదు. కాని ఇది దాగని సత్యం. ఆగని సత్యం. దీనిని సమాజం, సంస్కృతి ఏవిధంగా స్వీకరిస్తాయి?

వివాహేతర సంబంధాల వెనుక మానసిక కారణాలు అనేకం. ఈనాటి జీవన విధానంలో ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థ దెబ్బతింటున్నది. భర్త యొక్క చిరకాల వియోగం భార్య మనస్సులో వేరొకరికి స్థానాన్ని కల్పిస్తోంది. భార్యాభర్తలు ఇద్దరు

### అందరికీ ఆహ్వానం - సంజీవనీ సాధనాశిబిరం

22-11-08 నుండి 26-11-08 వరకు 5 రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో 'సంజీవనీ సాధనా శిబిరం' నిర్వహింపబడుతుంది. ఆసక్తి గల పరిజనులు శిబిరంలో పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి (0863 2534440, 9292202139) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 21-11-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

**స్నేహితులు దగ్గరయ్యేది 50 శాతం డబ్బు వల్లనే.**

ఆఫీసుల్లో 12-14 గంటలు గడుపుతుంటారు. ఆ పరిస్థితిలో తోటి ఉద్యోగులతో స్నేహం పెరుగుతుంది. ఈ స్నేహం పేరుతో నూటికో, కోటికో ఒకరో ఇద్దరో హద్దులు మీరడం జరుగుతుంది. కాని అందరికీ అలా జరగదు. అయినా అనుమాన భూతం పుర్రెల్లో సంచరిస్తూ ఉంటుంది. అనుమానానికి కళ్లుండవు. దానికి ఆధారాలు అక్కర్లేదు. అదుపులేకుండా పెరిగిన అనుమానం అమాయకులను కూడ అపరాధులుగా తయారు చేస్తున్నది. ఇది కూడా ఒక కారణం. దీనితోపాటు సెల్‌ఫోన్ ద్వార ఎస్.ఎమ్.ఎస్.లు, తమవంతు పాత్రను నిర్వహిస్తున్నాయి. ఈనాటి ప్రపంచంలో అపరాధాల సంఖ్య పెరిగిపోతోంది. ఇటువంటి దంపతులను సరిఅయిన పద్ధతిలో కౌన్సిలింగ్ చెయ్యాల్సి ఉంది. ఈనాడు ఉమ్మడి కుటుంబాల సంఖ్య తగ్గిపోయింది. పట్టణాలలో జంటలు సొంతగా సంసారాలు దిద్దుకోవలసివస్తున్నది. ఈ పరిస్థితికూడ అగ్గిమీద గుగ్గిలం వేసిన విధంగా నడుస్తున్నది. వీటన్నింటి వల్ల కుటుంబ వ్యవస్థ కూలిపోతున్నది. పూర్వం కుటుంబంలో పెద్దవాళ్లుండేవాళ్లు. తల్లిదండ్రులు, అన్నా-వదినలు మొదలైనవారు ఉండడంతో చిన్న చిన్న సమస్యలను సరిదిద్దేవారు. కష్టసుఖాలను పరస్పరం కలసిపంచుకునేవారు. అదే విధంగా పనిపాటలను గూడ యోగ్యతను అనుసరించి పంచుకుని చేసికొనేవారు. విషయాన్ని విడాకులదాకా రానిచ్చేవారుకాదు.

భార్య చదువుకోవడం, ఉద్యోగం చెయ్యడం తప్పుకాదు. స్త్రీ అందంగా, సరదాగా ఉన్నంతమాత్రాన అనుమానించడం భావ్యం కాదు. ఒకవేళ భార్య తన తల్లిదండ్రులతో కలిసిమెలసి ఉండలేకపోతే నచ్చచెప్పుకునే ప్రయత్నం చెయ్యాలి. సంతానం కలుగనంత మాత్రాన విడాకులివ్వడం, రెండవ వివాహం చేసికోవడం, దూషించడం, హింసించడం సరిఅయిన పరిష్కారం కాదు. పై కారణాల మూలంగానే గృహహింసలు, అపరాధాలు పెరిగిపోతున్నాయి. వాటి ద్వారానే దాంపత్య జీవనం విచ్ఛిన్నమైపోతున్నది. ప్రతీదానికీ విడాకులే పరిష్కారం కాదు. ప్రధాన సమస్యను వెలికి తీయాలి. పరిష్కారమార్గాన్ని ఆలోచించాలి. అంతేకాని మారుతున్న రోజులతో పాటు గుడ్డిగా పరుగులు తీయడం మంచిదికాదు. మన వివేకాన్నీ సహనాన్నీ, తెలివితేటల్నీ ఉపయోగించాలి. కుటుంబ వ్యవస్థను సరిదిద్దలేకపోయినట్లైతే సమాజం ఎటుపోతుందో ఎవ్వరూ ఊహించలేరు. దేశ సంస్కృతి, దేశీయ సభ్యత, సంస్కారాల విలువలు మట్టికొట్టుకుపోతాయి. ఓర్పుగా, నేర్పుగా, సాధ్యమయినంత వేగంగా కుటుంబ వ్యవస్థను సరిదిద్దుకోవడం మనందరి బాధ్యత.

## దేవపరివారం తయారుకావాలి

పూర్వకాలం నుండి స్త్రీకి పతివ్రతాధర్మాన్ని నూరిపోశారు. కాలంమారింది. ఇప్పుడు పురుషునికి కూడ పత్నీధర్మాన్ని బోధించాల్సిన అవసరం వచ్చింది. భార్యను సంపూర్ణమైన వ్యక్తిగా గుర్తించాలి. ఆమె పట్ల క్రూరంగా ప్రవర్తించకూడదు. స్త్రీ పురుషులిద్దరు సమాజరథాన్ని లాగగల సమఉజ్జీలుగా నిలబడాలి. ఇద్దరూ కుటుంబంలో సున్నిత విషయాలను అర్థం చేసికుని నడుచుకోవాలి. ఆధునిక ప్రపంచంలోకూడ పరస్పర ప్రేమ, ఆత్మీయతలు పూర్తిగా లాగివేయబడలేదు. దానిని గమనించి సంస్కరించుకోవాలి. కేవలం కోర్కెలలో కాకుండ పరిష్కార భావాలతో నడుచుకునే వారి సంబంధం గట్టిగా ఉంటుంది. అటువంటి వాతావరణంలో పెరుగుతున్న పిల్లలు సంస్కారవంతులౌతారు. మేధావులవుతారు. పశ్చిమదేశాల సంస్కృతి మనల్ని మోహపెట్టినప్పుడు మనం దానికి వశం కాకూడదు. సుహృద్భావంతో పరిశీలించి మనకు అనుకూలంగా మలచుకోవాలి. అప్పుడే దేవ పరివార స్థాపన చేయగలుగుతాం. అప్పుడే గృహస్థజీవనం ఒక తపోవనంగా మారిపోతుంది.

## దీనికి ఇదే మార్గం

కుటుంబం ఒక ప్రయోగశాల. దానిలోని సభ్యులందరు గుణగణాలను, పనులను, స్వభావాలను పరస్పరం అర్థం చేసికొనే ప్రయత్నంచేయాలి. సంయమం పాటించగలగాలి. అనుశాసన బద్ధ జీవితాన్ని గడపగలగాలి. సంస్కారపూరిత వాతావరణాన్ని కల్పించడంలో వృద్ధులపాత్ర సమంజసంగా ఉండాలి. నియమానుసారంగా పరివార సభ్యుల మధ్య గోష్ఠులు జరుగుతుండాలి. కనీసం వారంలో ఒకటి రెండు రోజులు టి.వి.ని పక్కకుపెట్టి సభ్యులంతా కలసి మంచి-చెడు ముచ్చటించుకోవాలి. కలసి మెలసి కబుర్లు చెప్పుకుంటూ హాయిగా నవ్వుకోగలగాలి. అప్పుడప్పుడు అందరు కలసి వనభోజనాలకు, పార్కులకు పోయివస్తూ ఉండాలి. ఈ రకంగా చేస్తూఉంటే దాంపత్యజీవితంలో ఎదురయ్యే అసంతృప్తులు తొలగిపోతాయి. ఉత్సాహం కలుగుతూ ఉంటుంది. ఎన్ని సమస్యలు వచ్చినా చక్కగా పరిష్కరించుకోవచ్చు. తగిన ప్రేరణను పొందే కార్యక్రమాలు నడుస్తూ ఉండాలి. అప్పుడే గృహసమస్యలకు పరిష్కారం లభిస్తుంది. దేవ పరివారస్థాపన సాధ్యపడుతుంది.

★★★

కృతయుగంలో ధనం యజ్ఞాలకోసం.

ప్రత్యేక వ్యాసం : నానక్ జయంతి

# లాభసాటిబేరం

ఇప్పటికి సుమారు 500 సంవత్సరాల క్రిందటి అంటే 1526 నాటిమాట. లాహోర్‌కు సమీపంలో 'తలవండీ' అనే గ్రామం. ఆ గ్రామంలో ఖత్రీజాతికి సంబంధించిన వ్యక్తి కల్యాణచంద్. అతన్ని అందరూ 'కాలు' అని పిలిచేవారు. ఆ కుటుంబంలో కార్తీకపౌర్ణమి నాడు ఒక బాలుడు జన్మించాడు. ఆ బాలునికి నానక్ అని నామకరణం చేశారు.

నానక్‌కు ఏడేండ్లునిండాయి. పిల్లవానిని బడిలో చేర్పించారు. ఉపాధ్యాయుడు పలకమీద అంకెలు వ్రాసి ఇచ్చాడు. దిద్ది వ్రాసి చూపించుమన్నాడు. నానక్ పలకను అటూ ఇటూ త్రిప్పి చూచాడు. నుదుటిమీద ముడతలు పడ్డాయి. మెల్లగా గురువు గారి దగ్గరకు వచ్చాడు. "గురుదేవా! ఈ విద్యలన్నీ మనిషిని ఇరకాటంలో పెడతాయి. నిజమైన సుఖాన్ని, ఆనందాన్ని ఇచ్చే విద్యను నేర్పండి" అన్నాడు వినయంగా. గురువు ఆ మాటలువింటూనే అమితమైన ఆశ్యర్యానికి లోనయ్యాడు. సరే, బాబూ! అలాగే నేర్పిస్తాను. నిజమైన సుఖాన్నిచ్చే విద్య ఏదో ముందు నేను జాగ్రత్తగా పరిశీలించాలి. ఈలోగా అందరితోపాటు నేర్చుకో అన్నాడు. అలాగే అందరితో పాటు ఉపాధ్యాయుడు చెప్పిందే నేర్చుకుంటున్నాడు. చూస్తుండగానే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. హిందీభాషలో కొంత పరిజ్ఞానాన్ని, గణితంలో కొంత పరిజ్ఞానాన్ని సంపాదించాడు నానక్. కాని చదువుమీద శ్రద్ధ చూపలేక పోతున్నాడు.

నానక్ అందరిపిల్లల్లాగా ఆటపాటలతో కాలం గడిపేవాడు కాదు. ఏమాత్రం ఖాళీ దొరికినా ఒక మూల కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఆసనం వేసికొని భగవంతుని ధ్యానించే వాడు. అప్పుడప్పుడు తోటిపిల్లలను పిలచి భజనలు చేస్తూ, చేయిస్తూ ఉండేవాడు. ఇది కాలుకు అంతగానచ్చడంలేదు. చదువుకోమని చెపితే కొడుకు వినడంలేదు. ఏంచెయ్యాలో తోచని పరిస్థితి ఏర్పడింది. ఒకనాడు కొడుకును దగ్గరకు పిలిచాడు. ఒడిలో కూర్చోబెట్టుకుని బుజ్జగింపు మాటలు చెప్పాడు. 20 రూపాయలు చేతిలో పెట్టాడు. "నాయనా! ఇవి తీసికొని లాహోరు వెళ్లు. అక్కడ ఏదైనా లాభంవచ్చే వ్యాపారం చేసికో. కాని నిజాయితీని తప్పవద్దు. నీకు తోడుగా నమ్మకస్తుడైన ఒక పిల్లవానిని పంపుతాను." అంటూ ఒక పనిపిల్లవానిని అప్పచెప్పాడు. నానక్ 20 రూపాయలతోను, పనిపిల్లవానితోను లాహోరుకు పయనమయ్యాడు. ఇద్దరు కలసి అడవి మార్గంలో పోతున్నారు. దోవలో కొందరు స్వాములు తపస్సు చేసికుంటూ కనబడ్డారు. నానక్ వారి దగ్గరకు వెళ్లి భక్తితో నమస్కరించాడు. మాటలమధ్యలో వారు 7 రోజులనుండి భోజనం చెయ్యలేదని తెలిసింది. నానక్ ప్రక్కనే ఉన్న పనిపిల్లవానితో "వీరికి తిండిపెట్టడం కన్నా లాభాన్ని కలిగించే వ్యాపారం ఏముంటుంది? మన దగ్గరున్న 20 రూపాయలు వీరికి ఇచ్చేద్దాం" అన్నాడు. అతడు 'నీ ఇష్టం' అన్నాడు. నానక్ పరమానందంగా తనదగ్గరున్న 20 రూపాయలను తీసికొని వెళ్లి ఒక వృద్ధుని చేతిలో పెట్టాడు. ఆయన పిల్లవానిని దగ్గరకు తీసి "నాయనా! నీవు మీ నాన్న చెప్పిన మాటను విను. లాహోరు వెళ్లి వ్యాపారం చేసికో" అన్నాడు.

"అయ్యా! మానాన్న నీతిగా నిజమైన వ్యాపారం చేసికోమన్నాడు. ఇంతకన్నా నిజమైన వ్యాపారం నాకేమీ కనిపించడం లేదు. సాధుపురుషుల ఆకలి తీర్చడం అనేది చాలా లాభాన్ని చేకూర్చి పెడుతుంది. దయచేసి మీరు కాదనకండి. ఈ డబ్బును స్వీకరించండి." అని బ్రతిమలాడాడు. పిల్లవాని గుణగణాలకు వృద్ధుడు మురిసిపోయాడు. అభినందించాడు. మనసారా దీవించాడు. "డబ్బును మేమేం చేసికుంటాము? దీనితో తినడానికి కావలసిన సామాను తీసికొనిరా." అన్నాడు. నానక్ సంతోషంతో ఎగిరిగంతేశాడు. పనిపిల్లవాని సాయంతో ప్రక్కనే ఉన్న గ్రామానికి వెళ్లాడు. వంటకు కావలసిన పిండి, బియ్యం, పప్పు, కూరగాయలు మొదలైనవి కొని తెచ్చాడు, వారికిచ్చి మరొక్క సారి నమస్కరించాడు. ఆనందంగా ఇంటి ముఖం పట్టాడు. జరిగిన సంగతంతా ఆనందంగా తండ్రికి వినిపించాడు.

కాని తండ్రి కొడుకుమీద మండిపడ్డాడు. మూలనున్న కర్ర తీసికొని కొడుకును చితకబాదాడు. పాపం వాని అక్క వచ్చి ఏడుస్తూ అడ్డుపడింది. పిల్లవానికి శరీరమంతా గాయాలయ్యాయి. ఏడుస్తూ నుంచున్నాడే కాని ఒక్క మాటకూడ ఎదురు పలకలేదు. ఈ విషయం గ్రామాధికారికి తెలిసింది. ఆయనకు నానక్ గుణగణాలు బాగా తెలుసు. కాలును పిలిపించాడు. పసివాడిని చావబాదినందుకు మందలించాడు. 20 రూపాయలు తీసి చేతిలో పెట్టాడు. ఇంకెప్పుడూ పిల్లవానిని ఏమీ అనవద్దని ఆదేశించాడు. వానిని పెద్దక్క ఇంటికి పంపివేయుమని సలహా ఇచ్చాడు. అక్కడే ఏదైనా పని చూచుకుంటాడని నచ్చచెప్పాడు.

త్రేతాయుగంలో ధనం దానాలకోసం.

కాలు గ్రామాధికారి చెప్పినట్లే చేశాడు. నానక్ బావకు భజనలంటే చాల ఇష్టం. ప్రేమగా బావమరిదిని దగ్గరకు తీశాడు. ఆతని భజనలు, కీర్తనలు వింటూ సంతోషపడ్డాడు. క్రమంగా నానక్ అక్కడే పెరిగి పెద్దవాడయ్యాడు.

ఒకపిల్లను చూచి బావగారే పెండ్లికూడ చేశాడు. ఇద్దరు కొడుకులు పుట్టారు. కుటుంబ పోషణ కోసం ఒక గవర్నమెంట్ దుకాణంలో పనికి కుదిర్చాడు. కొన్ని సంవత్సరాలు పనిచేశాడు. రాను రాను అతనికి సంసారంమీద, సంపాదనమీద విరక్తి కలుగసాగింది. ఒకరోజున ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదలి వెళ్లిపోయాడు. మూడురోజుల తర్వాత సన్యాసిదుస్తుల్లో తిరిగి వచ్చాడు. చుట్టు ప్రక్కలవారిని పోగుచేశాడు. తాను పనిచేసే దుకాణాన్ని దోచుకోమన్నాడు. వారంతా ఒక్క ఉదుటునపోయి దుకాణాన్ని కొల్లగొట్టారు. గ్రామాధికారికి బాగా కోపంవచ్చింది. నానక్‌ను, వాళ్ల బావను పిలిపించాడు. "లెక్కలు చూపిస్తాను. నష్టాన్ని మీరే భరించాలి." అన్నాడు గట్టిగా. మనుషుల్ని పెట్టి లెక్కలు వ్రాయించాడు. విచిత్రం. ఆయనే నానక్‌ను 708 రూపాయలు ఇవ్వాల్సి వచ్చాడు. ఆయనతోపాటు అక్కడున్న వారందరూ ఆశ్చర్య పోయారు. గ్రామాధికారి నానక్‌ను క్షమాపణ కోరాడు. 708 రూపాయలను ఇవ్వబోయాడు. కాని నానక్ తీసికోలేదు. పేదవారికి సహాయం చెయ్యాల్సిందిగా కోరాడు. అందరూ చూస్తుండగానే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. శిష్యులుగా చేర్చుకోమంటూ ప్రజలు చుట్టుముట్టారు. అందరినీ వదిలించుకుని ఏమనాబాదుకు వెళ్లాడు. అక్కడ లాలూ అనే వడ్రంగి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉంటున్నాడు.

ఒకసారి "భాగూ' అనే ధనవంతుడు నానక్‌కోసం భోజనం తెచ్చాడు. అదే సమయానికి లాలూ కూడ భోజనం తెచ్చాడు. నానక్ భాగూ తెచ్చిన రొట్టెను వదలి లాలూ తెచ్చిన రొట్టెను తినడం మొదలు పెట్టాడు. అది చూచి భాగూ మండిపడ్డాడు. "నేను తెచ్చిన ఖరీదైన భోజనం వదిలి లాలూ తెచ్చిన ఎండు రొట్టెలను ఎందుకు తింటున్నావు?" అని గద్దించాడు. నానక్ నవ్వుతూ భాగూ తెచ్చిన రొట్టెలను ఒక చేతితోను, లాలూ తెచ్చిన రొట్టెలను రెండవ చేతిలోను పట్టుకున్నాడు. రెండింటినీ గట్టిగా పిండసాగాడు. ఆశ్చర్యం. లాలూ తెచ్చిన రొట్టెనుండి పాలచుక్కలు కారాయి. భాగూ తెచ్చిన రొట్టెనుండి నెత్తురు చుక్కలు రాలసాగాయి. భాగూ కన్నుల నుండి అశ్రుధారలు వర్షించాయి. వెక్కిళ్లు పెడుతూనే కారణం అడిగాడు.

"పేదవారిని పీడించి సంపాదించిన డబ్బుతో నీ రొట్టె తయారైంది. శ్రమపడి సంపాదించిన డబ్బుతో లాలూ రొట్టె తయారయింది." అని క్లుప్తంగా సమాధానం చెప్పి ఊరుకున్నాడు.

"భాగూ కన్నులు తుడుచుకున్నాడు. నానక్ పాదాలపై వాలిపోయాడు. తన సంపదనంతా బీదసాదలకు పంచిపెట్టాడు. నానక్‌కు శిష్యుడుగా చేరిపోయాడు. నానక్ మక్కా మదీనాతో సహా అన్ని క్షేత్రాలు తిరగసాగాడు. ఆతనికి హిందువులు, ముస్లిములు అన్న భేదం లేదు. అందరినీ మానవతా దృష్టితో ప్రేమించేవాడు. సిక్కులకు ఆది గురువుగా స్ఫూర్తినందించిన మహానుభావుడు. ఈయన 70 సంవత్సరాల వయస్సులో పార్థివ శరీరాన్ని వదిలి వేశాడు. బ్రతికి ఉన్నంతకాలం సత్యమార్గాన్నీ, ధార్మిక విషయాలనూ బోధిస్తూ ఆధ్యాత్మిక సేవలందించాడు. సిక్కు జాతికే కాక భారత జాతికే చిరస్మరణీయుడయ్యాడు.

★★★

## నిజమైన సేవ

*ఒకసారి బ్రహ్మసరోవరం దైవంతో ఏమన్నదంటే, "దేవా! గంగామాతని ప్రజలు వేయినోళ్ల కొనియాడుతూ ఉంటారు. ఆమె అందరిచేత అనేక విధాలుగా పూజలు అందుకొంటోంది. గంగ వలెనే నేను కూడా ప్రజలకు శీతలత్వం, సద్గతి లభింపచేస్తున్నా ఆమెకు దక్కే పూజలు, ప్రశంసలు నాకు బొత్తిగా లభించటం లేదు కారణం ఏమిటి?" ప్రశ్నిస్తుంది.*

*బ్రహ్మసరోవరంతో విష్ణువిలా అన్నాడు– "గంగ సకలజీవులను, జంగమ స్థావరాలను పునీతంచేస్తూ ఎల్లలు లేకుండా ప్రవహిస్తోంది. ఇంటింటికి వెళ్లి దాహం తీర్చి వారిని పునీతం చేస్తోంది. నీవలాకాదు, నీ దగ్గరకు వచ్చినవారికి మాత్రమే సద్గతి నిస్తున్నావు. అందుకే ఆమెకు దక్కిన పూజలు, ప్రశంసలు నీకు దక్కటము లేదు."*

*విష్ణువు వాక్కు ద్వారా గంగ యొక్క ఔన్నత్యాన్ని గురించి విన్న బ్రహ్మసరోవరం సిగ్గుతో తల వంచింది. ఆపైన ఆమె ఇటువంటి మనోవికారానికి ఎన్నడూ తావీయలేదు.*

**ద్వాపరయుగంలో ధనం యుద్ధాలకోసం.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-7

# అంజనీ ప్రియపుత్రుడు-మహారుద్రుడు

రాగరహితుడైన మతంగ మహర్షి అంజనాదేవి పుత్రుని చూడాలని తహతహలాడి పోతున్నాడు. ఈ విషయం వానరరాజు కేసరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తనలో తానే సన్నగా నవ్వుకున్నాడు. అంతే కాదు. ఏదో తెలియని చిన్నపాటి గర్వం కలిగింది. ఇక ఆయనకు కలిగిన ఆనందం గూర్చి చెప్పాలంటే ఎవ్వరి తరమూ కాదు. బంధరహితుడైన మహర్షిని అంజనీ దేవితో పుత్రికా బంధం చుట్టివేసింది. ఈ విషయం కేసరికి బాగా తెలుసు. ఇదంతా మహాకాలుని లీల అని మహర్షికి తెలుసు.

కేసరి మహర్షికి నమస్కరించి సాదరంగా లోనికి ఆహ్వానించాడు. "అంజని కుమారునితో సహా మీదర్శనం కోసం ఎదురుచూస్తోంది." అని వినమ్రంగా విన్నవించుకున్నాడు. మహర్షి తన శిష్యుడైన సువ్రతునివైపు చూచాడు. ఆ చూపుల సంకేతాన్ని గ్రహించిన సువ్రతుడు తమతోపాటు వచ్చిన మహర్షుల వైపు దృష్టిని సారించాడు. అందరు చిరునవ్వుతో అక్కడే కూర్చుండి పోయారు.

కపిరాజు ముందు నడుస్తూ ఉంటే మహర్షి అనుసరించాడు. ఆ భవ్య భవనంలోని దివ్య ద్వారాలను దాటుకుంటూ ఇద్దరూ వెళ్లి పురిటి గదివాకిట్లో నిలిచి పోయారు. పురిటి మంచం మీద పచ్చి బాలెంత అంజనీ దేవి శిశువుతో పాటు శయనించి ఉంది. మహర్షిని చూచి హడావుడిపడుతూ లేవడానికి ప్రయత్నించింది. కాని మహర్షి చేయెత్తి ఆశీర్వదిస్తూ వారించాడు. "బిడ్డా! నువ్వు విశ్రాంతి తీసుకో. నేను నీ చిరంజీవిని కళ్లారా తిలకించి వెళ్లుదామని వచ్చాను."– అన్నాడు.

అయినా అంజనాదేవి గౌరవ పూర్వకంగా మంచంపై లేచి కూర్చుంది. ప్రక్కనే ఉన్న దాసికి సైగ చేసింది. దాసి పసివానిని జాగ్రత్తగా రెండు చేతులతో పొదివి పట్టుకుని మహర్షి దగ్గరకు తీసుకొని వచ్చింది. దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న ఆ చిన్నారిని చూచి మతంగ మహర్షి ఒక్కక్షణం తన్ను తాను మరచిపోయాడు. తరువాత తదేకంగా బాలుని వైపు చూడసాగాడు. బాల సూర్యుని వంటి బాలుని చూస్తూ అంజనాదేవి అదృష్టాన్ని మనస్సులోనే మెచ్చుకున్నాడు. ఆవిధంగా చూచి చూచి కొంచెం సేపు కన్నులు మూసుకున్నాడు. అంతరంగంలో ఆనంద తాండవం చేస్తున్న భోలే నాథుని దివ్య స్వరూపాన్ని మరువలేకపోతున్నాడు. యుగ పరివర్తన కోసం జన్మించిన మహారుద్రుని అంజనీ పుత్రునిగా దర్శించి పులకించిపోయాడు.

ఈ దివ్యాను భూతినుండి తేరుకున్న మహర్షి మాతా శిశువుల నిద్దరినీ మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు. ఇది బహిరంగ చర్య. కాని అంతరాంతరాలలో మహాకాలునికి సహస్ర ప్రణామాలు సమర్పించు కున్నాడు. ఆయన ఆంతర్యాన్ని గ్రహించిన నూతన శిశువు ముగ్ధమోహనమైన చిరునవ్వును అద్భుతంగా ప్రదర్శించాడు. ఆ నవ్వును తిలకించిన మహర్షి శరీరం రోమాంచితమైంది. మనస్సులోని ఆనందాతిరేకాన్ని ఆయన బయటపడనియ్య లేదు. మౌనంగా వెనుదిరిగాడు.

అంజనీదేవి భర్తకు సున్నితంగా సైగ చేసింది. వెంటనే కేసరి మహర్షి పాదాలదగ్గర మోకాళ్లపై కూర్చున్నాడు. "దేవా! మా ఈ అదృష్టానికంతటికి మూల కారకులు మీరే. మా ప్రార్థన ఏమంటే...." కొద్దిగా సందేహించాడు. మహర్షి కేసరిని ఆప్యాయంగా లేవనెత్తాడు. వెన్ను నిమురుతూ "వానర రాజా! చెప్పు. నీ మనసులోని మాటను నిస్సంకోచంగా చెప్పు." అన్నాడు. స్వామీ! మీరు మీ ఋషి గణంతో సహా ఈ శిశువుకు నామకరణం అయ్యేదాక ఇక్కడే విశ్రమించాలని మా కోరిక– అని విన్నవించుకున్నాడు. దానికి సంతోషంగా ఒప్పుకున్నాడు మహర్షి. కాని ఒక్క షరతు పెట్టాడు. కుమార్తె ఇంటిలో తండ్రి ఎక్కువకాలం ఉండడం సరియైన పద్ధతికాదు. మేము నీ భవనంలో కాకుండ ప్రక్కనే ఉన్న ఉపవనంలో నిర్మించబడిన శివాలయంలో ఉంటాము. కేసరి ఆనందంగా సరే నన్నాడు. తమ చిరంజీవికి ఇంతమంది తపోధనుల ఆశీర్వాదం లభించబోతున్నందుకు ఆ వానర దంపతుల ఆనందం వర్ణనాతీతం.

కేసరి మహర్షిని వెంటబెట్టుకొని బయటకు వచ్చాడు. బయట ఉన్న ఋషులంతా వీరికోసమే ఎదురుచూస్తున్నారు. మతంగుడు

కలియుగంలో ధనం భోగవిలాసాలకోసం.

ఋషులతో "ఋషులారా! మనమంతా ఇంకా కొన్నిరోజులు ఇక్కడనే ఉందాం. ప్రక్కనే ఉన్న ఉపవనంలోని శివాలయమే మన ఆవాస స్థలం." అన్నాడు. వారంతా మీ అభిప్రాయమే మా అభిప్రాయం అన్నారు.

మహర్షి తనతోటి ఋషులతో కలసి ఉపవనంలో ప్రవేశించాడు. ఆ వనం పండ్లతో నిండిన చెట్లతో, అందమైన పూల చెట్లతో, లతలు తీగలతో మనోహరంగా ఉంది. ఆ వనంలోనే అందమైన శివ మందిరం ఉంది. ఆ మందిరానికి చుట్టుప్రక్కల ఋషులకు ఆవాసం ఏర్పాటు చేశారు. కేసరి వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూచుకోసాగాడు. మంచినీటి సౌకర్యాలు కల్పించాడు. ప్రక్కనే అందమైన సరోవరం ఉంది. దాని నిండుగా సుందరమైన కమలాలు విచ్చుకుని ఉన్నాయి. రాజహంసలు వయ్యారంగా ఈదుకుంటూ తిరుగుతున్నాయి. అందమైన లేళ్లు వనమంతా గెంతుకుంటూ తిరుగుతున్నాయి. పక్షుల కిలకిల రావాలు వీనుల విందు చేస్తున్నాయి. ఇక ఆ ఋషుల ఆనందానికి అవధులే లేవు.

సంతృప్తిగా మతంగ మహర్షి ఆకాశంవేపు తలఎత్తి చూచాడు. పడమట సూర్యుడు అస్తమిస్తూ కనిపించాడు. మునులవైపు తిరిగి "చూచారుగా! సూర్యుడు పడమటి దిశకు పోతున్నాడు. మనకు సంధ్యోపాసనచేసే సమయమైంది. స్నానాలు చేద్దాం పదండి." అన్నాడు. వారంతా స్నానాదులు ముగించుకుని, సంధ్యా వందనం చేశారు. తరువాత మధుర స్వరంతో రుద్ర స్తవనం చేశారు. మహర్షి మాటిమాటికీ మనస్సులో సదాశివునికి జయధ్యానాలు చేశాడు.

మతంగ మహర్షి ఋషులందరికీ ఉపవన సౌందర్యాన్ని వర్ణించి చెపుతూ "ఈ ప్రకృతి ఇంతగా ఎందుకు పరవశించిపోతోందో తెలుసా? వినండి. అంజనీదేవి పుత్రుడు మహారుద్రుడే. మరెవరో కాదు. ఆ భోలేనాధుడే అంజనీ గర్భంలోనికి తన 11వ అంశాన్ని ప్రవేశపెట్టాడు. ఆ పరమేశ్వరుని ఈ అవతరణ యుగపరివర్తన కొరకే. ఈ అవతారంలో రాక్షస సంహారంతోపాటు, ఆధ్యాత్మిక సాధనను పెంపొందించడమే ప్రధాన లక్ష్యం." అని వివరించాడు. వారంతా ఈ రహస్యాన్ని తెలుసుకుని పరమానంద భరితులయ్యారు. అందరూ ఆ మహాశిశువు నామకరణ మహోత్సవానికి ఎదురుతెన్నులు చూడసాగారు.

★★★

## పదవి? - సేవ?

*22 అక్టోబరు 1876న గుజరాంవాలా అనే గ్రామంలో ఒక బాలుడు జన్మించాడు. అతడే తీర్థరామ్. చదువు సంధ్యలలో మేటి. పంజాబు రాష్ట్రానికి సంబంధించిన ఎంట్రన్స్ పరీక్షలో ప్రప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. లాహోరులో విద్యార్థిగా విద్యను కొనసాగించాడు. ట్యూషన్లు చెప్పుకుంటూ తన చదువుకు కావలసిన ధనాన్ని సంపాదించుకునేవాడు. బి.ఎ.లో కూడ ప్రథమ స్థానాన్ని పొందాడు. ఎమ్.ఎ. చదవటానికి ఫారమ్ పూర్తిచేస్తున్నాడు. ఆ కాలేజీ ఆంగ్లప్రిన్సిపాల్ చూచాడు. తీర్థరాముని తెలివితేటలపై ఆయనకు మిక్కిలి అభిమానము. "రామూ ! నిన్ను ఐ.సి.ఎస్.లో చేర్చుకోవలసిందిగా నేను రికమెండ్ చేస్తాను. చదువుకో." అన్నాడు.*

*దానికి తీర్థరాము సూటిగా సమాధానమిచ్చాడు. "నా చదువు నా తెలివితేటలు ఉన్నత పదవుల కోసం కాదు. భగవంతుడిచ్చిన ఈ సంపదను ఆ భగవంతుని బిడ్డలకే పంచిపెట్టుతాను. నా యీ అమూల్య సంపదను ప్రజాసేవలోనే వినియోగిస్తాను. విదేశీ పాలనలో ఐ.సి.ఎస్. గా ప్రజలకు నేను న్యాయం చేయలేను." ప్రిన్సిపాల్ నిరుత్తరుడయ్యాడు.,*

*తీర్థరాముని మీద వివేకానందుని ప్రభావం అధికంగా పడింది. ఒక రోజున ఆయన ఉత్తరాఖండ్ అడవులకు వెళ్లాడు. అక్కడ నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. అక్కడే తీర్థరామ్ రామతీర్థగా ఖ్యాతి పొందాడు. టెహరీరాజు కోరికమీద టోకియోలో జరుగుతున్న విశ్వధర్మసమ్మేళనంలో పాల్గొన్నాడు. జపాను, అమెరికా, యూరోప్, మిస్ర్ మొదలైన దేశాల్లో పర్యటించి సాధారణ వేదాంతాన్ని బోధించాడు. 1906లో దీపావళి రోజున తాను రచించిన "మృత్యువు యొక్క ఆహ్వానము" గ్రంథాన్ని శిష్యునికి అప్పగించాడు. అప్పటికాయన వయస్సు 33 సంవత్సరాలు. వెంటనే గంగానదిలో జలసమాధి అయ్యాడు. ఇటువంటి మహాత్మునికి జన్మనిచ్చిన భరతమాత ధన్యురాలు.*

**ధనాంధునికి సరిపడే కళ్లజోడేలేదు.**

ముఖచిత్రకథనం

# ఎర్రకాగడా-ఒక విశ్లేషణ

యుగఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత శ్రీరామశర్మ ఆచార్య యుగనిర్మాణం చెయ్యాలన్న సంకల్పం తీసికున్నారు. "శుభస్యశీఘ్రం." అనుకున్నదే తడవుగా గాయత్రీపరివార్‌ను స్థాపించి మహోద్యమం చేపట్టారు. దానిని అనుసరించే మన ఆలోచనలు, యోజనలు, పద్ధతులు, ప్రయత్నాలు అన్నీ ఒక నియమితరూపంలో నడుపబడుతున్నాయి. దీని ప్రత్యేక మూలసూత్రం వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని, పూర్తిదేశాన్ని, క్రమంగా విశ్వాన్నే మొదలంటా మార్చివేయాలన్న ప్రధాన లక్ష్యం. దీని ఆధారంగా ఏకత్వం, సమానత్వం యొక్క పరిపూర్ణ రూపురేఖలతో "వసుధైక కుటుంబకమ్" అన్న పరికల్పనకు ప్రాణంపోయడం జరిగింది. ఈ ఘోషణావాక్యాన్ని మనం సరిఅయిన పద్ధతిలో అర్థం చేసికోవాలి. దానిని గురించిన మనన, చింతన జరగాలి.

యుగ పరివర్తన కొరకు ఒక ప్రత్యేక అవతారం రావాల్సి ఉంటుంది. అది మొట్టమొదట "ఆకాంక్ష" రూపంలో ప్రత్యక్షం అవుతుంది. ఈ అవతారం యొక్క సూక్ష్మరూపం "యుగ నిర్మాణ సత్సంకల్పం" అని గట్టిగా చెప్పవచ్చు.

## "దీపం జ్యోతి పరబ్రహ్మ"

పరబ్రహ్మయొక్క స్వరూపమే దీపం. భారతీయ సంప్రదాయంలో దీపానికి ప్రముఖస్థానం ఇవ్వబడింది. అంధకారాన్ని పటాపంచలు చేస్తుంది దీపం. అజ్ఞానాన్ని పటాపంచలుచేస్తుంది జ్ఞానజ్యోతి. కోటి కోటి దీపాలవెలుగులో దీపావళీ అమావాస్యను నిండు పున్నమిగా జరుపుకుంటాం. కార్తీకం ప్రవేశించింది. కార్తీక మాసం అనగానే కార్తీక దీపం కన్నులముందు కదలాడుతుంది. కార్తీక దీపకాంతులు సినిమా దర్శకుల హృదయాలను కూడ స్పర్శించగలిగాయి. ఈ మాసమంతా ఎక్కడ చూచినా దీపాలకాంతులే. సాయంత్రం అయిందంటే చాలు ఇంటి ముంగిట్లో జంటదీపాలు. దేవాలయ ప్రాంగణంలో ఆకాశదీపాలు. తెల్లవారుజామున అరటి దొప్పల్లో అందాల దీపాలు నీటిపై తేలి ఆడుతూ ఉంటాయి.

పరమపూజనీయ గురుదేవులు, 1926 వసంత పంచమినాడు అఖండ దీపస్థాపన చేశారు. వారి గురుదేవులు సర్వేశ్వరానందుల వారి ఆదేశాన్ని శిరసావహించి అదే రోజున గాయత్రీ మహామంత్ర పురశ్చరణ ప్రారంభించారు. మాతాజీ అఖండదీపాన్ని చంటిబిడ్డలా చూచుకుని సంరక్షించేవారు. ఆవునేతితో వెలిగించిన దీపకాంతులు గురుదేవులకు దివ్య సలహాదారుగా పని చేసేవి. ఏ సమస్య వచ్చినా ఆ దీపానికి ఎదురుగా కూర్చుని ధ్యానించేవారు. క్షణంలో సులువైన పరిష్కారమార్గం లభించేది. దాంతో ఆ దీప కాంతులను ఇంటింటా చేర్పించే ఆలోచన చేశారు. దాని స్వరూపమే ఎర్ర కాగడా. ఆనాటి నుండి ఎర్ర కాగడా గాయత్రీ పరివార్‌కు మార్గదర్శిగా పని చేస్తోంది. సాక్షాత్తు గురుస్వరూపంగా భావించి గౌరవిస్తున్నాం. పూజిస్తున్నాం.

పూర్వకాలం యుద్ధాలకు వెళ్లాలన్నా, శుభకార్యాలు జరపాలన్నా, ఉత్సవాలు- ఊరేగింపులు సాగాలన్నా మార్గదర్శనం కోసం కాగడాలనే ఉపయోగించేవారు. ఈనాడు పరబ్రహ్మ స్వరూపమైన అఖండ జ్యోతినుండి బయలుదేరిన ఎర్ర కాగడా కోట్లాది పరిజనులకు మార్గదర్శి అయింది. గురుదేవుల పరోక్ష రూపం (లాల్‌మశాల్) ఎర్రకాగడా.

## జన సమూహం

ఈ కాగడా అనే వృక్షానికి మూలాధారమైన వేర్లు దేవమానవులు. మామూలు మానవులకు, దేవమానవులకు హస్తిమశకాంతరం ఉంటుంది. మానవులు సహజంగా నాలుగు విధాలుగా ఉంటారు. (1) ఉత్తములు (2) మధ్యములు (3) అధములు (4) అధమాధములు.

**1. ఉత్తములు:-** తాము నష్టపోయినా కూడ ఇతరులకు మేలును చేకూరుస్తారు. ఇతరులకు మేలు జరిగే పక్షంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయరు. **ఉదా:-** దధీచి, కర్ణుడు మొదలైనవారు.

**2. మధ్యములు:-** వీరు తమపనిని తాము చేసికుంటూ ఇతరులకు ఉపయోగపడుతూ ఉంటారు. స్వార్థంతో పాటు పరమార్థానికి కూడ ప్రాధాన్యతనిస్తారు. పుణ్యంకోసం వెంపర్లాడుతూ దాన ధర్మాలు చేసేవారు ఈ కోవకు చెందినవారే.

**3. అధములు:-** వీరు ఏపని చేసినా "నాకేంటి లాభం?" అని ఆలోచిస్తారు. స్వలాభం లేకపోతే పరోపకారం జోలికే పోరు. ఈనాటి లంచావతారులు ఈ కోవకు చెందినవారే.

**4. అధమాధములు:-** వీరు తమకేమాత్రం లాభం లేకపోయినా ఇతరులను నష్టపరచి, హింసించి రాక్షసానందాన్ని అనుభవిస్తారు. ఇతరులు వ్యథ చెందడమే వీరికి వెర్రి ఆనందం. వీరికి స్త్రీ- పురుష, బాల- వృద్ధ, కుల- మత, ధనిక- పేద, జ్ఞాన- అజ్ఞాన, భాషా భేదాలు అడ్డురావు. ఈనాటి టెర్రరిజం ఈ కోవకు చెందినదే.

## హస్తము

జనసమూహం యొక్క సంగఠిత శక్తి "ఇంతింతై వటుడింతయై" అన్నట్లు విశ్వరూపం ధరించింది. ఆ విశ్వరూపమే బలిష్ఠమైన హస్తంగా

జన్మ సంస్కారం కూడ ధనం ఉన్నప్పుడు మసకబారుతుంది.

రూపుదిద్దుకుని ఎర్రకాగడాను తన పిడికిట్లో బంధించింది. పటిష్ఠమైన ఆ చేతివ్రేళ్లు కాగడా కర్రను దృఢంగా పట్టుకున్నాయి. బంధుబలగమంతా చుట్టుముట్టి నడుస్తూ ఉంటే జయ జయ ధ్యానాలతో వీరోచితంగా ముందుకు సాగుతోంది. అది చూడడానికైతే ఒకే హస్తం. కాని వాస్తవానికి కోట్లాది పరిజనులు సామూహిక శక్తి, దుర్గాశక్తి దానిలో నిక్షిప్తమై ఉంది. ఎటువంటి బలీయమైన దుష్టశక్తులనైనా ఎదుర్కోగల ధైర్యసాహసాలతో, వెలుగులను చిమ్ముతూ అడుగులు వేస్తోంది.

## కాగడా

ఆవిధంగా కదులుతున్న కాగడా ప్రజాహృదయాలలో సమైక్యతా జ్యోతులను వెలిగిస్తూ నవయుగ నిర్మాణానికి మార్గం చూపిస్తోంది. ఒక దీపంతో మరియొక దీపం వెలిగించబడుతోంది. అది పయనిస్తున్నంతమేరా నూతన జనసమూహం వచ్చి చేరుతోంది. భుజం భుజం రాసుకుంటూ, కదంకదం కలిపి కదనుతొక్కుతూ కదలిపోతోంది. ఆ కాంతికిరణాలు కన్నులు అప్పగించి చూస్తూ నిలబడ్డ నిరాశావాదుల్లో ఆశాకిరణాలను ఆవిర్భవింప చేస్తున్నాయి. స్వాతంత్ర్య సమరంనాటి రాజకీయ ఉద్యమాలను తలపింప చేస్తున్నాయి. నూతన ఆలోచనా తరంగాలు ఉబికి ఉబికి వస్తున్నాయి. ఈ ఆలోచనాతరంగాల ఉద్యమం మహోద్యమంగా మారిపోతున్నది. దేశదేశాల సరిహద్దుల్ని తుడిచి వేస్తోంది. అదే **నవ సృజన**. అదే మన **మహా సంకల్పం.**

## ప్రభామండలం

దేదీప్యమానంగా ముందుకు సాగిపోతున్న ఎర్రకాగడా తన దృఢ సంకల్పాన్ని గట్టిపరచుకుంటోంది. దేవమానవ సమూహాన్ని వెంట నడిపించుకుపోతూ ఉన్నది. సంగఠిత శక్తి యొక్క స్వరూపాన్ని సామాన్యులకు కూడ అవగతం చేస్తోంది. నూతనంగా ఆవిర్భవించిన శక్తియుక్తుల్ని ఒక ప్రభామండలంగా తీర్చిదిద్దుతోంది. ఎటు చూచినా కనుచూపుమేరలో వెలుగుల చక్రం కండ్లకు మిరుమిట్లు గొలుపుతోంది. మున్ముందుకు సాగిన కొద్దీ దాని విస్తీర్ణం పెరిగిపోతోంది. ఆ ప్రభామండలాన్ని ఈశ్వరీయ చైతన్యం రక్షక వలయంలా చుట్టివేసింది. విరామంలేకుండా నిరంతరం సంరక్షిస్తూ ఉంది. ఈ నూతన ఆలోచనా తరంగాల ఉద్యమం (విచారక్రాంతి అభియాన్) ఆగదు. ఈ ఎర్ర కాగడాకు విశ్వంలోనే ఎదురులేదు.

## యుగనిర్మాణ సత్సంకల్పాలు

పరమ పూజనీయ గురూజీ, పరమవందనీయ మాతాజీల సత్సంకల్ప బీజంతో ఎర్ర 'కాగడా' అనే వట వృక్షం ఆవిర్భవించింది. ఈ మహావృక్షానికి ఋషియుగ్మం తల్లివేరైతే, వారి కనుసన్నల్లో మెలిగిన దేవమానవులు పిల్లవేర్లు. ఈ మహావటవృక్షం యొక్క ఊడలు దేశదేశాలలో విస్తరించాయి. యుగనిర్మాణ నిమిత్తం ఫలించిన సత్సంకల్ప ఫలాలు అందరినీ ఆలోచింప చేస్తున్నాయి. ఆచరింప చేస్తున్నాయి.

**1.** మేము ఆస్తికతను, కర్తవ్య పరాయణతను మానవ జీవితం యొక్క ధర్మంగా, కర్తవ్యంగా గుర్తిస్తాము.
**2.** శరీరాన్ని భగవంతుని ఆలయంగా భావించి, సంయమనం, నియమపాలన ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకుంటాము.
**3.** మనస్సును జీవితముయొక్క కేంద్రబిందువుగా గుర్తించి దానిని ఎల్లప్పుడూ స్వచ్ఛంగా ఉంచుకుంటాము.
**4.** చెడు ఆలోచనల నుండి రక్షించుకొనుటకు నిత్యం స్వాధ్యాయ, సత్సంగాలను ఏర్పాటు చేసుకుంటాము.
**5.** మమ్ము సమాజం యొక్క అభిన్న అంగంగా గుర్తుంచుకొని అందరి క్షేమమే మా క్షేమంగా ఎంచుకుంటాము.
**6.** వ్యక్తిగత సుఖం, స్వార్థం కంటె సామూహిక స్వార్థానికి ప్రాముఖ్యతనిస్తాము.
**7.** నాగరికత, నైతికత, మానవత్వము, సచ్చరిత్రత, ఉదారత, ఆత్మీయత, సమత, సహిష్ణుత, శ్రమశీలతలాంటి సద్గుణాలను నిజమైన సంపదగా గుర్తించి వ్యక్తిగత జీవనంలో పెంపొందించుకుంటాము.
**8.** సాధన, స్వాధ్యాయం, సంయమం, సేవాకార్యాలలో సోమరితనం, పొరపాటు జరగనీయము.
**9.** నలువైపుల మాధుర్యము, స్వచ్ఛత, సౌజన్యం, నిరాడంబరతతో కూడిన వాతావరణాన్ని పెంపొందిస్తాము.
**10.** సాంప్రదాయాలకంటె వివేకపూరితమైన ఆచరణకు ప్రాముఖ్యతనిస్తాము.
**11.** అవినీతితో పొందిన సాఫల్యముకంటె నీతిమార్గమున పొందిన పరాజయాన్ని శిరసావహిస్తాము.
**12.** వ్యక్తి విలువను అతని విద్యార్హత, సంపద ద్వారాకాక, అతని సత్కర్మలు, సదాలోచనల ద్వారా గుర్తిస్తాము.
**13.** మా జీవితాన్ని స్వార్థం కొరకు గాక, పరమార్థం కొరకు వెచ్చిస్తాము.
**14.** ప్రపంచంలో సత్ ప్రవృత్తుల పుణ్యప్రచారం కొరకు మా సమయం, జ్ఞానం, శ్రమ, పలుకుబడి, సాధ్యమైనంతగా వెచ్చిస్తాము.
**15.** ఇతరులు మా యడల ఏ విధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో మేము ఇతరులయడ ఆ విధంగానే ప్రవర్తిస్తాము.
**16.** కష్టపడి నీతిగా సంపాదించిన ధనమునే స్వీకరిస్తాము.
**17.** పతివ్రతాధర్మాన్ని / పత్నీ వ్రతధర్మాన్ని పరిపూర్ణ నిష్ఠతో పాటిస్తాము.
**18.** "మనిషి తన భాగ్యాన్ని తానే నిర్మించుకుంటాడు" అన్న విశ్వాసంతో మనం మారి ఇతరులను మార్చడానికి ప్రయత్నం చేస్తే యుగం మారుతుంది. మన యుగ నిర్మాణ సత్సంకల్పం సంపన్నమై తీరుతుంది.

★★★

ధర్మబద్ధమైన కామం ఆనందాన్నిస్తుంది.

తత్వ చింతన

# త్రవ్విన గోతిని పూడ్చడం-ప్రాయశ్చిత్తం

మనిషి ఒకోసారి తెలిసో తెలియకో పొరపాటు చేస్తాడు. ఆ చెడ్డ పని అతడి ఆత్మిక ప్రగతికీ, వ్యక్తిత్వ వికాసానికీ అవరోధం అవుతుంది. ఎందుకంటే- అనైతికమూ, అవాంఛనీయమూ అయిన పని చేయడంవల్ల ఆత్మనింద జరుగుతుంది. ఇది అంతరంగాన్ని నిరంతరం వేధిస్తూ ఉంటుంది. ఈ ఆత్మ వ్యధ నుండి విముక్తి పొందడానికి ఒకే ఒక మార్గం- ప్రాయశ్చిత్తం.

చెడ్డ పనుల, చెడు ఆలోచనల సంస్కారం విషంతో కూడిన పొరగా చేతన మస్తిష్కాన్నీ, అచేతన మనస్సునూ ఆవరించి ఉంటుంది. కాలక్రమంలో ఇది మనస్సు యొక్క చంచలత్వంగా, ఉద్విగ్నతగా, అస్థిరత్వంగా, ఆవేశంగా, క్షోభగా వ్యక్తమవుతూ ఉంటుంది. వ్యక్తి యొక్క మనస్సు వికలం అవుతుంది. ఆ స్థితిలో మనిషి ఏ పనినీ ఏకాగ్రతతో చేయలేడు. వైఫల్యాలు అతడిని వెన్నాడతాయి. స్థిమితంలేని అతడి వ్యవహారంవల్ల వ్యక్తులు దూరమవుతారు, విరోధులు అవుతారు. దారితప్పిన మనస్సు జీవితాన్ని ముళ్లపొదలలోకి నెట్టుతుంది. మనిషికి దుఃఖమే మిగులుతుంది, దైన్యమే మిగులుతుంది.

కనుకనే- పొరపాట్లను ఒప్పుకుని, వాటికి ప్రాయశ్చిత్తం చేసుకునే ఆచారం అన్ని మతాలలో ప్రాచీన కాలంనుండి కొనసాగుతున్నది. పాపం చేసిన వ్యక్తి ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే- అతడికి మోక్షం లభించదు; కనీసం సుఖ సంతృప్తులతో కూడిన జీవితమైనా లభించదు. కనుకనే- ప్రతి మతం 'పాపానికి' ప్రముఖ స్థానం ఇస్తోంది. పశ్చాత్తాపం చాలదనీ, ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ బోధిస్తోంది. త్రోవలో గొయ్యిత్రవ్వబడి ఉంది. అందుకు దాన్ని త్రవ్వడానికి జరిగినంతగా పూడ్చడానికి ప్రయత్నం జరగాలి.

యూదు, క్రైస్తవ మతాలలో పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకునే ఆచారం మొదటినుంచీ ఉంది. ప్రతి యూదు మతస్థుడూ తన పాపాలను గుర్తించాలనీ, ఒప్పుకోవాలనీ, వాటికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ 'ఓల్డ్ టెస్టమెంట్'లో పలుమార్లు బోధించబడింది. యూదులు 'యామ్ కిపుర్'కు ముందురోజు సాయంత్రం నుండి తర్వాతి రోజు సాయంత్రం వరకు ప్రాయశ్చిత్తం కోసం ప్రార్థనలు చేస్తారు, చింతన-మననం చేస్తారు.

క్రైస్తవులు ప్రాయశ్చిత్తాన్ని 'పాప స్వీకార సంస్కారం'గా జరుపుతారు. ఇప్పుడు దీన్ని 'పవిత్రీకరణ సంస్కారం' అని పిలుస్తున్నారు. క్రైస్తవ మతంలో 'కన్‌ఫెషన్'కు, పాప స్వీకారానికి, హెచ్చు ప్రాధాన్యం ఉంది. "చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది." అన్న నానుడి ఉండనే ఉంది కదా !

ముస్లింలు తాము రోజూ చేసే నమాజులో తమ పాపాలను క్షమించవలసిందని ఖుదాను కోరుతారు. పాపాన్ని అంగీకరించి ప్రాయశ్చిత్తం చేసుకుంటే ముక్తి లభిస్తుందని పారసీలు నమ్ముతారు.

బౌద్ధ భిక్షువులు బుద్ధ భగవానుని సమక్షంలో సంఘం సమక్షంలో నెలకు రెండు మారులు పాపాలను అంగీకరించి ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

హిందూ మతంలో పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకునే కర్మకాండ నిర్ణయించబడి ఉంది. ప్రాయశ్చిత్తం ద్వారానే అవాంఛనీయ ఆచరణలవల్ల కలిగే మాలిన్యం శుభ్రపరచబడుతుంది. ప్రాచీన కాలంలో కొన్ని కొన్ని చోట్ల అపరాధులను గ్రామంనుంచి, కులంనుంచి వెలివేసేవారు. హత్య చేసిన అపరాధి నోటిమీద గుడ్డ కట్టుకుని ఇంటింటికీ వెళ్లి బిచ్చం అడగవలసివచ్చేది. వ్రతాలు, తపస్సులు, తీర్థయాత్రలు, దానధర్మాలు, సేవా కార్యాలు- అన్నీ ప్రాయశ్చిత్తంలో అంతర్భాగాలుగా ఉండేవి.

తన పొరపాట్లను ఒప్పుకోవడం, అందుకు సిగ్గుపడడం, భవిష్యత్తులో అవి జరపకపోవడం- అనే భావన ప్రాయశ్చిత్తం చేసుకునే వ్యక్తి మనస్సులో బలంగా ఉండాలి. నిండు మనసుతో చేసిన ప్రాయశ్చిత్తంవల్ల మనస్సు తేలిక అవుతుంది; జీవితంలో సుఖ శాంతులూ, పవిత్రత సహజంగా చోటుచేసుకుంటాయి.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**ఆవేశంలో నిర్ణయం - అనర్థాలకు మూలం.**

ధారావాహిక : దేవసంస్కృతీ సౌరభం-18

# అధ్యాత్మవాదము

ఆత్మ చావు, పుట్టుకలులేనిది. జీవుడు శరీరానికి వేరైనవాడు. శరీరంతో బాటుగా జీవుడు మరణించడు. మరణానంతరమూ బ్రతికే ఉంటాడు. మరల ఇంకొక శరీరాన్ని ధరిస్తాడు. మనవేద, శాస్త్రాలలో ఈ విషయాన్ని నిరూపించే ప్రమాణాలు ఎన్నో ఉన్నాయి. తానొక్కడే అయినా అనేకంగా తయారుకావడానికి సంకల్పించిన నాడే జీవనమన్నది ప్రారంభమౌతుంది. మనందరిలో ఆత్మకలదు. సార్వభౌమ చైతన్యమైన పరమాత్మ నశించనివాడైనప్పుడు ఆతనికి చెందిన పరమాణువు నశించేదెట్లా కాగలుగుతుంది? సూర్యుడు ఎంతవరకుంటాడో అంతవరకూ వేడికూడా ఉంటుంది. అదే విధంగా పరమాత్మయొక్క అంశకూడా అమరంగానే ఉంటుంది. మనిషియొక్క గొప్పతనం అతని ఆత్మయొక్క గొప్పతనంలోనే ఇమిడి ఉంటుంది. మంచి గుణాలు కలవాడు, విద్వాంసుడు, బుద్ధిమంతుడు, కౌశల్యముకలవాడు ఐనవ్యక్తికి పేరు, ప్రఖ్యాతులుంటాయి. మతిహీనుడిని ఎవరూ ఆదరించరు. కట్టుకున్న బట్టలకన్న శరీరము యొక్క స్థాయి గొప్పది. ఆ శరీరం కన్న ఆత్మ గొప్పది. “మానవులారా! జీవన మర్మాన్ని అర్థం చేసుకోండి, జీవనం యొక్క నిగూఢ సమస్యలను గురించి ఆలోచించండి. జీవనం అఖండం. ఈ సత్యాన్ని గమనించి హృదయంగమం చేసుకోండి. ఏరోజున నిజమైన జీవనానికి, అఖండ జీవనానికి మీరు ప్రాధాన్యతనిస్తారో, ఆ గొప్ప జీవనానికి కలిగే హాని, లాభాలను దృష్టిలోపెట్టుకుని వర్తమానం మనకు చెందిన సిద్ధాంతాలను గురించి, కార్యాలను గురించి ఆలోచిస్తారో ఆరోజుననే ప్రగతిని సాధిస్తారు” అని చెబుతోంది.

భారతీయ సంస్కృతిలో నాలుగింటిని పురుషార్థములుగా భావించడం జరిగింది. అవి– 1) ధర్మం, 2) అర్థం, 3) కామం, 4) మోక్షం. ఈ నాలుగింటికీ ఎంతో విశాలం, వ్యాపకం అయిన అర్థముంది. దానిని గురించి ఆలోచించాలి. ధర్మ, అర్థ, కామాలు వెంటనే సంపాదించదగినవి. కారణమేమంటే వీటికి మన రోజువారీ జీవనంతో సంబంధముంది. చివరి పురుషార్థం (అనగా మోక్షం) పైన తెలిపిన మన మూడు విధాలయిన కర్మలమీద ఆధారపడినది.

మొదటి పురుషార్థము “ధర్మము” ధర్మమన్నమాటకు చాలా వ్యాపకమైన అర్థం ఉంది. దానిలో ఆయా ధార్మిక, సామాజిక, నైతికములయిన మన కర్తవ్యాలన్నీ కలిసి ఉన్నాయి. ప్రతి పరిస్థితిలోనూ మనిషికి ఏమేమి కర్తవ్యాలుంటాయో అవన్నీ ధర్మం అన్న మాటలో ఇమిడి ఉంటాయి. మన శాస్త్రాలలో గల ఆచరణ కూడా ధర్మమన్న మాటలో అంతర్గతమైనదే. ధర్మమన్నది ఉపయోగపడే ఆ సిద్ధాంతాల సమూహ స్వరూపమే. అవే రోజువారీగా మన జీవనంలో సమస్యలకు పరిష్కారాలను అందిస్తాయి. జగత్తును స్వర్గంగా తయారుచేయగలవారు, సమాజంలో దరిద్రతను, అజ్ఞానాన్ని దోపిడీని అంతం చేసే ఉత్సాహం గలవారి చేతులలోనే ధర్మం సురక్షితంగా ఉండగలుగుతుంది. ఈ జీవనానికి సమాజం యొక్క నైతిక జీవనానికి, జాగృతికి ధర్మం ఎంత అవసరమో అంతగా మరో ప్రపంచానికి అవసరం లేదు. ధర్మం మనిషి వికాసానికి పనికివచ్చే కర్తవ్యాల సమూహం. ధర్మం జీవనానికి చెందిన ప్రతివిభాగానికి ఉపయోగపడేది.

ధర్మం ఆత్మయొక్క గుణం. అది ఏ పుణ్యపురుషుని అంతఃకరణలో ప్రవేశిస్తుందో అతనిని కాంతిపుంజంగా తయారు చేస్తుంది. అతను బిచ్చమెత్తుకునే వాడుగా గాక దాతగా తయారవుతాడు. విశ్వమంతా అతనికి ఋణపడిఉంటుంది. నిజమైన ధార్మికుడు ప్రాణాన్ని కాపాడుకోవడంకోసం ధర్మగ్రంథాల అండను వెతుక్కోడు, ఇతరుల కోసం దధీచివలె తన ఎముకలను దానం చేస్తాడు. నారదుని వలె రాత్రింబవళ్లు ధర్మప్రచారనినాదం చేస్తూ తిరుగుతాడు. వ్యాసునివలె తన ఆయువును సత్‌గ్రంథరచనకు వినియోగిస్తాడు. ద్రోణాచార్యునివలె శస్త్ర విద్యలను ప్రచారం చేస్తాడు. పాణిని వలె వ్యాకరణాన్ని రూపొందిస్తాడు. పరశురాముని వలె దుష్టులను దండిస్తాడు. బుద్ధుని వలె ప్రేమ, అహింసలను ఉపదేశిస్తాడు. అతను దేశ, కాలాల అవసరాలను గమనిస్తూ వాటిని ఉన్నత స్థాయికి జేర్చడానికి తన శక్తిని వినియోగిస్తాడు.

అర్థపురుషార్థము(అనగా ఆర్థికస్థితి)ను ఆరవ ఇంద్రియమని పిలవవచ్చును. కారణమేమంటే రూపాయిలోనే మనస్థితి, గౌరవాలుంటాయి. దానిని బట్టే ఎక్కువ తక్కువలు కొలవబడతాయి. ఈ యుగం రూపాయికి ఎంతో విలువనిస్తుంది. హిందూ ధర్మాన్ని అనుసరించి ధనం ఒక పవిత్రశక్తి. ధనాన్ని శుభకరమైన, సాత్వికమైన కార్యాలకే ఖర్చుచేయాలి. ధనాన్ని నిజాయితీతోనే సంపాదించాలి. హిందూ సంస్కృతిని అనుసరించి గృహస్థాశ్రమాన్ని సుఖవంతం చేయాలంటే ‘అర్థ’ శక్తి యొక్క భరోసామీదే ఆధారపడి ఉంటుంది.

బ్రహ్మచర్యం భౌతికంగానే కాదు - మానసికంగా ఉండాలి.

ప్రతిదినం పంచయజ్ఞములను చేయడం గృహస్థుయొక్క కర్తవ్యంగా తెలుపబడింది. ఇందువల్లనే సత్యమైన ఆచరణతో, సాత్వికమైన విధానంతో ధనసంపాదన చేసి సొంతానికి, సమాజానికి మంచిని కలిగించే కార్యాలకోసం దానిని వినియోగించడం గృహస్థుయొక్క పుణ్యప్రద కర్తవ్యంగా భావించబడింది.

కామానికి అర్థము కోరికతో కూడినది అని, కామం మనసునుంచి పుడుతుంది. అందుకే కామం "మనసిజం" అని తెలుపబడింది. కామానికి రెండు తేడాలున్నాయి. 1) వాసనల నుండి పుట్టిన కామేచ్ఛ. అది వైవాహిక జీవనంలో తీరుతుంది. 2) భగవానునియందు ప్రేమ. అది భగవంతుడిని ఉపాసించడంలో తీరుతుంది, ముక్తికి కారణమవుతుంది.

కామ సంబంధం కూడా ఒక పవిత్రమైన వారసత్వానికి చెందిన ధార్మికమైన కర్తవ్యం. ధర్మాచరణమన్న హద్దులో నుండి ఒక పురుషుడు ఒకే స్త్రీతో కామసంబంధం పెట్టుకుంటే అతడు సంయమంతో హద్దులో వ్యవహరించగలుగుతాడు. మనిషి ప్రతిక్షణమూ తన కర్తవ్యాన్ని గురించి, తన సంతానం పట్ల తన బాధ్యతలను గురించి గుర్తుపెట్టుకుంటాడు. దానికి ఫలితంగా అతని కామం హద్దులో ఉంటుంది. నియంత్రణవల్ల శక్తి వృద్ధి పొందుతుంది. సంయమనంలేని కామం చాలా నీచమయినది. దానిని వ్యభిచారమన్న పేరుతో పిలవడం జరుగుతుంది. మన సంస్కృతి మనకు గృహస్థజీవనంలో ఎల్లప్పుడూ సంయమనాన్ని, ఇంద్రియ నిగ్రహాన్ని పాటించడం విషయంలో శ్రద్ధ వహించాలని, భగవద్భక్తి ద్వారా మనలోని వాసనలను పోగొట్టుకుని కళ్యాణకారియైన మార్గాన్ని ఏర్పరచుకోవాలని బోధిస్తుంది. ఆ విధంగా ఉత్తమస్థితికిజేరి భగవత్ ప్రాప్తిని పొందాలి.

★★★

## కనువిప్పు

*ఒక త్రాగుబోతు పీకలదాకా త్రాగాడు. అడ్డదిడ్డంగా అడుగులు వేసుకుంటూ వీధిలో నడుస్తున్నాడు. మధ్యలో పడుతూ లేస్తూ నడుస్తున్నాడు. ఎదురుగా ఖాజా హుస్సేను వస్తున్నాడు. త్రాగుబోతు పరిస్థితిని గమనిస్తూ వస్తున్నాడు. దగ్గరగా వచ్చాడు. "బాబూ! కాస్త అడుగులు చూచుకుంటూ వెయ్యి. పాదాలు గట్టిగా ఆనించి నడువు. లేకపోతే బురదలో పడిపోతావు" అన్నాడు.*

*దానికా త్రాగుబోతు నవ్వుకుంటూ సమాధానమిచ్చాడు. "అయ్యా మీరే కాస్త జాగ్రత్తగా నడవండి. మీరు ధర్మ ప్రభువులు. నేను త్రాగుబోతును. క్రిందపడినా లేచినడవగలను. శరీరానికి అంటిన బురదను కడిగివేసికోగలను. ఒకవేళ మీరే జారిపడినట్లైతే తిరిగి లేవలేరు. మీ కీర్తి ప్రతిష్ఠలకు అంటిన బురదను ఎప్పటికీ శుభ్రం చేసికోలేరు." ఆతని మాటల్లోని వ్యంగ్యాన్ని గ్రహించిన ఖాజా అవాక్కయ్యాడు.*

*మరొకసారి ఒక బాలుడు దీపం చేతపట్టుకుని వస్తున్నాడు. ఎదురుగా వచ్చిన హుస్సేను "బాబూ ! ఈ దీపాన్ని ఎక్కడ నుండి తెస్తున్నావు?" అని ప్రశ్నించాడు. సరిగ్గా అప్పుడే వీచిన గాలికి దీపం ఆరిపోయింది. వెంటనే బాలుడు "అయ్యా ! ఆ విషయం తరువాత చెపుతాను. ముందుగా ఇప్పుడే దీపం ఎక్కడకు పోయిందో మీరు చెప్పండి" అన్నాడు. ఆ బాలుని ప్రశ్నలో దాగిన అధ్యాత్మతత్వాన్ని తెలిసికొన్న ఖాజా మరోమారు నిరుత్తరుడయ్యాడు.*

*కొన్ని రోజుల తర్వాత ఒక అందాలరాశియైన యువతి తన భర్త యొక్క కఠినత్వాన్ని గురించి ఖాజాకు విన్నవించుకున్నది. హుస్సేను ఆమెనే తదేకంగా చూస్తూ "అమ్మా ! నీవు కప్పుకున్న బురఖా ముఖం మీది నుండి ప్రక్కకు జరిగింది. ముందు దానిని సరిచేసికో తల్లీ !" అన్నాడు.*

*దానికాయువతి "అయ్యా ! నేను భర్త యొక్క ప్రేమను పొందాలన్న లోభంలో పడి నన్ను నేను మరచిపోయాను. ఇప్పుడు గాని మీరు చెప్పకపోయినట్లైతే ఇదేవిధంగా బజారుకు కూడ వెళ్లేదాన్ని" అంటూ బురఖా సరిచేసికున్నది. మరల "అయ్యా ! మీరు ధర్మ ప్రభువులు. మీ మనస్సు ఎప్పుడు భగవంతుని గురించే లగ్నమై ఉంటుంది. ఐనా నా ముఖముపై గల వస్త్రాన్ని గమనించగలిగారు. అదే విషయం నన్ను ఆశ్చర్యపరుస్తున్నది." అన్నది.*

*ఈ సమాధానంతో ఖాజా హుస్సేను మరోసారి ఖంగు తినకతప్పలేదు.*

*ఇతరులకు ధర్మం చెప్పాల్సిన ఖాజా ఎన్నివిధాలుగా జాగ్రత్త పడాలో హుస్సేనుకు బాగా అర్థమైంది.*

**తెలిసిన విషయమైనా తక్కువగానే మాట్లాడాలి.**

మనం-మన ఆరోగ్యం: పంచతత్వాలతో చికిత్స-10

# పంచతత్వాలదైనిక సాధన-సమన్వయం

పంచతత్వాల మహత్తును తెలుసుకున్నాం. మన దినచర్య కార్యక్రమంలో అన్ని తత్వాలూ తగిన మోతాదులో లభించేలాగా చూచుకోవాలి. అన్ని తత్వాలు తగినంత మోతాదులో పొంది మానవుడు ఆరోగ్యంగా ఉండడానికి ముఖ్యమైన దైనిక అభ్యాసాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

**1. పృథ్వీతత్వం :** ఉదయాన్నే పాదరక్షలు లేకుండా స్వచ్ఛమైన స్థలంలో నడవాలి. ఆకుపచ్చని గడ్డిమొలిచిఉంటే మరీ మంచిది. పచ్చగడ్డిలోని తేమ పాదాలను చల్లబరుస్తుంది. అరికాళ్లద్వారా ఆ చల్లదనం మస్తిష్కానికి చేరవేయబడుతుంది. అందునిమిత్తం ఏదైనా **ఉద్యానవనంలోగాని, తోటలోగాని, పొలాలలోగాని కాలిచెప్పులను విప్పేసి కనీసం ఒక అరగంట నడవాలి.** దీనిద్వారా శరీరంలోని విషాలు పాదాలనుండి లాగబడి భూమిలోకి వెళ్లిపోతాయి. బ్రహ్మ ముహూర్తంలోని వాయువు అనేక ఆశ్చర్యజనకమైన గుణాలలో భూమి నుండి బయటకు వస్తుంది. ఆ గాలిని శరీరం పీల్చుకుంటుంది. ప్రాతః కాలంలోని ఈ ప్రయోజనం మరి ఏ ఇతర సమయాలలోను లభించదు. **"పృథ్వియొక్క జీవన శక్తిని పాదాల ద్వారా గ్రహించి నా శరీరంలో నింపుకుంటున్నాను. నా శరీరంలోని విషాలను పృథ్వి గ్రహించి నన్ను నిర్మలంగా తయారుచేస్తున్నది"** అని మనస్ఫూర్తిగా భావన చేస్తూ నడవాలి. భావన ఎంత దృఢంగా ఉంటే ప్రయోజనం అంత ఎక్కువగా ఉంటుంది.

వారానికి ఒకటి రెండుసార్లు స్వచ్ఛమైన మెత్తటి మట్టిని లేదా శుభ్రమైన సన్నని ఇసుకను నీటితో తడిపి శరీరానికి సబ్బులాగా రుద్దుకోవాలి. ఆ మట్టిని కొద్దిసేపు అలాగే ఉంచుకోవాలి. తర్వాత స్వచ్ఛమైన నీటితో స్నానం చేస్తూ పూర్తిగా కడిగివేయాలి. ఈ మృత్తికా స్నానం శరీరంలోని, చర్మంలోని విషాలను తీసివేసి చర్మాన్ని మృదువుగా చేయడమే కాక ఒక విధమైన మెరుపును కలిగిస్తుంది. తలవెంట్రుకలను ముల్తానామట్టితో కడగడం లాభదాయకం. పొయ్యిలో కాలిన మట్టితో పండ్లు తోముకోవడం మంచిది.

**2. జలతత్వం :** ప్రతిరోజూ తాజా నీటితో స్నానం చేయ్యాలి. వాడిపోయిన మొక్కలు, పువ్వులు, ఆకులు నీళ్లు పడగానే ఊపిరి పోసుకుంటాయి. అదే విధంగా మానవ శరీరం కూడ జీవకళను పొందుతుంది. చైతన్యవంతమౌతుంది. కేవలం మలినాలను శుభ్రం చేయడమే స్నానం యొక్క ఉద్దేశ్యం కాదు. నీటిలో కలసి ఉన్న విద్యుత్తు, ఆక్సిజన్, నైట్రోజన్ మొదలైన విలువైన తత్వాలతో శరీరాన్ని కడగడం మిక్కిలి లాభదాయకం.

ఉదయాన్నే మలవిసర్జనకు 20-25 నిముషాల ముందు ఒక గ్లాసు నీళ్లు త్రాగితే విరోచనం సాఫీగా అవుతుంది. నీళ్లు పుక్కిలించడం వలన నోరు, గొంతు శుభ్రపడతాయి. ముక్కుతో నీళ్లు పీలిస్తే మెదడు చల్లబడుతుంది. అప్పుడప్పుడు ఎనిమా సహాయంతో కడుపులోనికి నీటిని పంపి ప్రేవులను కడుగుతూ ఉండాలి.

ఎప్పుడు దాహం వేసినా నీటిని పాలు తాగినట్లు నెమ్మది నెమ్మదిగా త్రాగాలి. ఎప్పుడూ గటగటా త్రాగరాదు. ప్రతిగుటకకు **"ఈ అమృతతుల్యమైన నీటిలోని చల్లదనాన్ని, మాధుర్యాన్ని, శక్తిని గ్రహించి నాలో ధారణ చేస్తున్నాను"** అని భావన చేయాలి. ఈ భావనతో త్రాగిన నీరు పాలతో సమానమైన శక్తినిస్తుంది.

**3. అగ్నితత్వం :** సూర్యుని వెలుగులో ఎక్కువసేపు ఉండడానికి ప్రయత్నంచెయ్యాలి. ఇంటిలోనికి కూడ ఎండ పడేవిధంగా కిటికీలు ఏర్పాటు చేసికోవాలి. బట్టలకు ప్రతిరోజూ ఎండ తగులనియ్యాలి. ఉదయంపూట ఎండ నగ్నశరీరం మీద పడేలా ఏర్పాటు చేసుకోవాలి. ఎండ సంపర్కంలో ఉన్నవారికి ఎటువంటి రోగాలూ రావు. ఆరోగ్యంగా ఉంటారు. మధ్యాహ్నపు ఎండవేడిని కాకుండా సహించగలిగిన ఎండనే శరీరం మీద పడేలా చూచుకోవాలి.

స్నానం చేసి తడిసిన శరీరంతో సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం చాల లాభాన్ని చేకూరుస్తుంది. నీటికి విద్యుత్తును గ్రహించే శక్తి ఉన్నది. అందుకే వర్షాకాలంలో విద్యుత్తుతీగలు చాల తీవ్రంగా ఉంటాయి. మేఘాలకారణంగా ఆకాశంలో విద్యుత్తు వెలుగులు చిమ్ముతుంది. అందుకే స్నానం చేయగానే తడి శరీరంతో సూర్యునికి నమస్కరించాలి. నది, చెరువు, కాలువల్లో స్నానం చేసేటప్పుడు నడుం వరకు నీటిలో ఉండి అర్ఘ్యం ఇవ్వాలి. సూర్యదర్శనం తరువాత కళ్లు మూసుకుని ఈ విధంగా ధ్యానించాలి. **"సూర్యనారాయణుని తేజస్సు నా శరీరంలో ప్రవేశించి రోమ రోమాన్ని దీప్తివంతంగా, తేజోవంతంగా వికసింపచేస్తూ ఉంది. అంగ ప్రత్యంగాలకు స్ఫూర్తిని, శక్తిని ప్రసాదిస్తున్నది."** ఈ పనిని ప్రతినిత్యం స్నానం తరువాత చెయ్యాలి.

**4. వాయుతత్వం :** స్నానం అయిన తరువాత ఏదైనా ఏకాంత ప్రదేశానికి వెళ్లాలి. సమతల భూమిమీద ఆసనం పరచుకోవాలి.

తెలియని విషయాన్ని గూర్చి నోరు మెదపనేకూడదు.

దానిపై పద్మాసనంలో కూర్చోవాలి. వెన్నెముకను నిటారుగా ఉంచుకోవాలి. కళ్లు సగం మూసి ఉంచుకోవాలి. నెమ్మది నెమ్మదిగా ముక్కు ద్వారా శ్వాస పీల్చడం మొదలు పెట్టాలి. దృఢమైన ఇచ్ఛా శక్తితో క్రింది విధంగా భావన చేయాలి.

**"విశ్వవ్యాపితమైన మహాప్రాణ భాండాగారము నుండి ఆరోగ్యదాయకమైన తత్వాన్ని శ్వాసతోపాటు పీల్చుకుంటున్నాను. ఆ ప్రాణం రక్తంతోపాటు నాడీ తంత్రులలో ప్రవహిస్తూ సూర్యచక్రం (నాభిచక్రం)లోకి చేరుకున్నది."** ఈ భావనను ధ్యానం చేస్తూ చిత్రరూపంలో చూసే ప్రయత్నం చెయ్యాలి. ఊపిరితిత్తులలో వాయువు పూర్తిగా నిండిన తరువాత పదిసెకన్లవరకు వాయువును లోపలనే ఆపి ఉంచుకోవాలి. ఈ ఆపే (కుంభక) సమయంలో **"పీల్చుకున్న ప్రాణతత్వం నా రోమరోమంలో ప్రవేశించింది"** అని భావన చేయాలి. ఇప్పుడు వాయువును నాసికద్వారా నెమ్మది నెమ్మదిగా బయటకు వదలివేస్తూ **"శరీరంలోని దోషాలు, రోగాలు, మలినాలు బయటకు వెళ్లిపోతున్నాయ"**ని భావన చేయాలి.

ఈ విధంగా ఆరంభంలో 10 ప్రాణాయామాలు చెయ్యాలి. నెమ్మదిగా పెంచుకుంటూ అరగంటపాటు చేయగలిగినన్ని ప్రాణాయామాలు చేయాలి. నాడులలో ఒకరకమైన స్ఫూర్తి, తాజాతనం వచ్చి తీరుతాయి. విద్యుత్తు పరుగులు తీస్తున్న అనుభవం కలుగుతుంది. ఈ ప్రాణాయామాన్ని విడువకుండా చేస్తూ ఉంటే అనేకమైన శారీరిక, మానసిక ప్రయోజనాలు లభిస్తాయి.

వాయువు సహాయంతో ఉత్తమోత్తమమైన ఔషధాలను సూక్ష్మీకరించి సారతత్వాన్ని గ్రహించవచ్చు. దానికోసం నిత్యమూ హవన కార్యం చేస్తూ ఉండాలి. భారీయెత్తున చేయలేకపోతే అగరుబత్తీనైనా వెలిగించి ఉంచుకోవాలి. శుభ్రమైన గాలిఉన్నచోట ఆరోగ్యం తప్పక ఉంటుంది. శ్వాసను నోటిద్వారా పీల్చరాదు. ఎప్పుడూ ముక్కు ద్వారానే పీల్చాలి. ముఖము నిండా బట్ట కప్పుకుని నిద్రించరాదు.

**5. ఆకాశతత్వము :** ఆకాశతత్వం నుండి మంచి ఆలోచనలను ఆకర్షించుకోవడానికి ప్రాణాయామం తరువాతి సమయం యోగ్యమైనది. ఏకాంత స్థలంలో మెత్తటి ఆసనం మీద గాని, పడక కుర్చీమీద గాని శరీరాన్ని వదులుగా చేసి కూర్చోవాలి. వీలుపడనిచో చెట్టుకుగాని, గోడకుగాని ఆనుకుని కూర్చోవాలి. శరీరాన్ని వదులుగా ఉంచి కన్నులు మూసికొని నలువైపులా నీలి ఆకాశాన్ని ధ్యానించాలి. **నీలిరంగును ధ్యానించడం వలన మనస్సుకు గొప్ప శాంతి లభిస్తుంది.** ధ్యానం చేస్తూ "నిఖిలమైన నీలాకాశంలో వ్యాపించి ఉన్న మంచి ఆలోచనలు, మంచి విశ్వాసాలు, మంచి ప్రభావాలు ఒక్కటై నాలో ప్రవేశిస్తున్నాయి. వాటి ప్రభావంతో నా అంతరంగం దయ, ప్రేమ, పరోపకారం, కర్తవ్యనిష్ఠ, సేవ, సదాచారం, శాంతి, వినయం, గంభీరత, ప్రసన్నత, ఉత్సాహం, సాహసం, దృఢత్వం, వివేకం మొదలైన సద్గుణాలతో నిండిపోతున్నది." అని భావన చేయాలి. ఎంత ఏకాగ్రత, శ్రద్ధ ఉంటే అంత ప్రయోజనం ఉంటుంది.

ఈ ఆకాశతత్వ సాధనవల్ల సిద్ధుల, మహా పురుషుల, ఋషుల, దేవతల, అవతారపురుషుల శక్తులన్నీ సాధకుని మీద ప్రభావం చూపుతాయి.

ఈ పంచతత్వాల నిత్యసాధనలను దైనికజీవనంలో నియమంగా ఆచరిస్తే నిస్సందేహంగా ఆరోగ్యం బాగుపడుతుంది.

పాంచభౌతికశరీరాన్ని పంచతత్వాలతోనే ఆరోగ్య పరచుకోవాలి. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని మరచిపోకుండా పరమానందంగా జీవించగలగాలి.

★★★

## బాధ్యత ఎప్పుడూ బరువుకాదు

*పర్వత శిఖరం మీద నెలవై ఉన్న దేవీ ప్రతిమ ఒకరోజున తన ఎదురుగా ఉన్న కాలిబాటను చూసి జాలిపడుతూ, "ఓ కాలిబాటా ! పాపం నీవు ప్రతిరోజూ నా వద్దకు వచ్చే భక్తుల భారాన్ని, కాలిదెబ్బలను భరిస్తూ చాలా కష్టపడతావు. నిన్నుచూస్తే జాలివేస్తుంది." అంటూ సానుభూతి చూపిస్తుంది. ఆ సానుభూతిని తిరస్కరిస్తూ కాలిబాట దేవీ ప్రతిమను చూచి చిరునవ్వు నవ్వి– "ఓ పూజ్యురాలా ! భగవంతుని వద్దకు భక్తుని చేర్చటం అంటే అర్థం స్వయంగా తాను భగవంతుని చేరటమే కదమ్మా. నేను లేకుండా నీ వద్దకు నీ భక్తులను ఎవరు చేరుస్తారు? కాబట్టి నా బాధ్యత నాకు బరువు కాదు" అని బదులు పలుకుతుంది. కాలిబాట యొక్క ఈ ఔన్నత్యం ముందు దేవీప్రతిమ శిరస్సు వంచుతుంది.*

వ్యక్తిత్వం మనిషికి పెట్టనికోట.

ధారావాహిక : భక్తిగాథ-13

# పరమత్యాగశీలి, పరమభక్తుడు దధీచి

శమీక మహర్షి యొక్క భక్తి అందర్నీ పులకాంకితులను చేసింది. విశ్వామిత్ర మహర్షి ఇలా అన్నారు- "అస్తిత్వం శుద్ధ సత్వమైనపుడు భక్తి ప్రగాఢమై, వారికర్మ తీక్షణమూ, నిష్కామమూ అవుతుంది. నిజమైన భక్తులు కర్మలనుండి గాక, కోరికలనుండి విముఖులౌతారు. వారి జీవితం శాస్త్ర మర్యాదలకనుగుణంగా ఉంటుంది. వారి కర్మ అనే సంగీతానికి మర్యాద అనే తాళం తోడై మాధుర్యం వెలువడుతుంది." విశ్వామిత్ర మహర్షి యొక్క తేజోవంతమైన వాక్కు అందరికీ ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించింది. హిమాలయ ప్రాంగణంలో నవచైతన్య స్పందన కలిగింది. హిమజలపాతాల సవ్వడి పర్వతశిఖరాలపై ఉన్న హిమపక్షుల కలకలారావంతో కలసి యుగళగీతం పాడుతోంది.

ఆ క్షణాలు ఎంతో అద్భుతమైనవి. మార్కండేయ మహర్షి అందరినీ ఉద్దేశించి ఇలా చెప్పారు- "ఈ వేళ శివరాత్రి. సదాశివార్చన మహోత్సవం." మార్కండేయుని మాటలతో అందరి అంతఃకరణలో భక్తి తాండవించింది. దేవాది దేవుని స్మరణ అందరినీ భక్తి విహ్వాలులను చేసింది. అప్పుడు పులస్త్య మహర్షి ఇలా చెప్పారు- "శివభక్తిలో లీనమైన వారి జీవితం ధన్యం. వారి ప్రతి కర్మ శివోపాసనే అవుతుంది." మార్కండేయ మహర్షి ఇలా అన్నారు- "శివభక్తుడైన దధీచి ఇటువంటి మహాభక్తుడు. ఆయన జీవితం అద్భుతమైన భక్తి గాథ."

ఈ భక్తి చర్చను వింటున్న నారదమహర్షి తమ క్రొత్త భక్తి సూత్రానికి నాంది పలికారు. వారు తమ మధుర స్వరంతో క్రొత్త సూత్రాన్ని ఉచ్చరించారు-

**భవతు నిశ్చయ దార్ఢ్యా దూర్ధ్వ శాస్త్ర రక్షణమ్**

భక్తుడు నిశ్చయ పూర్వకంగా, దృఢతా పూర్వకంగా శాస్త్ర మర్యాదలను రక్షించాలి.

ఈ సూత్రాన్ని వాఖ్యానిస్తూ దేవర్షి ఇలా విపులీకరించారు- ముక్తుడైనవానికి తన జీవితం ద్వారా శాస్త్రాన్ని ప్రమాణికం చేయవలసిన బాధ్యత ఉంది. భక్తుని జీవితంలోని వాస్తవికత ఏమిటంటే, అతను శాస్త్రానికి పూర్ణతను చేకూరుస్తాడు. శాస్త్రాన్ని ఖండించడు.

ఇలా సంభాషణ సాగుతుండగా దేవర్షి యొక్క స్మృతి భాండాగారంలో ప్రాచీనమైన భవ్యగీతిక ఆలపించబడింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఆయన కళ్లు చెమ్మగిల్లాయి. దీన్ని గమనించిన ఋషులు ఆశ్చర్యచకితులయ్యారు. పులస్త్యమహర్షి ఇలా అడిగారు- "మీ భావవిహ్వలతకు కారణమైన విషయమేమిటి?" ఋషులందరూ నారద మహర్షిని ఇలా అభ్యర్థించారు- "మహర్షి దధీచి యొక్క జీవిత సత్యముల కన్నింటికీ మీరు సాక్షులు, కనుక వారి కథను వినిపించండి." నారద మహర్షి చేతన ఆధ్యాత్మికతతో కదిలింది. వారు కథను మొదలు పెట్టారు.

దధీచి మహర్షి కఠోర తపస్సు చేస్తుండగా నేను చూశాను. యౌవన దశలోనే వారి సాధన శిఖరాన్ని చేరింది. ఆయనకు ఆధ్యాత్మిక తత్వజ్ఞానం సహజంగానే లభ్యమైంది. భగవంతుడు సదాశివుడు ఆయన ఆరాధ్యదైవం. భవానీమాత అతన్ని తన సంతానంగా భావించింది. సకల దివ్యశక్తులూ, సిద్ధులూ, విభూతులూ అతని ఆజ్ఞల కోసం కుతూహలపడేవి. అనేక అపరా, పరా విద్యలకు ఆయన గొప్ప ఆచార్యుడు. తపస్సు ఆయన సహజ స్వభావం. తమ లక్ష్యం నెరవేరాక చాలా కొద్దిమంది మాత్రమే తపస్సు చేస్తారు. ఇంత దుష్కరమైన తపస్సును ఎవరూ చేయరు. దధీచి మహర్షి వ్యక్తిత్వం అనేకములైన అసాధ్యాలను సాధ్యంచేసింది. తపస్సు, సాధన, లౌకిక, అలౌకిక విద్యల అన్వేషణ, అనుసంధానం, తమ శిష్యులకు బోధించడం- ఇదే ఆయన ప్రముఖ కార్యం. అంతేకాక- ఆయన గౌతమీ నదీతీరంలో ఆశ్రమం నిర్మించుకొని కొన్ని విశేష సాధనలను కూడ చేసేవాడు. ఆ సమయంలో పరిశోధనా ప్రియులైన కొందరు విద్యార్థులు వారి వద్ద ఉండేవారు. నేను ఒకసారి వారివద్దకు వెళ్లాను. అతి విశిష్ట సాధనలో లీనమై ఉన్నప్పటికీ, వారు నన్ను కలిశారు. వారి తేజస్సు ఎంతో రమ్యంగా, సుగంధభరితంగా ఉంది. వారు స్వయంగా ఎంతో దివ్యమైనవారు, దేవ మానవునికి ఉండవలసిన లక్షణాలకన్నింటికీ ఆయన సాకారమూర్తి.

భక్తిని గురించీ, తత్వాన్ని గురించి చర్చిస్తూ నేను వారినిలా అడిగాను. "మహర్షీ ! మీ సాధన యొక్క లక్ష్యమేమిటి?" దానికి

**ఆచితూచి వాగ్దానం చేసేవ్యక్తి చిత్తశుద్ధితో అమలు చేస్తాడు.**

వారు నవ్వుతూ ఇలా బదులిచ్చారు. "నా సాధనా, సాధ్యమూ కూడ శివభక్తే. నేను సమాధి స్థితిలో ఉన్నప్పటి ప్రతిక్షణమూ నా భావ చేతనా ప్రవాహం ఆ భోలేనాథుని చేతనా మహాసాగరంలో లీనమౌతుంది. ఆ కృపా సింధువులో నా అస్తిత్వ బిందువు కలసిపోతుంది. సమాధి స్థితి వీడిన తర్వాత సమస్త మానవాళిలో సదాశివుని అనుభూతి కలిగి వారి సేవ చేస్తుంటాను. నా సమస్తమైన విద్యలూ, తపస్సూ లోకసేవకొరకే. నా సమస్త కార్యముల సారమూ నా ఆరాధ్యదైవము యొక్క సేవయే."

ఈ విధంగా పలుకుతున్నపుడు వారి అస్తిత్వం భక్తితో ఆర్ద్రమయింది. తర్వాత వారిలా అన్నారు- "దేవర్షీ ! నా సంపూర్ణ జీవితంలో నేను ధనాన్ని కానీ, సాధనాలను కానీ సమకూర్చుకోలేదు. నేను ఆర్జించిందల్లా తపస్సూ, శివభక్తీ, నా లోకసేవకు ఇదే మాధ్యమం." "మీ జీవితంలో అంతిమ కోర్కె ఏమిటి ఋషిశ్రేష్ఠా?" -అని అడిగాను. ఈ ప్రశ్నవిని వారు చింతితులయ్యారు. వారి అస్తిత్వంలో కోరిక అనేది వెదికినా కనిపించదు. అది ప్రకాశవంతమైన ఆకాశం. అందులో తపస్సు అనే పూర్ణ చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. లెక్కకుమించి విద్యలనే తారలు మెరుస్తున్నాయి. కోరిక, ఇచ్ఛా అనే నీడలు అచ్చట లేనేలేవు.

దధీచి మహర్షి ఇలా అన్నారు- "నా చేతన, నా శరీరమూ కూడ లోక సేవలోనే తరించాలి."

వారి హృదయంలో సదా వసించే సదాశివుడు తథాస్తు అన్నట్లున్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ ఋషివర్యుని మాటలు సాకారమయ్యాయి. లోక కంటకుడైన వృత్రాసురుని వధించడానికి ఇంద్రుడు తన దేవతాగణంతో వచ్చి వారి అస్థికలను అడిగినపుడు వారిలా అన్నారు- "దేవరాజా ! నేను ధన్యుణ్ణి. దేవత్వాన్ని వృద్ధిచేయడానికి నా అస్థికలు ఉపయోగపడుతున్నాయి. అసురత్వం నశిస్తుంది. ఇంతకంటే సౌభాగ్యం నాకేమున్నది."

ఆయన ఎంతో సంతోషంతో తను బ్రతికిఉండగానే తన అస్థికలను దానం చేశారు. లోకసేవకోసం ఇంతగొప్ప బలి దానం చేసినవారు ఇంతవరకూ ఎవ్వరూ లేరు, ఉండబోరు. వారి అస్థికలతో వజ్రాయుధం తయారైంది. అసురత్వం నశించింది. వారి భావ చేతన సదాశివునిలో లీనమైంది.

దేవర్షి వల్ల ఈ భక్తి కథను విన్నవారందరూ చేతులు జోడించి భక్త శ్రేష్ఠుడైన దధీచి మహర్షికీ, భోలేనాథుడు సదాశివునికీ ప్రణామ మాచరించి శివరాత్రి అర్చనల ఏర్పాట్లలో మునిగిపోయారు.

★★★

## కర్తవ్యనిర్వహణయే గొప్ప సాధన

*రైదాస్ అనే వ్యక్తి చెప్పులు కుట్టి జీవయాత్ర సాగించేవాడు. తాను చేసే పని దైవ పూజగా భావించి పరిపూర్ణమైన భక్తిశ్రద్ధలతో పని చేసుకుంటూ ఉండేవాడు. నిత్యం జప తపాలలో లీనమై ఉండే ఒక సాధువు ఒక పర్వదినాన గంగా స్నానానికి వెళుతూ రైదాస్‌ను కూడా గంగా స్నానానికి రమ్మని పిలుస్తాడు. కానీ రైదాస్ తన అసహాయతకు చింతిస్తూ కొందరు గ్రామవాసులకు మర్నాటికి చెప్పులు కుట్టి ఇవ్వవలిసి ఉన్నదనీ, ఇస్తానన్న సమయానికి వారి చెప్పులు వారికీయక వారిని ఇబ్బందికి గురి చేయలేనని, గంగాస్నానం చేసే భాగ్యం తనకింకా కలగలేదనీ బాధతో తెలియజేస్తూ, తన సంపాదనలోని కొన్ని పైసలు సాధువుకి ఇచ్చి గంగామాతకి సమర్పించుమని కోరతాడు.*

*సాధువు స్నానం, ధ్యానం వగైరా పూర్తి చేసుకొని తిరిగివచ్చే సమయంలో రైదాస్ ఇచ్చిన పైసలు తీసిగంగలో వేస్తాడు. రెండు అందమైన హస్తాలు నీటిలో నుండి పైకి వచ్చి, ఆ పైసలను స్వీకరిస్తాయి. సాధువు ఆశ్చర్యభరితుడై ఈ సంగతి రైదాసుకి తెలియచేస్తూ నీ పైసల్ని గంగ స్వీకరించిందంటే నీవేదో నాకంటే విశేషమైన సాధనలు చేసే ఉంటావు. అదేమిటో తెలియజేయమని ఒత్తిడి చేస్తాడు. దానికి రైదాస్ వినయంతో ఇలా అన్నాడు. "ఓ మహాత్మా ! ఇది కర్తవ్య ధర్మ నిర్వహణ యొక్క ప్రతిఫలమేగానీ వేరేదీకాదు. ఏ తపో సాధనలు ఎరుగని వాడిని నేనంటూ" చేతులు జోడించి నమస్కరిస్తాడు.*

**ఇతరులు చేసిన తప్పులను క్షమించడం తేలికే.**

బోధకథ

# అమృతం పుట్టింది

అది ఒక మహానగరం. రాజాస్థానంలో ఒకానొక ఉత్సవం. ఆ సందర్భంగా రాజ నర్తకి వాసవ దత్త నాట్యం ఏర్పాటు చేయబడింది. సర్వాంగ సుందరంగా అలంకరించుకుని వచ్చింది వాసవదత్త. రాజు కనుసైగతో నాట్యం ప్రారంభింపబడింది.

తీగలాంటి సుకుమారమైన ఆమె శరీరం ఒక మహాశిల్పి మలచిన శిల్పంలా, ఒక మహాకవి వర్ణించిన చిత్రంలా రకరకాల భంగిమలలో, రకరకాల విన్యాసాలు చేస్తూ, మెరుపుతీగలా తళుకు లీనుతూ, చూచేవారిని తన్మయులను చేస్తోంది. శరశ్చంద్రుని వంటి ఆమె మోము కోటి జ్యోతుల కాంతితో తళుక్ తళుక్ మంటూ కదలాడుతున్నది. కదలికల వేగము వర్ణనాతీతం. రాగ, తాళ, లయయుక్తమైన మహాసంగీతఝరి వలె ఆమె నాట్యం సాగిపోతూ ఉంది.

కనురెప్ప వాల్చకుండా సభికులంతా ఏకాగ్ర చిత్తంతో తిలకిస్తున్నారు. మహానందభరితులౌతున్నారు. ఆ సభాప్రాంగణంలో తథాగతుని అనుయాయి, బౌద్ధభిక్షువు అయిన ఉపగుప్తుడు కూడ ఆసీనుడై ఉన్నాడు. నాట్యం సమాప్తంకాగానే వాసవదత్త మహారాజుకు నమస్కారం చేసింది. నేరుగా ఉపగుప్తుని దగ్గరకు పోయి పాదాభివందనం చేసింది. ఎవరి నివాసాలకు వారు చేరుకున్నారు. సాయంసమయంలో వాసవదత్త ఉపగుప్తుని నివాసం చేరుకుంది. ఆతనికి నమస్కరించింది.

"స్వామీ ! ఈ పరిమళ సంభరిత కుసుమాన్ని మీ పాదాల ముందుంచుతున్నాను. స్వీకరించడి" -అని వేడుకుంది. ఉపగుప్తుడు నవ్వుతూ "ఇప్పుడుకాదు. సమయం వచ్చినప్పుడు వచ్చి స్వీకరిస్తాను" -అన్నాడు. మారుమాటాడక తలవంచుకుని వచ్చినదారినే వెళ్లిపోయింది వాసవదత్త.

కాలంసాగిపోతూనే ఉంది. ఋతువులు మారుతున్నాయి. సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఆ మహానగరాన్ని మశూచి మహమ్మారి చుట్టివేసింది. బిడ్డా పాపలతో కళకళలాడుతున్న గృహాలు స్మశానాలుగా మారిపోతున్నాయి. మహమ్మారి విశృంఖలంగా జనహననం సాగిస్తున్నది. చావగా మిగిలిన వారు నగరాన్ని వదిలి అడవి త్రోవలుపట్టారు. సహాయం చేసే దిక్కులేక రోగంతో కృశించిపోయే వారు కృశించి పోతూ ఉంటే, బౌద్ధభిక్షువు ఉపగుప్తుడు అడవి వదలి నగరత్రోవ పట్టివచ్చాడు. ఇల్లిల్లు తిరిగి రోగగ్రస్తులకు కావలసిన ఉపచారాలు చేస్తున్నాడు. ధైర్యాన్ని నూరిపోస్తున్నాడు. ఉపశమనం కలిగిస్తున్నాడు.

మృత్యు కోరలలో చిక్కిఉన్నవారిలో జీవితాశ చిగురించసాగింది. ఉపగుప్తుని ఉపచారాలతో కొందరు కొద్ది కొద్దిగా కోలుకుంటున్నారు. ప్రొద్దుటి నుండి సాయంత్రం వరకు ఇల్లిల్లు తిరిగి రోగులకు సేవ చేయడమే ఆయనకు పని.

సంధ్యాసమయమైంది. నగరులో ఒక వీధి నుండి నడుచుకుంటూ వస్తున్నాడు ఉపగుప్తుడు. చీకటి వ్యాపిస్తోంది. ఒకానొక భవనం తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. లోపల మనుషులున్న జాడలు కన్పించటంలేదు. కనీసం ఇంటిలో దీపంకూడా వెలిగించిలేదు. ఉపగుప్తుని మనస్సులో ఏదో అనుమానం మెదిలింది. ద్వారం వైపు తేరిపార చూచాడు. రాజనర్తకి వాసనదత్త గృహమది.

గబ గబ లోపలికి వెళ్లాడు. అంతా అంధకార బంధురంగా ఉంది. ఎక్కడా అలికిడి లేదు. "ఎవరండీ లోపల?" అంటూ పెద్దగా రెండు మూడుసార్లు పిలిచాడు. జవాబు లేదు. తిరిగి వెళ్లిపోదామని వెనుదిరిగాడు. పై భాగం నుండి క్షీణస్వరంతో మూలుగు వినిపించింది. అంతే మెట్లెక్కి తడుముకుంటూ పైకి వెళ్లాడు. అదే స్వరం మాటి మాటికి దాహం దాహం-- అంటున్నది. ఆ స్వరాన్ని గుర్తుపట్టాడు. ఆమె వాసవదత్త. మరికొంత ముందుకునడిచాడు ఉపగుప్తుడు.

అడుగుల సవ్వడి విని "ఎవరు?" అని ప్రశ్నించింది. "నేను దేవీ ! ఉపగుప్తుణ్ణి. నీ ఆహ్వానాన్ని స్వీకరించి ఈరోజు వచ్చాను." ఒకరి ముఖం మరొకరికి కనిపించటం లేదు. వారి ముఖాలలోని హావభావాలను చదువుకొనే అవకాశం లేదు. అంతా చీకటిమయం. రోగి మంచంపై నుండి వెక్కి వెక్కి ఏడుస్తున్న ధ్వని మాత్రం వినవస్తోంది.

"భయపడకు దేవీ ! భయపడకు. అంతా మంచే జరుగుతుంది" -అని ధైర్యం చెపుతూ చీకటిని చీల్చుకుంటూ నీటికోసం వెదికాడు. కొద్దిగా బయటినుండి వస్తున్న వెలుగుకు ఒక మట్టికూజా లీలగా కనిపించింది. మెల్లగా తడుముకుంటూ వెళ్లి అందులోని నీటిలో తన వస్త్రాన్ని తడుపుకుని వచ్చాడు. రెండు చేతులతో చీకటిని చీల్చుకుంటూ, తడుముకుంటూ మంచందాక నడిచాడు. అదే విధంగా ఆమెనోటిని గుర్తించి వస్త్రాన్ని పెదవులపై పిండాడు. ఎంతో ఆత్రంగా ఆ నీటి బిందువులను గుటకలు వేసింది వాసవదత్త. కొద్దిసేపటికి కంఠస్వరంలో జీవం వచ్చింది. అదే చీకట్లో సంభాషణ సాగింది.

**ఇతరుల సొత్తును కాదు - వారిలో సుగుణాలను సొంతం చేసికునే యత్నం చెయ్యాలి.**

"స్వామీ ! నా ఆహ్వానాన్ని మన్నించి ఇప్పుడు వచ్చారా? మీకు సమర్పించటానికి నాదగ్గరేమి మిగిలింది? ఏ సౌందర్యాన్ని మీకర్పించాలనుకున్నానో ఆ సౌందర్యం పూర్తిగా నశించిపోయింది" –అంటూ మౌనంగా రోదించటం మొదలుపెట్టింది.

"దేవీ ! నీ సౌందర్యం నశించిపోలేదు. ఇప్పుడిప్పుడే వికసించబోతున్నది. తనదైన దాన్ని పోగొట్టుకుంటేనే గాని తనకు కావలసిన దాన్ని పొందలేరు. ఇప్పుడు నీకు జరిగిందదే. దుఃఖపడవద్దు."– అంటూ ఆమె ఫాలభాగాన్ని ఓదార్పుగా స్పృశించాడు. ఆమెకు అంతులేని చల్లదనం, హాయి అనుభవానికి వచ్చాయి.

ఆయన ఇంకా చెపుతున్నాడు– "దేవీ! సౌందర్యం అనేది కేవలం శరీరానికే కాదు. శరీర సౌందర్యం క్షణికం. అది వయస్సుతోపాటు క్షీణిస్తుంది. ఎప్పటికీ క్షీణించని శాశ్వతమైన సౌందర్యం మనసుది. శరీరమనేది ఎముకలు, మాంసం, మలం, మూత్రం మొదలైన వాటితో నిండి ఉంటుంది. వాటిని బహిర్గత పరచకుండా తోలు కప్పుకుని ఉంటుంది."

"సత్యాన్ని, శివాన్ని అంటి పెట్టుకుని ఉండేది ఆత్మ సౌందర్యం. అది మానవుని చేతల ద్వారానే బహిర్గతమౌతుంది. అనవసరంగా అశాశ్వతమైన సౌందర్యాన్ని గురించి ఆలోచించకూడదు."– అని మిన్నకున్నాడు.

"స్వామీ! ఆగిపోయారెందుకు? చెప్పండి స్వామీ చెప్పండి. నిజంగా ఈరోజే నాకు ప్రప్రథమంగా సౌందర్య పరీక్ష జరిగింది. మిగిలిన జీవితమంతా ఈ శరీరసౌందర్యాన్ని పీక్కుతినే తోడేళ్ల మధ్యనే ముగిసిపోయింది."– ఆమె కంఠస్వరం రుద్ధమైంది.

భగవంతుని లీల. మహా సౌందర్యవతిగా, రాజనర్తకిగా అనేక సన్మానాలందుకున్న వాసవదత్త హృదయంలో వేదన దాగి ఉన్నది. ఆమె మనస్సులో దుఃఖసాగర మథనం మొదలైంది. ఒకానొకప్పుడు రాజాధిరాజులు, ధనవంతులు ఆమె కృపాదృష్టి కోసం బారులుదీరి నిలిచేవారు. ఆమె మనస్సులో కూడ దుఃఖసాగరం. ఆలోచనలొక వైపు, ఆవేదనలొక వైపు వర్తమాన సర్పాన్ని పట్టుకుని భవిష్యత్తు అనే మందర పర్వతాన్ని త్రిప్పటం మొదలు పెట్టాయి. ఎన్నెన్నో భయంకరమైన, కఠినాతి కఠినమైన ఆటంకాలెదురైనాయి. అయినా మథనం ఆగలేదు. ఎట్టకేలకు అమృతం పుట్టింది.

బౌద్ధ భిక్షుణీ బృందంలో నూతన తార వెలిగింది.

★★★

## సేవాధర్మాన్ని మించిన ధర్మం లేదు

*ఒకనాడు పార్వతి పరమేశ్వరునితో "నాథా ! ప్రజలు ఎన్నో విధాలైన కర్మకాండలు, పూజలు, నోములు, వ్రతాలు ఆచరిస్తున్నా, వారికి సత్ఫలితాలు రావటం లేదు" అని ప్రశ్నించింది. పరమేశ్వరుడు నిట్టూర్పు విడచి, "దేవీ ! ప్రజలు ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇన్ని విధాలైన ధార్మిక కర్మకాండలు ఆచరిస్తున్నారేగానీ– ఆ కర్మకాండల వెనుక భావన లేదు, హృదయాలలో సంవేదన లేదు. కర్మ కాండల కళేబరాన్ని పట్టుకొని వ్రేలాడుతున్నారేగానీ ఆత్మని పట్టుకోవటానికి ప్రయత్నించటం లేదు– కావాలంటే నీ బిడ్డలను నీవే పరీక్షించి చూడు. నాకు వారిపై కోపమేమీలేదు. వారు చేసుకొన్న దానికి చేసుకొన్నంతగా ఫలితాలను ప్రసాదిస్తూ ఉన్నాను. నీ బిడ్డలకు తగిన న్యాయం చేయటం లేదని నీకు నామీద అనుమానమైతే నీ కళ్లతో నీవే చూద్దువుగాని పద" అంటూ పరమశివుడు సతీసమేతంగా భూమి పైకి దిగివస్తాడు. పార్వతి సౌందర్యరాశి అయిన సాధ్వీరూపాన్ని, శివుడు అసహ్యకరమైన కుష్టురోగి రూపాన్ని ధరిస్తారు. ఒక దేవాలయం ముందు మెట్లవద్ద పార్వతి భర్త తలను ఒడిలో పెట్టుకొని కూర్చొని ఉన్నది. కార్తీక మాస పర్వదినం. భక్తులు దైవదర్శనానికై దేవాలయంలోనికి ఆత్రంగా, హడావుడిగా ప్రవేశిస్తూ వడివడిగా పని ముగించుకొని తిరిగి వెళ్లిపోతూ ఉన్నారు. కొందరు ఈ జంటవైపు అసలు చూడలేదు. కొందరు భక్తాగ్రేసరులు ఇలాంటి రోగితో ఏమి కాపురం చేస్తావు? వదలి వేయుమని పార్వతికి సలహా ఇచ్చారు. కొందరు కొద్దిపాటి పైసల్ని దూరంగా నిలబడి రోగిమీదకు విసిరారు. జగన్మాత పార్వతి తన బిడ్డల ఈ ఆగడాలు ఇంక భరించలేక పోయింది. "ప్రభూ ! ఇక తిరిగి కైలాసం వెళ్లిపోదాం. నా బిడ్డల కుత్సిత స్వరూపాల్ని నేనింక చూడలేనంటూ" భర్త ఒడిలోపడి భోరుమని ఏడ్చింది.*

*సంధ్య వేళ కావస్తోంది. ఇంతలో ఒక భక్తుడు అటువైపుగా వస్తాడు. వారి స్థితికి కన్నీరు కారుస్తాడు. పార్వతి పాదాలకు నమస్కరించి. తల్లీ ! పతిభక్తి పరాయణురాలివైన నీదర్శన భాగ్యం వల్ల నా జన్మ ధన్యమైనదమ్మా. నీ భర్తగాయాలు తుడిచి నన్ను కూడా సేవ చేయనీయి. నా దగ్గర ఉన్నదేదో మీతో కలిసి పంచుకొని తింటాను. నా వెంట నా గుడిసెకు రమ్మ"ని ప్రేమతో ఆహ్వానిస్తాడు. గాయాలను తుడిచి మందురాసి కట్లు కడతాడు. పరమేశ్వరుడు పార్వతి వంక తిరిగి, "దేవీ ! మందిర ప్రవేశానికి ముందు, సేవా ధర్మానికి ప్రాధాన్యతనిచ్చిన ఇతడే అసలైన భక్తుడు. నీ నిజ స్వరూపముతో దర్శనం ఇవ్వు"మంటాడు. ఆ భక్తునికి తమ నిజస్వరూపాలతో దర్శనం ఇచ్చి పార్వతీ పరమేశ్వరులతనికి పరమపదాన్ని ప్రసాదిస్తారు.*

**ఆరోగ్యవంతమైన దేహం ఆత్మకు అతిథిగది.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-36

# నాదసాధన

ఆనందమయకోశసాధనలో ఆనంద రసాస్వాదన కలుగుతుంది. ఆనందమయ సాధనలలో మూడు ముఖ్యమైన సాధనలున్నాయి. సహజ సమాధి మాదిరిగానే ఈ మూడు సాధనలు మహత్వ పూర్ణమైనవి. వాటిని సాధించడం కూడ అనుకున్నంత సులభంకాదు. ఆ మూడింటిలో ఒకటి నాదసాధన.

శబ్దాన్ని బ్రహ్మము అంటారు. ఎందుకంటే పరమాత్మను, జీవుణ్ణి కలిపి ఉంచే సాధనం శబ్దం. ఈ సృష్టికూడ శబ్దంతోనే ప్రారంభమైంది. పంచతత్వాలలో ఒకటైన ఆకాశం అన్నింటికన్నా ముందే ఉత్పన్నమైంది. ఆకాశం యొక్క తన్మాత్ర శబ్దం. ఇతర పదార్థాల వలె శబ్దం కూడ రెండు విధాలు. (1) సూక్ష్మము (2) స్థూలము. సూక్ష్మ శబ్దాన్ని 'ఆలోచన' అంటారు. స్థూల శబ్దాన్ని 'నాదం' అంటారు.

బ్రహ్మలోకం నుండి మనకోసం ఈశ్వరీయ శబ్ద ప్రవాహం ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది. ఈశ్వరుడు ఎప్పుడూ మాట్లాడాలనే చూస్తూ ఉంటాడు. కాని వినాలన్న కుతూహలం మనలో కొద్దిమందికి మాత్రమే ఉంటుంది. ఈశ్వరుని చేత ప్రేరేపించబడిన ఆలోచనాధార మనకెంతో శుభాన్ని కలుగ చేస్తుంది. ఈ ఆలోచనాధార సరాసరి ఆత్మను స్పృశిస్తుంది. మనం దానిని విని అర్థం చేసుకోవాలి. అర్థం చేసికొని అనువైన మార్గాన్ని నిర్ణయించుకోవాలి. నిర్భయంగా, దృఢ నిశ్చయంతో ఆ మార్గాన పయనించగలిగిన నాడు జీవన లక్ష్యాన్ని వేగంగా చేరుకో గలుగుతాం.

మన అంతరంగం ఒక రేడియో వంటిది. మనస్సును అంతర్ముఖం చేసినట్లైతే మన ఆలోచనా లహరి ఆత్మలో స్పష్టంగా వినవచ్చు. దీనినే ఆకాశవాణి అంటాము. మనకు ఏది ఉచితమైనది? ఏది కాదు? ఏది చేయవచ్చు? ఏది చేయరాదు? అన్న విషయంపై భగవంతునివైపు నుండి ప్రత్యక్ష సందేశం అందుతుంది. దీనినే అంతఃకరణ పిలుపు, ఆత్మసందేశం, పరమేశ్వరుని ఆదేశం, ఆకాశవాణి అంటూ మనకు తోచిన పేరుపెట్టుకుంటూ ఉంటాం. ఆత్మ అనే యంత్రాన్ని శుభ్రం చేసికొంటేనే ఈ సందేశాన్ని వినగలుగుతాం. అప్పుడే విజయాన్ని సాధించి ఆత్మను దర్శించ గలుగుతాం.

ఈశ్వరీయ వాణిని విని, ఆతనితో తిరిగి మాట్లాడగల వ్యక్తియే భగవంతునికి దగ్గరౌతాడు. ఈ దివ్యమైన కలయిక కొరకు చర్మ చక్షువులు, చెవులతో పనిలేదు. ఆత్మను ఉపాసించి, అంతఃకరణంలోని దివ్య నేత్రాలతో చూడవచ్చు. దివ్యమైన ఇంద్రియాల సహాయంతో అన్ని పనులను సునాయాసంగా చేసికోవచ్చు. ఇది అత్యంత సూక్ష్మమైన బ్రహ్మ శబ్దం. మన ఆలోచనలో మాలిన్యాలు ఉన్నంత వరకు అన్నీ మసకగానే కనిపిస్తాయి. మాలిన్యాలను తొలగించి చూచినట్లైతే పరమాత్ముని దివ్య సందేశం స్పష్టంగా కనిపిస్తుంది. వినిపిస్తుంది. మొట్టమొదట ఆత్మబోధ, కర్తవ్య బోధ జరుగుతుంది. పాపపుణ్యాల సంకేతాలు లభిస్తాయి. ఆత్మ ప్రబోధానికి ఆనవాలు ఏమిటంటే– "ఎవరైనా ఏదైనా చెడు పనిని చేసేటప్పుడు భయపడతారు. సిగ్గుపడతారు. అసహ్యపడతారు. సంకోచపడతారు. అదేవిధంగా ఏదైన మంచిపనిని ప్రారంభిస్తే గర్వపడతారు. సంతోషపడతారు. ఉత్సాహ పడతారు. ఇదే ప్రత్యక్ష నిదర్శనం.

ఆ దివ్య సందేశం ద్వార భూత, భవిష్య, వర్తమాన కాలాలలోని సంఘటనలన్నీ తెలిసి వస్తాయి. ఎవరి భవిష్యత్తు ఏవిధంగా జరుగబోతున్నది? ఎవరి ప్రారబ్ధంలో ఏమి రాసిపెట్టి ఉన్నది? మొదలైన విషయాలన్నీ అర్థమౌతూ ఉంటాయి. మరి కొంత ఉన్నత స్థితికి చేరుకోగానే సృష్టి రహస్యాలన్నీ చెప్పగలుగుతాడు. ఆతని దగ్గర ఏ రహస్యమూ దాగదు. ఇంత గొప్ప జ్ఞానాన్ని పొందిన వ్యక్తి దానిని ఉపయోగించడంలో చాల జాగ్రత్త తీసికుంటాడు. అల్పజ్ఞానం కలవారికి ఈ దివ్య జ్ఞానం లభిస్తే గారడీ విద్యలాగా ఆడుకుంటూ నాశనం చేసుకుంటారు. అదే దివ్య జ్ఞానం గొప్పవ్యక్తికి లభిస్తే దానిని గురించి ఇతరులకు తెలియనివ్వడు. ప్రాపంచిక విషయాలకు ఉపయోగించడు. రహస్యంగా ఉంచుతూనే ఇతరుల ఆత్మోన్నతికి ఉపయోగిస్తాడు.

శబ్ద బ్రహ్మము యొక్క రెండవ రూపము మొదటి రూపమైన సూక్ష్మ సందేశములో నుండి ఒక సూక్ష్మ భాగము. అదే నాదము. ప్రకృతి అంతరాళము నుండి ఒకానొక ధ్వని నిరంతరం పుట్టుకొస్తూ ఉంటుంది. దాని ప్రేరణవల్ల కలిగే (వత్తిడి) దెబ్బలద్వార పరమాణువులయందు చలనం కలుగుతుంది. దానిని అనుసరించే సృష్టిలోని సమస్త క్రియలు జరుగుతూ ఉంటాయి. ఆ ధ్వని

**రోగపూరితమైన దేహం ఆత్మకు జైలు గది.**

మొట్టమొదట 'ఓం' రూపంలో ఉంటుంది. ఆ ఓంకారమే ఇతరతత్వములతో కూడిన క్షేత్రాలలో ప్రవేశిస్తుంది. దానికి అనుగుణంగా ధ్వనిలో మార్పువస్తుంది. మురళికి ఉన్న రంధ్రాలలో గాలిని ఊదినట్లయితే వానినుండి ఒకరకమైన ధ్వని వస్తుంది. ఒక్కొక్క రంధ్రమునుండి వాయువు ఒక్కొక్క ధ్వనిని ఉత్పన్నం చేస్తుంది. విభిన్న స్వరాలు కలిసిన స్వరలహరిని వినడమే నాదయోగం.

పంచతత్వాలద్వారా ప్రతిధ్వనించే ఓంకారనాదంలోని స్వరలహరిని వినడమే నాదయోగ సాధన. నాదయోగసాధన అనేక కోణాలలో మహత్వపూర్ణమైనది. మొట్టమొదటిది ఈ దివ్య సంగీతం వినడం వల్ల మాటలలో వర్ణించడానికి అలవి కాని మాధుర్యాన్ని ఆస్వాదించడం. రెండవది ఈ నాద శ్రవణం వల్ల హృదయ తంత్రులు వికసిస్తాయి. సంగీతాన్ని వినగానే సర్పానికి నాడులలో ఒక రకమైన విద్యుత్ ప్రవహిస్తుంది. మధురమైన సంగీతాన్ని వినగానే లేడి తన్ను తాను మరచిపోతుంది. యూరప్ దేశాలలో ఆవులదగ్గర పాలుపితికే సమయాలలో మధురమైన వాయిద్యాన్ని వినిపిస్తారు. ఆ వాయిద్యాన్ని వినగానే ఆవుల నరాలు ఉత్తేజం పొందుతాయి. దాని ఫలితంగా అధిక పరిమాణంలో పాలను స్రవిస్తాయి. నాదము యొక్క దివ్య సంగీతాన్ని విన్న మానవుని మస్తిష్కం కూడ స్పందిస్తుంది. ఆ కారణంచేత ఆతనిలో దాగి ఉన్న గుప్త శక్తులు, మానసిక శక్తులు వికసిస్తాయి. ఈ విధంగా భౌతికంగాను, ఆత్మికంగాను ప్రగతిని సాధిస్తాడు.

ఇక మూడవ లాభం ఏకాగ్రత. ఒక వస్తువుమీద గాని, నాదము మీద గాని ధ్యానము ఏకాగ్రమైనందున మనస్సులో చెల్లా చదురైన శక్తులు ఒకేచోట కుదురుకుంటాయి. ఈ విధంగా మనస్సును వశపరచుకుని, నిర్ణయించుకున్న పనిమీద నిలుపుకుంటే అనుకున్న సాధన సఫలమౌతుంది. ఈ సాధన యొక్క గొప్పదనాన్ని అధ్యాత్మవాదులు బాగా అర్థం చేసికోగలుగుతారు. భూతద్దం ద్వారా వేర్వేరు మార్గాలలో ప్రయాణం చేసే కాంతి కిరణాలు ఒకేచోట కూడినప్పుడు అగ్ని ఉత్పన్నమౌతుంది. అదేవిధంగా మానవుడు తన శరీరంలో చెల్లా చెదురుగా పడిఉన్న అనంతదివ్య శక్తుల్ని ఏకీకరణ చేసి మహాశక్తిని ఉత్పన్నం చేయగలుగుతాడు. దాని ద్వారా ప్రపంచాన్నే ఒక్క ఊపు ఊపగలుగుతాడు. తనకోసం ఆకాశంలో మార్గాన్ని ఏర్పాటు చేసికోగలుగుతాడు.

సాధకుడు నాదలహరిని పట్టుకుని ఎగబ్రాకుతూ బ్రహ్మ యొక్క ఉద్గమస్థానాన్ని చేరుకోగలుగుతాడు అంటే నాదయోగం ద్వారా ఆత్మకు ప్రియమైన బ్రహ్మపదాన్ని చేరుకోవడమన్న మాట. దీనినే ముక్తి, నిర్వాణం, పరమపదం మొదలైన పేర్లతో పిలుస్తుంటారు. నాదం ఆధారంగా మనోల్లాసాన్ని పొందే సాధకుడు యోగం యొక్క చివరి మెట్టుకు చేరుకోగలుగుతాడు. కోరుకున్న దానిని సాధించుకోగలుగుతాడు. మరి ఈ నాదాన్ని అభ్యసించే విధానం ఏమిటి?

నాదాన్ని అభ్యసించాలంటే ప్రశాంతమైన వాతావరణంలో ఒంటరిగా కూర్చోవాలి. వెలుతురు అధికంగా ఉంటే అభ్యాసం కుంటుపడుతుంది. అందువల్ల ఒక చీకటిగదిని వెతికి పెట్టుకోవాలి. రాత్రివేళ ఒక జాము గడిచిన తరువాత నుండి సూర్యోదయానికి ముందు వరకు గల సమయం ఈ సాధనకు అనుకూలమైనది. ఒకవేళ ఈ సమయాన్ని ఉపయోగించుకోలేకపోతే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం సూర్యాస్తయమం వరకు గల సమయంలో ఎప్పుడైనా నిర్ణయించుకోవచ్చు. కాని రోజూ ఒకే సమయంలో అభ్యాసం చేయాలి. నియమించుకున్న గదిలో ఆసనం గాని, పడక కుర్చీగాని వేసికుని కూర్చోవాలి. ఆసనంమీద కూర్చున్నట్లైతే వీపుకు ఒక దిండుగాని లేక బట్టలమూటగాని పెట్టుకోవాలి. అట్లా కూడ సాధ్యం కాకపోతే ఒక మూలకు కూర్చుని గోడకు ఆనించుకోవాలి. ఏవిధంగా కూర్చున్నా శరీరానికి విశ్రాంతి కలిగే లాగ, వదులుగా ఉండేలాగ చూచుకోవాలి.

"ఇప్పుడు నా శరీరం దూదికుప్ప మాత్రమే. నేను దానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాను." అని భావించుకోవాలి. ఆ రకంగా భావన చేస్తే కొద్దిసేపటికి శరీరం పూర్తిగా తేలికగా తయారౌతుంది. తన బరువును తానే మోయలేనట్లు తూలిపడిపోతూ ఉంటుంది. ఆ సమయంలో పడక కుర్చీలో గాని, గోడకుగాని, దిండుకు గాని వీపును ఆనించి కూర్చోవాలి. శుభ్రమైన మెత్తటి దూదిని తీసికొని ఉండగా చేసి రెండు చెవులలో ధరించాలి. బయటి శబ్దాలు చెవులలో ప్రవేశించరాదు. వ్రేళ్లతో కూడ చెవిరంధ్రాలను మూసుకోవచ్చు. ఐనా కొద్దిపాటి శబ్దాలు వినిపిస్తే మనస్సును అటువైపు నుండి మళ్లించి శిరస్సువైపుకు త్రిప్పుకోవాలి. అక్కడి నుండి వినిపించే ధ్వనులను శ్రద్ధగా ఆలకించాలి.

ప్రారంభంలో ఏమీ వినిపించకపోవచ్చు. కాని నాలుగు ఐదు రోజులు ప్రయత్నం చేసిన తర్వాత సూక్ష్మ కర్ణేంద్రియాలు

**న్యాయమూర్తి చౌర్యాన్ని అంగీకరిస్తే దొంగతనం న్యాయబద్ధమౌతుంది.**

నిర్మలమై పోతాయి. శబ్దాల స్పష్టత కూడ పెరిగిపోతుంది. మొట్టమొదట అనేక శబ్దాలు వినిపిస్తాయి. శరీరంలో జరిగే రక్త ప్రసరణ ధ్వని కూడ ధక్– ధక్– ధక్– ధక్ అంటూ రైలు నడుస్తున్నట్లుగా వినిపిస్తుంది. గాలి వీస్తున్న చప్పుడు, మేఘాలు గర్జిస్తున్న చప్పుడు, ద్రవం ఉడుకుతున్నట్లు శబ్దాలు వినిపిస్తాయి. ఈ మూడు రకాల శబ్దాలు శారీరిక క్రియల ద్వారానే ఉత్పన్నమౌతాయి. అదేవిధంగా రెండు రకాల శబ్దాలు మానసిక క్రియల ద్వారా ఉత్పన్నమౌతాయి. మనస్సులో చంచలత్వం యొక్క అలలులేస్తూ ఉంటాయి. మానస తంతువులను ఢీకొని పెద్దగా శబ్దం చేస్తాయి. ఏవిధంగానంటే రేకుల మీద వర్షం కురిసినట్లు ధ్వనిస్తాయి. మస్తిష్కం బాహ్య జ్ఞానాన్ని పొందిన తర్వాత ఏదో ఒకప్రాణి శ్వాస పీల్చుకుంటున్నట్లు అనుభూతి కలుగుతుంది. ఈ అయిదు శబ్దాలు శరీరానికి, మనస్సుకు సంబంధించినవి. కొన్నిరోజుల అభ్యాసం తర్వాత రెండు మూడు వారాలలో ఈ శబ్దాలు చాల స్పష్టంగా వినిపిస్తాయి. ఈ శబ్దాలను వినడంవల్ల సూక్ష్మ ఇంద్రియాలు నిర్మలమైపోతాయి. గుప్త శక్తుల్ని గ్రహించే శక్తిని పంచుకుంటాయి.

శబ్దాన్ని వినే శక్తి పెరిగిన కొద్దీ వేణువు, ఈల శబ్దాలలో కలసిన అనేక శబ్దాలు వినపడుతుంటాయి. ఇది సూక్ష్మలోకంలో జరిగే క్రియలను పరిచయం చేస్తుంది. తప్పిపోయిన పిల్లవాడు చాల రోజుల తర్వాత తల్లి ఒడిని చేరినప్పుడు అమితమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. అదేవిధంగా ఈ శబ్దాలను వినగలిగిన వ్యక్తి అపూర్వమైన ఆనందానుభూతిని చెందుతాడు.

సాధకుడు వినే సూక్ష్మ శబ్దాలు ఆత్మ– పరమాత్మ తత్వాల మేళవింపుకు సంబంధించినవి. పరమాత్మ వద్దకు ప్రవేశించిన ఆత్మ పరమాత్మయందే లీనమైపోతుంది. మెల్లమెల్లగా ఈ శబ్దాలు స్పష్టంగా వినిపిస్తుంటాయి. సాధకుడు విని అద్భుతమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. అప్పుడప్పుడు ఆ ఆనందసాగరంలో తేలియాడుతూ తనను తానే మరచిపోతాడు. చివరి శబ్దం 'ఓం' మిక్కిలి సూక్ష్మమైంది. దీని ధ్వని గడియారం గంటలు కొడుతున్నట్లు వినబడుతుంది.

ఓంకార ధ్వని వినబడుతున్నప్పుడు కునికిపాట్లు వస్తున్నట్లు, నిద్రవస్తున్నట్లు, స్పృహతప్పుతున్నట్లు అనిపిస్తుంది. సాధకుడు తన్నుతాను మరచిపోయి సమాధిస్థితిలోనికి వెళ్లిపోతాడు ఆ స్థితిలోని తురీయావస్థను పొందుతాడు. దీనికన్నా ఉన్నతమైన ఆత్మ– పరమాత్మల మేలి కలయికను అనుభూతి చెందుతాడు, పూర్తిగా పరమాత్మస్థితిని పొందుతాడు.

ప్రణవనాదం యొక్క ప్రారంభరూపమే అనాహత నాదం. ఘర్షణవల్ల రెండు వస్తువుల సంయోగం వల్ల ఉత్పన్నమయ్యేదే అనాహత నాదం. వాక్కు ఆకాశతత్వాన్ని ఢీకొన్నప్పుడు గాని, రెండు వస్తువుల రాపిడివల్ల గాని కలిగే శబ్దాన్ని 'ఆహత' నాదం అంటారు, ఎటువంటి ఘర్షణ లేకుండ దివ్యమైన ప్రకృతినుండి సహజంగా ఉత్పన్నమయ్యే ధ్వనిని ప్రణవనాదం అంటారు. ప్రణవ నాదం లేక అనాహతనాదం దశవిధాలుగా ఉంటుంది. (1) సంహారక (2) పాలక (3) సృజక (4) సహస్రదళ (5) ఆనందమండల (6) చిదానంద (7) సచ్చిదానంద (8) అఖండ (9) ఆగమ (10) అలఖ అని వాటి పేర్లు.

వీటి ధ్వనులు క్రమంగా (1) గజ్జెలచప్పుడు వలె (2) సముద్రపు అలల హోరువలె (3) మృదంగపు ధ్వని వలె (4) శంఖ ధ్వని వలె (5) ఒకరకమైన బాకా వలె (6) పిల్లన గ్రోవి వలె (7) వీణవలె (8) సింహగర్జనవలె (9) సన్నాయి వలె (10) పికిలి పిట్ట అరుపు వలె ఉంటాయి. అనేక రేడియో స్టేషన్లనుండి అనేక ప్రత్యేక కార్యక్రమాలు ఒకేసారి ప్రసారం జరుగుతున్నట్లు అనేకరకాల (అనాహత) సహజ శబ్దాలు కూడ ధ్వనిస్తూ ఉంటాయి. వాటికి కారణాలు, ఉపయోగాలు, రహస్యాలు కూడ అనేక రకాలుగా ఉంటాయి. 64 అనాహత శబ్దాలు ఇప్పటివరకు గుర్తించబడ్డాయి. అన్నీ వినడం అందరికీ సాధ్యపడదు. వారి వారి ఆత్మిక శక్తి యొక్క ప్రగతిని అనుసరించి సూక్ష్మ శబ్దాలను వినగలుగుతారు. పైన చెప్పబడిన దశవిధ శబ్దాలను సాధారణమైన ఆత్మబలం కలవాడు కూడ వినగలుగుతాడు.

ఈ ప్రణవనాదం సూక్ష్మలోకాల దివ్య భావనలే, సూక్ష్మ జగత్తులో ఎక్కడ, ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఏ కార్యక్రమం జరుగుతుందో దానికి సంబంధించిన రహస్యాలను ఈ శబ్దాల ద్వారా తెలుసుకోవచ్చు. ఏ సాధకుడు ఏ ధ్వనిని స్పష్టంగా లేక మందంగా వింటాడో అది ఆతని మనోభూమియొక్క గొప్పదనంపై ఆధారపడి ఉంటుంది.

ప్రణవనాదం నిస్తంత్రీ విధానంతో కూడుకున్న దైవీ సందేశ ప్రణాళిక. దీనిని గ్రహించిన సాధకుడు అన్నింటినీ తెలుసుకో గలుగుతాడు. ఈ శబ్దాలలో ఓంకార ధ్వని శుభప్రదమైనది. విశేష ధ్వనులు విభిన్న ప్రకారములైన సిద్ధులను కలుగచేస్తాయి. గాయత్రీ యోగం ద్వార ఆనందమయకోశాన్ని మేల్కొల్పడానికి ఎంతటి జ్ఞానం అవసరమో అంతవరకే చెప్పడం జరిగింది.

★★★

**తక్షణ కర్తవ్యానికి అంకితమైతే - తరువాతి కర్తవ్యం అదే బోధపడుతుంది.**

ఆచరణలో అధ్యాత్మ

# పునర్జన్మ-ఆస్తికత

ఆత్మ అమరం అనడానికీ, శరీరం అశాశ్వతం అనడానికీ ఏకైక ప్రమాణం పునర్జన్మ. మరణించిన వెంటనే మరొక్క జన్మ తప్పదన్న తథ్యం హిందూ ధర్మంలో అనాదిగా ఉన్నదే. పురాణాలలో పునర్జన్మ గురించి అడుగడుగునా వర్ణింపబడింది. పెద్దల మాటల్లో, ధర్మశాస్త్రాల్లో ఆత్మను గురించి అమోఘంగా చెప్పబడింది. ఇతర ధర్మాలలో కూడా ఆత్మను గురించి ఏదో ఒక రూపంలో సమర్థించడం జరిగింది. క్రైస్తవ మతంలోను, ఇస్లాంలోను పునర్జన్మను ఒప్పుకోలేదు. కాని ఆత్మకు మాత్రం అస్తిత్వాన్ని ఆపాదించారు. మరణానంతరం ఈశ్వరుని సమీపంలో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని నమ్ముతున్నారు. 84 లక్షల యోనుల్లో సంచరించిన తర్వాతనే మానవజన్మ లభిస్తుందనీ, చేసిన పాపపుణ్యాలను అనుభవించే నిమిత్తం మరల జన్మించాల్సి ఉంటుందనీ ధర్మగ్రంథాల్లో అనేక ఉదాహరణలున్నాయి. భూత-ప్రేతాలు, స్వర్గ-నరకాలు ఈ సిద్ధాంతాన్ని మరింత బలపరుస్తున్నాయి. శరీరం వీడిన ఆత్మకూడ ఒక పద్ధతిప్రకారం తన పయనం కొనసాగిస్తుంది.

పునర్జన్మకు, కర్మఫలానికి అవినాభావసంబంధముంది. ఏ జన్మలో చేసిన మంచి చెడుల ప్రభావం ఆ జన్మలో అనుభవానికి రాదు. దానిని అనుభవించాలంటే మరొక జన్మకావాలి. ఈ సిద్ధాంతాన్ని నమ్మడంవల్ల పాపం చెయ్యాలంటే భయమేర్పడుతుంది. పుణ్యకార్యాలపై మనస్సులగ్నమౌతుంది. పాపభీతి అనేది లేకుంటే నీతిని, సదాచారాలను పాటించలేం. సామాజిక మర్యాదలను గౌరవించలేం. ఆత్మయొక్క అమరత్వానికి, పాపభీతికి సంబంధించిన అధ్యాత్మను వదిలేసినట్లైతే సమాజంలో ఆదర్శంగా నిలబడలేం.

పునర్జన్మకు సంబంధించిన ఉదాహరణలు మనకు అనేక విధాలుగా ఎదురౌతుంటాయి. ఒక్కొక్క బాలుని జీవన విధానం చూస్తుంటే- "అతడు పూర్వజన్మలో సిద్ధపురుషుడు" అంటుంటాం. కొందరైతే వెనుక జన్మకు సంబంధించిన వారిపేర్లను సంఘటనలను కూడ చెపుతూ ఉంటారు. వారిని గుర్తుపడుతూఉంటారు. కొందరు మనుష్యులను మరచిపోయినా వస్తువులను గుర్తించి వివరిస్తారు. కొందరు తనకు సంబంధించిన, ఇతరులకు సంబంధించిన సంపదలను వివరిస్తారు. వీటిన్నింటిని బట్టి పునర్జన్మను నమ్మితీరాల్సి ఉంటుంది. ఇతర దేశాలలోకూడ ఒక్కొక్క సందర్భాన్ని బట్టి పునర్జన్మను ఒప్పుకుంటున్నారు. విదేశాలలోకూడ కొన్ని కొన్ని ఉదాహరణలు దొరుకుతూనే ఉన్నాయి. వారు మూఢంగా నమ్మడంలేదు. శాస్త్రశోధనలో శోధించి మరీ చెపుతున్నారు. ఇవి కల్పితాలుకావని రూఢిగా నమ్ముతున్నారు.

ప్రముఖ దార్శనికుడు F.H. విలిస్ పునర్జన్మ, ఆత్మవికాసం రెండూ నిజమేనని తేల్చిచెప్పాడు. ఉన్నతమైన ఆత్మలు మహోన్నత కార్యాలను నెరవేర్చేందుకు మరల మరల జన్మిస్తాయి. ఆయనకు ఇలాంటి మహాత్ములతో పరిచయాలున్నాయి. వారిఆలోచనలు, చేపట్టిన కర్తవ్యాలు సమానస్థాయిలో ఉంటాయి. వారు పునర్జన్మను, దానికి సంబంధించిన ఘట్టాలను నమ్ముతారు. దానిననుసరించే క్రీస్తు రెండవసారి "అపోలోనిక్స్ ఆఫ్‌టిమానా" రూపంలో జన్మించాడని చెపుతారు. "శోపేనహావర్" బుద్ధుని అవతారంగా చెపుతారు., 'ఫిక్టే', 'హీగల్', 'కాణ్ట్' మొదలైన ప్రసిద్ధ దార్శనికులు కూడ భారతీయ ఆత్మలు అనే చెపుతుంటారు. శ్రీమతి 'బేసెన్టు' మొదటి జన్మలో 'బూనోం' అని, మూడవ జన్మలో 'గ్లైడస్టోన్' అని చెపుతుంటారు.

అమెరికాలోని సుప్రసిద్ధ ఫాదరీ 'జిమ్ వి శప్' తన పరిశోధనా గ్రంథంలో మాజీరాష్ట్రపతి 'అబ్రహాంలింకన్' ఆత్మ రాష్ట్రపతి 'జాన్ ఎఫ్. కెనడీ'గా జన్మించిందని వ్రాశారు. ఆయన ఇద్దరి జీవితాలను తులనాత్మకంగా పరిశీలించి ఈ సత్యాన్ని ప్రజల ముందుంచారు. ఇద్దరిలోను ఘనిష్టమైన ధార్మిక భావాలున్నాయి. ఇద్దరు విశ్వశక్తిని ఉపాసించినవారే. 40 సంవత్సరాల వయస్సులోనే ఇద్దరికీ రాష్ట్రపతి కావాలన్న కోరిక కలిగింది. నీగ్రోలకు స్వాతంత్ర్యం తేవాలని ఇద్దరు నిరంతరం కృషిచేశారు. కుటుంబ జీవనం కూడ ఇద్దరిదీ సమానమే. ఇద్దరికీ కూడ మృత్యువు శుక్రవారం నాడు తుపాకీ గుండుద్వారానే సంభవించింది. ఇద్దరి మృత్యువు తర్వాత వారి పదవులను స్వీకరించిన వారి పేర్లు 'జాన్సన్' కావడం ఎంత అద్భుతమైన సామ్యం! దీని వెనుక సూక్ష్మమైన ఆధ్యాత్మికత దాగి ఉంది అని అనిపించక మానదు.

వర్జీనియా విశ్వవిద్యాలయంలో కీర్తిగడించిన మానసిక శాస్త్రవేత 'డాక్టర్. హవాన్ స్టీవెన్సన్' పునర్జన్మకు సంబంధించిన నిజాలను పరిశోధించాలనుకున్నారట. "శుభస్యశీఘ్రం" అన్నారు గదా పెద్దలు.

**గతాన్ని మరచి బ్రతుకును ప్రేమించు - విధినెదిరించి విజయం సాధించు.**

వెంటనే ప్రపంచపర్యటన చేశారట. ప్రామాణికమైన ఆధారాలను సేకరించారట. ఆ ప్రయత్నంలోనే భారతదేశం కూడ వచ్చారట. కన్నౌజుకు సమీపంలో జన్మించిన ఒక బాలుని శరీరం మీద 5 గాయాల గుర్తులున్నాయట. క్రిందటి జన్మలో తనను శత్రువులు చాకుతో పొడిచి హత్య చేశారనీ, ఈ గుర్తులు వాటికి సంబంధించినవేననీ ఆ బాలుడు చెప్పాడట. దానికి తగిన పరిశోధన చేయగా అది నిజమేనని తేలిందట. భారతదేశంలో ఇలాంటి ఉదాహరణలు అనేకం లభించాయట. పునర్జన్మకు సంబంధించిన విశ్వాసం భారతదేశంలో అధికమనీ, అందువలన అటువంటి వారిని గౌరవిస్తారనీ చెప్పారట.

లెబనాన్‌లోను, తుర్కిస్థాన్‌లోను పునర్జన్మకు సంబంధించిన అనేక సంఘటనలు జరిగాయి. పరిశోధకులు, శాస్త్రవేత్తలు వాటిని నిజమని ఋజువు చేశారు. ఇదే విధంగా 'కొల్రాయిడీ ప్యూఏలీ' అనే నగరంలో చాలా కాలం క్రిందట 'రోథ్ సీయేన్స్' అనే బాలిక జన్మించిందట. ఆమె తన గతజన్మ వృత్తాంతాలను చెప్పి క్రైస్తవ మతస్థులను ఇరకాటంలో పడేసిందట. క్రైస్తవులకు పునర్జన్మమీద నమ్మకం లేదు. ఆత్మ విద్యలో ఆరితేరిన 'మోరే వర్నస్టాయిన్' ఆ బాలికను సగం మూర్ఛితురాలిని చేశాడు. మెల్లగా ఆమె పూర్వజన్మ వృత్తాంతాన్ని ఆరా తీశాడు. ఆమె 100 సంవత్సరాలక్రితం ఐర్లాండుకు చెందిన మార్క్ నగరంలో పుట్టిందట. ఆనాటి పేరు 'బ్రాయిడీ మర్ఫీ' అనీ, భర్త పేరు 'మేకార్థీ' అని చెప్పిందట.

మానసిక శాస్త్రవేత్తలు, వైజ్ఞానికులు లోతైన అధ్యయనం చేసిన తరువాత పునర్జన్మ ఉన్నదని తేల్చి చెప్పారు. పూర్వ జన్మ సంస్కారాల ప్రభావం ఈ జన్మలో కనిపిస్తూనే ఉంటుంది. దీనికి ఉదాహరణ శ్రీలంకలోని ఒక బాలిక కథ. ఆమె పేరు 'జ్ఞాన తిలక'. ఆమె పూర్వజన్మలో బాలుడనని చెప్పుకొందట. ఎక్కడ పుట్టిపెరిగిందో చెప్పిందట. అక్కడకు తీసికొని వెళ్లారట. ఆ ప్రదేశంలో ఒకరోజంతా తిరిగి అనేక విషయాలు చెప్పిందట. గత జన్మలో బాలుడిననీ, ఆనాటి పేరు 'తిలకరత్న' అనీ, ఆ సమయంలో బాలిక నవ్వాలన్న కోరిక మెండుగా ఉండేదనీ చెప్పిందట. పరిశోధనలో అన్నీ నిజమని నిరూపించబడ్డాయట.

విలియమ్ వాకర్, కేన్సన్ అనే ప్రసిద్ధ వైజ్ఞానికులు తమ పరిశోధనా గ్రంథం 'రి ఇన్‌కార్నేశన్'లో ఇలాంటి ఘట్టాలు అనేకం వివరించారు. వాటిని చదవగలిగితే పునర్జన్మను నమ్మితీరుతారు. పిల్లలద్వార నిరూపింపబడిన ఈ విషయాలను నమ్మకుండా ఉండడం సాధ్యంకాదు. పిల్లలు పెద్దవారైన కొద్దీ ఇలాంటి విషయాలు గుర్తు పెట్టుకోలేరు. ఈ జన్మకు సంబంధించిన వ్యాపకాలలో చిక్కుకుని క్రమంగా పూర్వజన్మను మరచిపోతారు.

జీవాత్మ చిన్న- పెద్ద క్రిమికీటకాలనుండి పశు- పక్షుల యోనులలో తిరుగుతూ 84 లక్షల యోనుల తర్వాత మానవ యోనిలో ప్రవేశిస్తుంది. కాని పునర్జన్మలను పరిశీలించాక తేలిందేమంటే మానవునికి పునర్జన్మ మానవ జాతిలోనే లభిస్తుంది. మానవ యోనిలో జీవచైతన్యం విస్తారంగా వికసిస్తుంది. ఇంత విస్తారం ఇతర చిన్న చిన్న యోనులలో జరుగదు. దీర్ఘాయువైన మానవుడు చిన్ననాటి దుస్తులనే ఎప్పటికీ ధరించి తిరగలేడు. ఇదే తర్కం మానవ యోనిలో జన్మించిన తరువాత చిన్న యోనిలోనికి తిరిగి ప్రవేశించాలంటే ఇష్టపడరనడానికి కూడ సరిపోతుంది. జీవితం క్రమక్రమంగా వికాసం చెంది మానవుని స్థాయి వరకు వస్తుందని అర్థమౌతోంది. దీనిని డార్విన్ తన వికాసవాద సిద్ధాంతంలో కూడ ప్రవేశపెట్టాడు. ఒకసారి మానవ జన్మ ఎత్తాక మరల వెనుదిరిగి వెళ్లడం చాలకష్టం.

ప్రస్తుతం పునర్జన్మ ఎంత సత్యమో అంత ఉపయోగకారి. భారతీయ సంస్కృతిలోని ఈ వ్యవస్థవలన గొప్ప ప్రయోజనముంది. పునర్జన్మవలన మానవుడు తన జీవన లక్ష్యాన్ని పటిష్ఠం చేసుకుంటాడు. ఆత్మయొక్క అమరత్వం వలన ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటాడు. దీనివలన నూతన శరీరధారణతో, నూతనోత్సాహంతో కార్యక్షేత్రంలో ప్రవేశించాలని తహ తహ చెందుతాడు. అన్ని విధాల ఆదర్శమూర్తిగా అలరారుతాడు.

★★★

*ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.*

**దేశకాల పరిస్థితులను బట్టి ఆచరించేదే మన కర్తవ్యం-ధర్మం.**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-56

# సరికొత్త వెలుగులో-2

## సంప్రదాయంతోపాటు వివేకం

గాయత్రీ ఉపాసన, వేద అధ్యయన అధికారం, శౌచ విధులు, కర్మకాండ వంటి విషయాలపై స్వామివారికి స్వంత నమ్మకాలు ఉన్నాయి. శ్రీరామ్ వాటిలో కొన్నింటిపై వారితో చర్చ జరిపారు. వారి ఆలోచనలు పూర్వాచార పరాయణములనీ, అయితే అవి నిరాధారాలు కావనీ శ్రీరామ్ గ్రహించారు.

ఉదాహరణకు- గాయత్రీ ఉపాసన కేవలం బ్రాహ్మణులకేనని స్వామివారు అన్నారు. అయితే, ఆ కులంలో జన్మించినవాడు మాత్రమే బ్రాహ్మణుడు కాడనీ, బ్రాహ్మణ ప్రవృత్తి కలిగినవాడనీ చర్చలో స్వామివారు స్పష్టం చేశారు. ఈ ప్రవృత్తిని సంపాదించవచ్చు. సాత్వికత, జిజ్ఞాస అనే ప్రవృత్తులను కలిగి ఉన్నప్పుడే శాస్త్రాల అధ్యయనం సత్ఫలితాలను ఇస్తుంది. ఆ ప్రవృత్తి లేకపోతే- వ్యక్తి శాస్త్రాన్నీ, విద్యనూ తన వినాశనానికే వినియోగిస్తాడు. అసురులవలె- అతడు తనకూ మేలు చేసుకోలేడు, ఇతరులకూ మేలు చేయలేడు. ఆలయాలలో పూజ, హారతి విధి విధానం ప్రకారం జరగాలి. విధి విధానం యొక్క లక్ష్యం ఆయా క్రియలలో జీవాన్నీ, శక్తినీ నింపడం -ఇదీ స్వామివారి అభిప్రాయం.

స్వామివారు ఇలా అన్నారు-

"సంప్రదాయంలో, వ్యవస్థలో సవరణలు తేవచ్చు. అయితే అందుకు అధికారం కావాలి. ఆ అధికారం ఋషిసత్తాలద్వారానే లభిస్తుంది. ప్రతివాడూ సవరణలు చేస్తూపోతే, కొత్త విధి విధానాలను తయారు చేస్తూపోతే- విచ్చలవిడితనం ఏర్పడుతుంది."

"పరిపాలన యొక్క నియమాలను పాలకులే రూపొందిస్తారు కదా. ఇతరులు రూపొందించలేరు కదా. అలాగే, ధార్మిక రంగంలో కొత్త సంప్రదాయాలనూ, సంస్కరణలనూ ఋషిగణములే నిర్ణయించగలుగుతారు."

"ఆ అధికారాన్ని సంపాదించవచ్చా, లేక అది లభ్య మవుతుందా?" -అని శ్రీరామ్ అడిగారు.

స్వామివారు ఇలా అన్నారు-

"సమయానికీ, సమాజపు అవసరానికీ అనుగుణంగా పరమ సత్తాయే ఆ అధికారాన్ని ఇస్తుంది. ఆ సంప్రదాయాన్ని, ఆ విధి విధానాన్ని నిర్వహించే సామర్థ్యం అధికారానికి గీటురాయి. ఒక నియమాన్ని ఏర్పరచి, దానికి అనుగుణంగా నడుచుకుంటే ఫలితం రానప్పుడు- ఆ నియమంవల్ల ప్రయోజనం ఉండదు. అది బాలల క్రీడ. శంకర భగవత్పాదులు వివిధ పూజ- అనుష్ఠానాలను ఏర్పరచారు. ఫలితాన్ని ఇచ్చే సామర్థ్యాన్ని కూడ వారు వాటిలో ఉత్పత్తి చేశారు. సంప్రదాయం ఆ తర్వాత దానికి పోషణ ఇచ్చింది. ఇప్పుడు కూడ కొత్త విధి విధానాలను సృష్టించవచ్చు. ఎప్పుడైనా సృష్టించవచ్చు. అందుకు అధికారం కావాలి."

## నూతన మార్గం నిర్ణయమైంది

అనేక అంశాలపై చర్చ సాగింది. కొత్త విధి విధానానికి సమయం వచ్చిందని స్వామివారు పలుమారులు సూచించారు. దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా ఋషిసత్తా ప్రజల వికాసానికి ఉపకరించే మార్గాన్ని నిర్మాణం చేసి ఉన్నదని ఆయన వివరించారు. అధికారం పొందిన వ్యక్తి ఆ మార్గాన్ని అమలుచేసే పనిమాత్రమే మిగిలి ఉన్నదని ఆయన అన్నారు. ఆ వ్యక్తికి ఎవరు? ఏ లక్షణాలవల్ల అతడిని గుర్తించగలుగుతాము? ఆయన సత్తాకు ఎవరు గుర్తింపు ఇస్తారు? ఈ ప్రశ్నలకు స్వామివారు సమాధానం ఇవ్వలేదు ఈ ప్రశ్నలు అడగడం అవసరమని శ్రీరామ్ భావించలేదు. తామే ఆ మార్గాన్ని అమలు చేసేవాళ్లమని లేనిపోని గొప్పలు చెప్పుకునే వ్యక్తులు కొందరు ఉదయించవచ్చు కదా. అసలు వ్యక్తి ఎవరో, నకిలీ వ్యక్తి ఎవరో గుర్తించడం ఎలా?

శ్రీరామ్ అడిగిన ఈ ప్రశ్నకు స్వామివారు ఇలా జవాబిచ్చారు-

"ప్రజలే గుర్తిస్తారు. పరివర్తన ఆకాశంనుండి ఊడిపడదు. దాని వెనుక సంప్రదాయంయొక్క బలం కూడ ఉంటుంది. ఋషులు ఏర్పరచిన వ్యవస్థను కాదని ఏ సవరణా జరగదు. కాదని సవరణ చేసే దుస్సాహసం వంచనయే అవుతుంది."

**పరోపకారమే పుణ్యం - పరపీడనమే పాపం.**

ఇలా చెప్పి, లేచి నిలబడుతూ స్వామివారు ఇలా అన్నారు–

"ఈ వివరాలలోకి వెళ్లడం అనవసరం. కామాక్షి అమ్మవారు, మహాకాలుడు స్వయంగా ప్రమాణం చూపుతారు అసలు వ్యక్తి విషయంలో."

శ్రీరామ్‌కూడ లేచి నిలబడ్డారు. శ్రీరామ్‌కు మఠాన్ని చూపించవలసిందిగా స్వామివారు మఠాధికారులకు సూచించారు. ఆలయం, పాఠశాల, గురుకులం, యజ్ఞ స్థలం, అక్కడ జరుగుతూన్న సేవా కార్యక్రమాలు– అన్నింటినీ వారు శ్రీరామ్‌కు శ్రద్ధగా చూపించారు. శ్రీరామ్ ఏకాగ్ర చిత్తంతో వాటిని పరిశీలించారు. కొన్నిటిని గురించి గ్రుచ్చి గ్రుచ్చి అడిగారు. తాను కూడ ఇలాంటి కార్యకలాపాలను నిర్వహించదలచినట్లు, వాటి విధి– వ్యవస్థలను ఇక్కడ అవగాహన చేసుకుంటూన్నట్లు.

కామకోటి పీఠంనుండి వీడ్కోలు తీసుకునే ముందు శ్రీరామ్ మరోమారు స్వామివారిని కలుసుకున్నారు. స్వామివారు ఆయనకు రుద్రాక్ష మాలనూ, శ్రీచక్రాన్నీ ఇచ్చారు. ఏమీ మాట్లాడలేదు. శ్రీరామ్ స్వామివారికి ఇలా నివేదించారు–

"తమ ఆశీస్సులను స్వీకరిస్తున్నాను. నాకు బలాన్ని ప్రదానం చేస్తూ ఉండండి."

స్వామివారు మాలనూ, శ్రీ చక్రాన్నీ మార్చి మార్చి చూపుతూ ఇలా అన్నారు–

**"మీ ఆత్మ, అమ్మవారి వైభవం మీకు సాఫల్యాన్ని ఇస్తాయి."**

మాల అంటే వారి ఉద్దేశ్యం తన ఆత్మను మేలుకొలపడానికి జరుపబడే జప తపాలు. శ్రీ చక్రం అంటే– దివ్యసత్తాల అనుగ్రహంవల్ల లభించేవి. శ్రీ చక్రం శ్రీ (లక్ష్మి), సమృద్ధి, వైభవాల కోరికలను తీర్చుతుంది. మంత్రంతో పూజించబడిన, సిద్ధమైన శ్రీ చక్రాన్ని శ్రీరామ్‌కు ప్రసాదంగా ఇచ్చారు.

శ్రీరామ్ ప్రణామం చేసి, లేచి, బయటికి వచ్చారు; మరోమారు మఠ శిఖరాన్ని పరికించారు.

## శ్రీ అరవింద ఆశ్రమానికి పయనం

ఆనాడు శ్రీ అరవింద ఆశ్రమంలో కొన్ని ఇళ్లు, మైదానం మాత్రమే ఉండేవి. ఇప్పుడది చాల విస్తరించింది. 40వ దశకంలో శ్రీమాత, శ్రీ అరవిందులు కాక 35–40 మంది సాధకులు అక్కడ నివసించేవారు. వారిలో కూడ కొందరు ఆశ్రమం బయట పాండిచెరీలో కొన్న ఇళ్లలో, అద్దె ఇళ్లలో ఉండేవారు. అయినా, దేశ విదేశాలనుండి ప్రజలు వచ్చి వెళుతూ ఉండేవారు. వారిలో శ్రీ అరవిందుల శిష్యుల సంఖ్య హెచ్చుగా ఉండేది. పాండిచెరీ పర్యటనకు వచ్చిన జనం అప్పుడు ఆశ్రమంలో హెచ్చుగా లేరు. అక్కడ పర్యాటకులకు దర్శనీయ స్థలాలు లేవు. సాధన, స్వాధ్యాయముల వాతావరణం ఉండేది. నిర్ణీత సమయంలో శ్రీమాత దర్శనార్థులను కలుసుకోవడానికై కూర్చునేవారు. ఒకోసారి ఆధ్యాత్మిక విషయాలపై చర్చ తలఎత్తేది. అందుకు కొంత సమయం పట్టేది. మామూలు పర్యాటకులకు ఈ చర్చలలో ఏమి ఆసక్తి ఉంటుంది?

యాత్ర సమయంలో శ్రీరామ్ చేరవలసిన స్థలాన్ని గురించి సాధ్యమైనంతగా సమాచారాన్ని సేకరించేవారు. అది ఆయన స్వభావంగా మారింది. తోడి ప్రయాణికులతో ఉబుసుపోక కబుర్లు చెప్పే బదులు– ఆ స్థలం చరిత్ర, అక్కడి ఆచార వ్యవహారాలు, ప్రజల స్వభావం గ్రహించేందుకై చర్చ జరిపేవారు. ఇలా అందే సమాచారంలో ఎక్కువ భాగం నిరుపయోగంగా ఉండేది. తాము విన్న విషయాలకు సొంత కవిత్వాన్ని కలిపి, దాన్ని నలుగురికీ చెప్పడం పలువురి స్వభావం. ఈ సమాచారాన్ని జల్లెడపట్టి, దానిలో పనికివచ్చే భాగాన్ని మాత్రమే గుర్తుంచుకునే కళను కూడ శ్రీరామ్ నేర్చుకున్నారు.

## పాండిచెరీ సమాచారం

అరవిందాశ్రమాన్ని చేరేటప్పటికి శ్రీరామ్ ఆశ్రమం గురించీ, పాండిచెరీ గురించి చాలా విషయాలు తెలుసుకున్నారు. పాండిచెరీ బ్రిటిషువారి అధీనంలో లేదు. ఫ్రెంచివారి అధీనంలో ఉంది. అక్కడ ఏ పంటలూ పండవు– ఉల్లిపాయలు తప్ప. సముద్ర ఉత్పత్తులు చేపలు మాత్రమే. పాండిచెరీకి మిగతా భారత్‌తో కాని, బ్రిటిష ప్రభుత్వంతో కాని సంబంధం లేదు. కనుక ఆహార పదార్థాలు ఫ్రాన్సు నుండి వచ్చేవి. డబ్బాలలో వచ్చేవి. చౌకగా ఉండేవి. ఇక్కడికి వచ్చినప్పుడు శ్రీ అరవిందులు బ్రెడ్డు, పాలతో జీవనం గడిపారు. శ్రీమాత వచ్చిన తర్వాత, ఆయన ఆహారంలో, సాధకుల ఆహారంలో కొద్ది వైవిధ్యం వచ్చింది. ఆశ్రమంలో ఇళ్ల చుట్టూ ఉన్న స్థలాలలో గోడలప్రక్క ఆమె పూల మొక్కలు నాటించారు. ఖాళీ స్థలాలలో మడులు కట్టి కాయగూరలు పండించడం ప్రారంభించారు. ఆవులను పెంచసాగారు. క్రమంగా ఒక గోశాల ఏర్పడింది. మాత ఈ పని

**వృద్ధాప్యంలో ఎలాగడపాలో, యవ్వనంలోనే నిర్ణయించుకోవాలి.**

1926లో ప్రారంభించారు. 12-13 సంవత్సరాలలో అది బాగా విస్తరించింది.

ఈ సమాచారం శ్రీరామ్‌కు ఆశ్రమాన్ని చేరకముందే తోడి యాత్రికులద్వారా అందింది. ఆశ్రమానికి తరచు వచ్చేవారు ఆ యాత్రికులలో ఉన్నారు. అవసరాన్ని బట్టి ఆశ్రమంలో యంత్రాలను ఉపయోగిస్తారని వారిద్వారా తెలిసింది. సాత్విక భోజనంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఆత్మిక ప్రగతిలో ఆహారానికి ప్రాముఖ్యం ఉన్నదని నమ్ముతారు. అందువల్ల ఆవుపాలకు ప్రాధాన్యం ఇస్తారు.

పాండిచెరీ పట్టణాన్ని 18వ శతాబ్దంలో ఫ్రెంచి నిపుణుడు మార్టిన్ నిర్మించాడు. ఆ తర్వాత 1940లో, అనంతర కాలంలో దాని విస్తరణ జరిగింది. అరవంలో 'పుదు' అంటే కొత్త. 'చెరీ' అంటే పట్టణం. పట్టణం పేరు పుదు చెరీ అయింది. వాడుకలో అది క్రమంగా పాండిచెరీ అయింది. అంతకు ముందు ఆ పట్టణం పేరు మేధాపురి, అంటే జ్ఞాన నగరం. అతి ప్రాచీన కాలంలో పాండిచెరీలో అగస్త్య మహర్షి తపస్సు చేశారని అక్కడికి వచ్చిన తర్వాత తెలిసింది. ఆయన ఇక్కడ ఆశ్రమాన్ని స్థాపించారు. ఒక ఉడతకు న్యాయాన్ని చేకూర్చడం కోసమై ఇక్కడే కూర్చుని సముద్రాన్ని ఆపోసన పట్టారు. ఈ సమాచారాన్ని సేకరించి, శ్రీరామ్ ఆశ్రమంలో ప్రవేశించారు. మధ్యాహ్నం 12 గంటలు- ఒంటి గంట అయి ఉండవచ్చు.

స్వాగత కార్యాలయంలో రజనీ భాయి అనే కార్యకర్త ఉన్నారు. ఆయన తల్లి దండ్రులు హరిద్వార్‌లో ఉన్నారు. 30-35 సంవత్సరాల పూర్వం ఆయన గంగ ఒడ్డుకు వెళ్లి నివసించారు. ఆయన వయస్సు 40 సంవత్సరాలకు మించి ఉండవచ్చు. ఆయన బాల్యంలో కొన్ని సంవత్సరాలు హరిద్వార్‌లో గడిపారు. మధుర- బృందావన్‌లకు కూడ వెళ్లి వచ్చారు. గత మూడు సంవత్సరాలుగా ఆయన అరవింద ఆశ్రమంలో ఉంటున్నారు. గంగ- యమున ప్రాంతంనుండి ఒక సాధకుడు ఆశ్రమానికి వచ్చారని తెలుసుకుని, ఆయన ఎంతో సంతోషించారు. శ్రీరామ్ సాధకుడనీ, అయితే శ్రీ అరవిందుల శిష్యుడు కారనీ, ఆయన నుండి ఆధ్యాత్మిక సహాయం పొందడానికి రాలేదనీ, కొన్ని విషయాలు నేర్చుకోవడానికి మాత్రమే వచ్చారనీ తెలుసుకుని ఆయన మరింతగా సంతోషించారు.

★★★

## పునాదిరాయి

*మహారాష్ట్రలో జన్మించిన శ్రీ బాలగంగాధరతిలక్ బి.ఎ., ఎల్.ఎల్.బి లో ఉత్తీర్ణులయ్యారు. ఆతని మిత్రులంతా తిలక్ గొప్పవకీలుగా ధనార్జన చేస్తారని భావించారు. కాని ఆయన ఆలోచనా మార్గం వేరొకదిశగా సాగింది. ఆయన "న్యూ ఇంగ్లీషు స్కూల్", "ఫర్గ్యుసన్" కాలేజీలను స్థాపించి దేదీప్యమానంగా నడిపారు. ఆ సంస్థలలో చదివిన విద్యార్థులు మహారాష్ట్ర ప్రజలలో జాగృతిని కలిగించే కార్యక్రమాలు చేపట్టారు. మెల్ల మెల్లగా తిలక్ రెండు జాతీయ ఉత్సవాలను నెలకొల్పారు. 1) గణపతి ఉత్సవాలు 2) శివాజీ జయంతి. బెంగాలులోని దుర్గానవరాత్రులవలె గణపతి నవరాత్రులను ఆవిష్కరించారు. ఈ నవరాత్రుల నాధారంగా చేసికొని రాష్ట్రీయ తత్వాన్ని ప్రచారం చేసే కార్యక్రమాలను రూపొందించారు. ఈ ప్రక్రియ ద్వార జనజాగృతి వికసించి రేకులు తొడిగింది.*

*"శివాజీ జయంతి" జాతీయతకు ప్రతీకగా జరుపబడింది. "కేసరి" అనే పత్రికలోని దేశభక్తిపూరితమైన సంపాదకీయాలను చదివి ప్రజలు స్వాతంత్ర్యపోరాటంలో నిమగ్నులయ్యారు. ఇదంతా గమనిస్తున్న ఆంగ్లప్రభుత్వం తిలక్ మీద రాజద్రోహ నేరాన్ని మోపింది. చివరకు 6 సంవత్సరాలు జైలుశిక్షను విధించింది. దేశ బహిష్కారాన్ని విధిస్తూ బర్మాలోని మాండలే జైలుకు పంపింది. ఆ శిక్షాకాలాన్ని కూడ వృధాచేయకుండా తిలక్ "గీతారహస్యం" అన్న పేరుతో భగవద్గీతకు భాష్యం వ్రాశారు. ఆ గ్రంథాన్ని చదివి లక్షలాది సత్యాగ్రహులు స్ఫూర్తిని పొందారు. "స్వరాజ్యం నా జన్మహక్కు-సాధించి తీరుతాను" అన్న నినాదాన్ని లేవనెత్తి ప్రజలలో చైతన్యాన్ని రేకెత్తించారు.*

*స్వరాజ్యం కోసం ఇంతగా శ్రమించి బాలగంగాధర తిలక్ స్వరాజ్య భవనానికి పునాదిరాయిగా మిగిలిపోయారు.*

**అపరిచితుల పట్ల దయతో, బాధ్యతతో వ్యవహరించినవాడే ప్రపంచపౌరుడు.**

మహిళాజాగరణ

# మాతాజీ అమృత లేఖిని

చేతనకు మరో రూపం మహిళ. తీవ్రాతి తీవ్రమైన పరివర్తన సైతం ఆమెకు సహజమే. అది ఆమెకు రోజువారీ కార్యక్రమం. యువతి నేడు తన ఇంటిని వదులుతుంది. రేపు కోడలుగా సరికొత్త వాతావరణంలో, గతంలో కన్న పూర్తిగా విభిన్నమైన జీవన సరళిని అలవరచుకుంటుంది. కొత్త బాధ్యతలను సహజంగా నిర్వహిస్తుంది. కర్తవ్యపు అవసరాన్నిబట్టి తనను తాను మలచుకునే అద్భుత సామర్థ్యం మహిళకు పుట్టుకతోనే అబ్బుతుంది. మహిళా జాగరణకు సంబంధించిన ఎలాంటి పరివర్తన అయినా ఆమెకు కష్టదాయకం కాదు, అసహజం కాదు.

అలాగే, సమాజంలో మహిళపట్ల ఉన్న దృక్పథాన్నీ వ్యవహారము చూచి మనం ఆందోళన చెందవలసిన అవసరం లేదు. ఇది యుగ పరివర్తన సమయం. నవయుగపు లక్షణాలు ఇప్పుడు స్పష్టంగా కానవస్తున్నాయి. పాతకాలపు ఆచారాలూ, అనైతిక సంప్రదాయాలూ ఇక నిలువలేవు. ఇందుకు ప్రమాణాలు అన్నివైపులనుండి అందుతున్నాయి. రాజకీయ రంగంలో, సామాజిక రంగంలో, ధార్మిక రంగంలో- అన్నింటిలో ఇటీవలి రోజులలో అసాధారణమైన పరివర్తన జరిగింది.

## మహిళ, ఆరోగ్యం

నవయుగానికి అనుగుణంగా మహిళ తన నమ్మకాలను మార్చుకోవాలి. ముందు ముందు తన బుజాలపై పడనున్న మహత్తర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికై మహిళ తన శారీరిక, మానసిక సామర్థ్యాలను పెంచుకోవాలి. ఆహార విహారాలలో నియమ పాలనపట్ల మరింతగా మెలకువ వహించాలి. శ్రమ-విశ్రాంతి, భోజనం-నిద్ర వంటి విషయాలలో జాగరూకతనూ, క్రమబద్ధతనూ పాటిస్తే- దారిద్ర్యంలో సైతం ఆరోగ్యం చెక్కు చెదరకుండా ఉంటుంది. సాధారణంగా- పురుషులు భోజనంలో, నిద్రలో నియమాలను పాటించకపోవడంవల్ల మహిళల సమయం వృథా అయిపోతూ ఉంటుంది. మహిళలకు తగు విశ్రాంతి దొరకదు. విద్య కోసం, వినోదం కోసం వారికి తీరిక చిక్కదు. కనుక- కుటుంబంలోని ప్రతి సభ్యుని దినచర్యా క్రమబద్ధంగా ఉండేటట్లు వారు చూడవలసి ఉంటుంది. అప్పుడు మానసిక వికాసానికి కృషిచేసేందుకు మహిళలకు అవకాశం ఏర్పడుతుంది.

## మానసిక వికాసానికై విద్య

మహిళలూ, వారి శ్రేయోభిలాషులూ వస్త్రాలకన్న అలంకరణ కన్న, వినోదంకన్న విద్యకు హెచ్చు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యను మించిన సంపద లేదు. చదువురానివారిని పశువులుగా, గ్రుడ్డివాళ్లుగా పరిగణిస్తారు. ప్రపంచంలోని విద్వాంసులు ఇచ్చిన జ్ఞానం విద్యావంతులకూ సాహిత్యం ద్వారా అందుతుంది. ఆ జ్ఞానం ఆధారంగా మనిషి ఎంతో ఎత్తుకు ఎదగగలుగుతాడు.

కనుక చదువురాని మహిళలు చదువుకోవడానికి ప్రయత్నించాలి. సత్ సాహిత్యాన్ని నియమబద్ధంగా అధ్యయనం చేయాలి. యుగ ద్రష్టల భావాలను గ్రహించాలి. చౌకబారు నవలలు చదివి ప్రయోజనం లేదు. మహిళా సమస్యలకు పరిష్కారాలను చూపే సాహిత్యం ఉన్న గ్రంథాలయాలు ప్రతి చోటా స్థాపించబడాలి.

## ఆర్థిక రంగం, మహిళ

మేలుకొన్న మహిళ రానున్న రోజులలో వివిధ రంగాలలో విశిష్టపాత్రను నిర్వహించవలసి ఉంది. ఆర్థిక ప్రగతిలో ఆమె విశేషమైన సహకారాన్ని అందిస్తుంది. కుటీర పరిశ్రమల నిర్వహణ మహిళ చేతుల్లో ఉంటుంది. పురుషుడు బయటి పని చూచుకుంటాడు. మహిళ పరిశ్రమలను నిర్వహిస్తుంది. ఆమెకు ముడి సరుకు ఇచ్చే బాధ్యతనూ, తయారైన వస్తువుల అమ్మకం బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. అపుడు చిన్న చిన్న గృహ పరిశ్రమలు అభివృద్ధి పొందుతాయి. ఈ పరిశ్రమలవల్ల మహిళలలోని నిరుద్యోగం, నిస్సహాయత, దారిద్ర్యం తొలగిపోతాయి. ప్రతి కుటుంబానికీ అదనపు ఆదాయం అందుతుంది.

## రాజకీయ రంగం, మహిళలు

రాజకీయ రంగంలోకి కీచులాటలకు పరిష్కారం ప్రతినిధి సభలకు మహిళలను హెచ్చు సంఖ్యలో ఎన్నుకోవడం, మహిళలలో సహజంగా ఉండే సహృదయత, ఉదారత రాజకీయ రంగాన్ని

**చేసిన పాపాలకే కాదు, మనసులోని భావాలకూ శిక్షను అనుభవించాలి.**

క్షాళన చేయగలుగుతాయి. అధికారం ఒక ప్రత్యేక వర్గానికే పరిమితం కాకూడదు.

వాస్తవానికి ఓటర్లలో సగం మంది మహిళలే. మహిళలు ప్రయత్నిస్తే కొన్ని ఇతర ఓట్లనుకూడ సంపాదించగలుగుతారు. ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారం ప్రభుత్వాలను తమ చేతుల్లోకి తెచ్చుకోగలుగుతారు. ఆ పరిస్థితి ఏర్పడకముందే, పరిపాలనలో మహిళలకు తగు స్థానాన్ని కల్పించడం అవసరం.

## సాహిత్యరంగం, మహిళ

సాహిత్య, కళారంగాలలో మహిళలు ప్రవేశిస్తే, ఆ రంగాలలో సభ్యత నిలచి ఉంటుంది. మహిళల కలాల నుండి అశ్లీలతనూ, కాముకతనూ, నేరప్రవృత్తినీ పెంచే క్షుద్ర సాహిత్యం వెలువడదు. మాతృశక్తిని దిగజార్చడం, ద్రౌపదిని వస్త్రాపహరణం చేయడం, సరస్వతిని వేశ్య స్థాయికి దిగజార్చే విశృంఖలత్వాన్ని పురుషుడే ప్రదర్శిస్తూ వచ్చాడు. మహిళ ఆ స్థాయికి దిగజారజాలదు. పత్రికా రంగం, ప్రచురణ రంగం, సాహిత్య విక్రయ రంగం మున్నగు రంగాలలో మహిళల పాత్ర విస్తరించాలి, అప్పుడే ఆయా రంగాలలోని వికృతులు తొలగిపోయే అవకాశం ఏర్పడుతుంది.

## సేవా రంగం, మహిళ

ప్రభుత్వ శాఖలలో విద్య, వైద్యం, సమాజ కళ్యాణ శాఖలను మహిళలకు రిజర్వు చేయాలి. ఎందుకంటే- ఈ శాఖలలో సహృదయత, స్నేహశీలత, సృజనాత్మకత మరింతగా అవసరం అవుతాయి. మహిళ తన సహజ స్నేహ భావనద్వారా పిల్లల ఆత్మలలో సద్భావనలనూ, సత్ ప్రవృత్తులనూ నాటగలుగుతుంది. రోగి తన వైద్యుని నుండి ఔషధాలనేకాక సానుభూతిని కూడ ఆశిస్తాడు. ఈ సానుభూతిని దేవుడు మహిళకు మరింత హెచ్చుగా ఇచ్చాడు. మహిళ సమాజంలో సృజనాత్మక సంప్రదాయాలను నిర్మాణం చేయగలుగుతుంది. సమాజ కళ్యాణ కార్యక్రమాలు ప్రజలలో నిరాశను తొలగించి వారిలో ఆశా విశ్వాసాలను కలిగించడానికి ఉద్దేశించినవి. ఈ కార్యక్రమాలను మహిళ మరింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతుందన్నది నిర్వివాదాంశం.

## అవసరమైన సేవ

ఒక వ్యక్తి తనతో కిరీటాన్ని, ఖడ్గాన్ని భగవంతుని కొరకు తీసుకొస్తాడు. పైగా వాటిని దైవానికి ఏకాంతంలో సమర్పించాలను కొంటాడు. కానీ దైవం దర్బారు ముందు నిలబడిన ద్వార పాలకులు అతన్ని వారిస్తూ, "ఓ సోదరుడా ! దైవానికి నీ కానుకలు ఎందుకయ్యా? ఆయనే స్వయంగా జ్ఞాన స్వరూపుడు. జ్ఞానంతోటే బంధనాలైన శత్రువుల్ని సంహరించి వేస్తాడు అంటూ ఉండగానే అటువైపుగా ఒక వృద్ధుడు వస్తూ పడిపోవడం ఈ వ్యక్తి చూస్తాడు. వడివడిగా వెళ్లి, ఆ వృద్ధునికి సునాయాసంగా ప్రభుమందిరంలో ప్రవేశాన్ని కలిగించాడు. సర్వం ఈయగల దైవానికి ఏవో కానుకలు ఇవ్వటం కాక ఆయన సృష్టించిన అన్ని జీవులలోను ఆయన్ని దర్శించాలి. అవసరమైన సేవ అందించాలి.

## ఆధ్యాత్మిక రంగం, మహిళ

మత, ఆధ్యాత్మిక రంగాలలో పురుషుని అధికారం చాలా కాలంగా సాగుతూ వచ్చింది. ఫలితంగా- ఆ రంగాలలో ఆడంబరాలూ, భ్రమలూ చోటు చేసుకున్నాయి. మురికిని శుభ్రపరచే సబ్బుకే మురికి పట్టితే- ఇక పరిశుభ్రత ఎలా మిగులుతుంది? కనుక, ఈ రంగంలో మహిళ నాయకత్వం వహించాలి. పరమేశ్వరుడు మహిళకు దివ్య గుణాలను ప్రసాదించాడు. కనుక, మహిళ ఈ రంగాలలో ఆదర్శవాదాన్నీ, ఉత్కృష్టతనూ నింపగలుగుతుంది. మహిళ అంతఃకరణలో ప్రేమ, భక్తి అనుక్షణం పెల్లుబుకుతూ ఉంటాయి. ఆస్తికత, ఆధ్యాత్మికత, ధార్మికత మహిళలో స్వభావ సిద్ధంగా ఏర్పడిన గుణాలు.

రానున్న రోజులలో మహిళ భావనా రంగానికి నాయకత్వం వహిస్తుంది; భౌతిక రంగ సువ్యవస్థకు గట్టి పునాదిని నిర్మాణం చేస్తుంది, మనం కలలు కనే ఉజ్వల భవిష్యత్తు యొక్క చిత్రం ఇది. ఈ కలను నిజం చేయడానికై మనమంతా ప్రాణాలను ఒడ్డి కృషి చేయాలి. నేడు మహిళా వర్గం దృఢ సంకల్పంతో ఆ దిశలో ముందడుగు వేస్తోంది.

★★★

ఇతరులను సంస్కరించాలంటే నేర్పు, ఓర్పులతోపాటు ధైర్యం కూడ అవసరం.

# అమూల్యమైన సమయం వర్తమానమే

చాలామంది "కాలం కలసిరావడంలేదు. మేము ఏం చేయగలం, ఏ శుభకార్యాన్ని ప్రారంభించలేకుండా ఉన్నాం" అని అంటూ ఉంటారు. ఉపయుక్తమైన సమయం వచ్చినప్పుడు ఆధ్యాత్మిక ఉన్నతికి సంబంధించిన పనులు చేస్తాం అంటారు. ఇటువంటి వారు మొత్తం జీవితకాలం గడిచినా ఏమి చేయలేరు. బలమైన కోరిక లేకపోవడం వల్ల వారి శక్తుల్ని ఉత్కృష్టమైన మార్గం వైపు మళ్లించలేరు.

నీవు నిజంగా ఏదైనా ఉత్తమమైన పని చేయదల్చుకొంటే కాలం గురించి ఏడుస్తూ కూర్చోకు. ఏ సమయంలోనైనా లోకంలో ఉండే బాధలు, చిక్కులు, ఇలాగే నడుస్తూ ఉంటాయి, ఇక నువ్వు ఈ మత్తులోనే పూర్తి జీవితం గడిపేస్తావు. నువ్వు చేయాల్సిన పని చాలా ఎక్కువగా ఉంది, కాలం చాలా తక్కువగా ఉంది. వాయువేగంతో నీ అమూల్యమైన జీవితం తరిగి పోతోంది. కాలంవ్యర్థంగా గడిచిపోతోంది. అలా జరగడానికి వీల్లేదు.

ముక్తిని మించి ఈ ప్రపంచంలో కోరుకోవాల్సింది ఏమిలేదు. దానిని దక్కించుకోవటానికి వర్తమానాన్ని మించిన తరుణం మరొక్కటి లేదు. గడిచిపోయిన కాలం ఎప్పటికీ నీ చేతికి తిరిగిరాదు, భవిష్యత్తు గురించి ఎవరికి తెలుసు? కాబట్టి ఏది చేసినా ఈ రోజే చేయాలి. ముందు ముందుండే పరిస్థితులు ఎవరికి తెలుసు? నేడు మనకున్న సౌకర్యాలు రేపు ఉండవచ్చును. ఉండక పోవచ్చును. అది ఎవరూ చెప్పలేరు.

ఉత్తమమైన పని చేయటానికి ప్రతి అవకాశం సువర్ణావకాశమే! చేసే పని యొక్క ఉత్కృష్టత ప్రతి అవకాశాన్ని సువర్ణావకాశంగా మార్చివేసే దక్షత కలిగి ఉంటుంది. కాబట్టి మనం ఉత్తమమైన అవకాశాల కొరకు ప్రతీక్షిస్తూ కూర్చుని వ్యర్థంగా సమయాన్ని నష్టపర్చకుండా, సాధారణ సమయాన్నే ఉత్తమమైన అవకాశంగా మార్చుకోవాలి. కాలం చేజారిన తరువాత బ్రతికినన్నాళ్లు పశ్చాత్తాప పడాల్సి ఉంటుంది.

ప్రియ మిత్రులారా! లేవండి! మీరు మీ సమయాన్ని చాలా నష్టపర్చుకొన్నారు. మిగిలిన ఈ స్వల్ప కాలాన్నైనా సాధనలో సద్వినియోగం చేయండి. జీవితం అనిత్యం, క్షణ భంగురం, ఏ సమయం ఎటు ముంచుకొస్తుందో ఎవరూ చెప్పలేరు. నిర్లక్ష్యంగా కూర్చుని ఉండడం వల్ల సమయమనే ధనం చేజారిపోతుంది. ఒక్కొక్క క్షణం బహు మూల్యమైంది. ఈ అమూల్యమైన రోజులు ఎంత వాయు వేగంతో ఎగిరిపోతున్నాయో! చూస్తూ- చూస్తూ నిమిషాలు, గంటలు, రోజులు, సంవత్సరాలు ఎగిరిపోతున్నాయి.

తెల్లవారుతుంది, సాయంకాలం అవుతుంది, ఇదే విధంగా వయస్సు ఉడిగిపోతుంది. వినండి. కబీరు దాసుగారు పిలిచి- పిలిచి హెచ్చరిస్తున్నారు. సరిఅయిన సమయం వచ్చింది. చూడండి! దీనిని వ్యర్థ పర్చకండి-

కహతా హు, కహ్ జాత్ హు, కహా బజావు ఢోల్ ।
స్వాసా ఖాలి జాత్ హై, తీన్ లోక్ కా మోల్ ॥

– కబీరు

ఆలోచించి చూడండి వ్యర్థంగా గప్పాలు కొట్టుకుంటూ నష్టపర్చుకోవడానికి మీ దగ్గిర సమయము లేదు. రాత్రి పగలు సోమరితనంతో, మోహంతో పేకాట లాడుతు సమయాన్ని పాడు చేయకూడదు. ఏదో ఉబుసుపోని కబుర్లు చెప్పుకోవడానికి, ఇతరులలోని దోషాలను గుర్తించడానికి, దాని గురించి చర్చించడానికి మీ సమయాన్ని ఖర్చుపెట్టకండి.

"నేడు చేయలేక పోయాం రేపటినుంచి ఫలానా పని ప్రారంభిస్తాం". అంటు అన్నింటిని రేపు అని దాటివేయడం వల్ల మనిషి చనిపోయేటప్పుడు అధికంగా పశ్చాత్తాప పడవలసివస్తుంది. వ్యర్థంగా పోగొట్టుకొన్న సమయాన్ని గురించి పశ్చాత్తాప పడుతుండగానే అంత్యకాలం సమీపిస్తుంది, చివరికి మృతి చెందుతారు.

మీకు రోజులో 8 గంటలు నిద్రలో గడిచిపోతాయి. తరువాత రెండు, మూడు గంటలు స్నానం, శౌచం మొదలైన వాటికి వెచ్చించాలి. కొంత సమయం మిత్రులతో కబుర్లు చెప్పుకోవడంలో గడిచి పోతుంది. అతి కష్టం మీద మీరు మీ ఆఫీసు పని పూర్తి చేసుకోగలుగుతారు. అక్కడి నుండి హడావిడిగా మీ ఇంటికి తిరిగి వస్తారు. ఇక టీ తాగడం రెస్టు తీసుకోవడంలో కొంత సమయం గడిచి పోతుంది. మీరు ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రయత్నించే అవకాశమే లేకపోతుంది, తరువాత చూసుకుందాం లెండి- అని మీరంటారు.

ప్రియమిత్రులారా వ్యర్థమైన తర్కాలతో వాస్తవిక సత్యాలను కప్పిపుచ్చుదామని ప్రయత్నించకండి. మీకు మీరే మిత్రులు,

**కలిగినదానిలో కొంతైనా పెట్టగలవాడే కలిగినవాడు.**

మీరే శత్రువులు. వివేకవంతమైన దృష్టికోణం ఏర్పర్చుకొని ముందుకి సాగితే కావలసినంత సమయాన్ని ఏర్పర్చుకోగలరు. సూర్యోదయానికి ముందే లేవాలి. లేచినప్పటి నుండి ఎక్కువ సేపు వాదనలు, సరదాగా గడిపి వేయడం, ఇతరుల తప్పులను వెదకడం, సోమరితనం మొదలైనవి మానేస్తే సమయం బాగా దొరుకుతుంది. సమయాన్ని నియంత్రణలో ఉంచుకోవడమే సౌశీల్యతకి చిహ్నం.

నువ్వు నీ రోజంతా చేసే కార్యక్రమం గురించి ఆలోచించు. తినే విధానం, వస్త్రా భూషణాలు, పదార్థాలను కూడగట్టుకోవడము, సింగారం మొదలైన శరీరానికి సంబంధించిన క్షుద్ర విషయాలతో నీ అమూల్యమైన సమయాన్ని ఎందుకు పాడు చేసుకొంటావు? నీ అంతఃకరణం యొక్క అంతర్దర్శనం చేసుకో! ఈ క్షుద్రత్వం నుంచి వైరాగ్యాన్ని తెచ్చుకొని, ఉత్కృష్ట భావనలు నీ మనో మందిరములో ప్రవేశింప చేసుకో! నీ మిత్రులు చాలా వేగంగా ఉన్నతి పథంలో అగ్రేసరులై ముందుకి వెళ్లిపోతూ ఉంటే నీవు నడువలేని అశ్వం వలె ఎక్కడికక్కడే నిష్క్రియంగా పడి ఉంటావా? ఏకాంతంగా కూర్చుని నీ ఆత్మవిమర్శ చేసుకో, అక్కడి నుంచే నీకు చక్కని ప్రేరణ లభిస్తుంది.

ఓ వ్యథిత ఆత్మా! ఇంత సమయం వ్యర్థంగా గడిపివేశావు. మిగిలి ఉన్న ఈ సమయాన్ని పిసినారి వలె సత్కార్యాలలో జాగ్రత్తగా వెచ్చించు. ప్రాతఃకాలం సూర్యోదయానికి పూర్వమే లేచి నీ హృదయంలోని ఆత్మ ద్వారా నిర్దేశితమైన మార్గాన నియమిత పద్ధతిలో పయనించు. నీ అణువణువులో పవిత్రతను నింపుకో! నీ రోమ- రోమములో శాంతిని నెలకొల్పుకో. నీ హృదయంలోని పరమ పితని సాక్షాత్కరింప చేసుకో! ఆంతరికంగా దృఢ సంకల్పాన్ని తీసుకొని నువ్వు ప్రతిక్షణం అఖండమైన ఆనందాన్ని అనుభవించు. అగ్రేసరుడివి అయితే వాస్తవిక జీవిత రసాస్వాదన చేయగలవు.

ఒకొక్క పైసను కూడగట్టుకొంటు నిర్ధనుడు ధనవంతుడు కాగలడు. ఒక్కొక్క క్షణము ఆలోచించే వాడు సిద్ధిని పొందుతాడు. సమయాన్ని గురించి సరిఅయిన అవగాహన కలవాడే ఆత్మసాక్షాత్కారమనే అనుభవాన్ని పొందగలడు. వ్యర్థంగా నష్టపరుస్తున్న క్షణాలను ఒక కార్యం పట్ల వెచ్చించే సాధకుడు ప్రతిభను సంపాదిస్తాడు. మనం అవకాశం కోసం కాచుకొని కూర్చోకూడదు. శుభకార్యానికి ప్రతి అవకాశం సువర్ణావకాశమే ! శుభకరమైన భావన సాధారణ సమయాన్ని ఉత్తమమైన అవకాశంగా పరిణమింప చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. నువ్వు మోహనిద్ర నుండి లేచిరా! కార్యంలో నిమగ్నుడివికా !

జేపియర్ పేంటు మార్గన్ ఎమన్నాడంటే- "నాకు ప్రతిగంట ఒక వేయి రూపాయల లాగ అనిపిస్తోంది." ఈ రకంగా చూసుకొంటే మనం ఎంత ధనవంతులం ! కాలమనే ఎంత సంపత్తి మనవద్ద పడి ఉంది ! భగవంతుడా ! మనం దాని సదుపయోగం గురించి తెలుసుకోగలిగితే పైన పేర్కొన్న మహాపురుషుడి అభిప్రాయం ప్రకారం చాలా అల్పసంఖ్యలో నిర్ధనులుగా మిగిలిపోతారు. కాలాన్ని సదుపయోగం చేసుకొనే వ్యక్తి సుఖంగా ఉంటాడు. కాలాన్ని వ్యర్థపరచుకునే వ్యక్తి కష్టాలపాలవుతాడు.

నీవు ఏ శ్రేణికి చెందిన వాడవు? ఆలోచించి సమాధానం చెప్పు. నువ్వు సమయాన్ని వ్యర్థపరుస్తూ దాన్ని గురించి వ్యర్థమైన వాదనలు చేస్తూ ఉండే వాడివైతే ఈ ప్రపంచంలో ఎవరూ నీకు సన్మార్గాన్ని చూపించలేరు. నీ మనసు ఇటు-అటు భ్రమించే అలవాటు పడి ఏకాగ్రతని సాధించ లేకుండా ఉంది. నీ విఫలతకి మూలకారణం ఒకదానిని మించిన అనేక పనులలో జొరబడి వ్యర్థంగా సమయాన్ని గడపటమే. కాని ఈ విషయంలో నీ మనో నిగ్రహాన్ని నీవే సాధించాలి. నీవే భ్రమించిన మనసుని మధ్య బిందువులో సంలంగ్నం చేయగలవు. ఒక పని చేసేటపుడు అనేకరకాలైన అలోచనలు నిన్ను కలవరపరిస్తే, దీని మూలం నువ్వే గుర్తుంచుకో- ఎక్కువ మంది వ్యక్తులు ఏకాగ్రత లేకపోవడం వల్ల, మానసిక శక్తులు ఇటు-అటు వెదజల్లి చాలా సమయాన్ని వ్యర్థంగా గడిపివేస్తారు. ఏకాగ్రతలో మహత్తరమైన శక్తి దాగి ఉంది. దాని ద్వారానే నువ్వు సమయాన్ని మిగుల్చుకోగలవు.

నువ్వు ఏ వస్తువుని కాంక్షిస్తావో, దానినే గురిచూసుకొని ఆత్మలో ప్రవేశించు. దానిమీదే చిత్తాన్ని కేంద్రీకరించు. దాని ప్రకారమే ఆలోచించు, దాన్ని గురించే ధ్యానించు. కల్పసృష్టి చేసి, ఏ విధంగా సమగ్రశక్తుల సంతులనతో కూడిన వెలుగును నీ ఉద్దేశ్యానికి అందజేస్తూ ఉండు. కాలం మిగలడమే కాదు, నువ్వు కోరుకొన్న పదార్థం అదే ఆకర్షింపబడి నీ సమీపానికి తరలివస్తుంది. బలవంతుడైన మనిషి ఇచ్ఛాశక్తి ప్రకృతివలె అస్తిత్వములో సజీవమైన తత్త్వం. మనిషి ఇచ్ఛ (will) వల్ల తయారుకాబడిన వాడు. ఇచ్ఛకి అనుగుణంగా రుచి, రుచికి అనుగుణంగా కార్యం, కార్యానికి అనుగుణంగా ఫలితం లభిస్తుంది.

★★★

**ఉన్నంతలో కొంతైనా ఇయ్యలేనివాడు లేనివాడే.**

బోధకథ

# మానవతావాది-అబ్బేపియర్

గడచిన పదిసంవత్సరాలలో ఇంత భయంకరమైన చలి ఎప్పుడూ వెయ్యలేదు. సౌందర్యానికి మారుపేరయిన పారిస్ నగరానికి చెందిన పౌరులు వారి వారి ఇళ్లల్లో కమ్మటి నిద్రపోతున్నారు. విశ్వవిఖ్యాతి గాంచిన ఈ పారిస్ నగరంలో రెండువేలకు పైగా అభాగ్యులకు తలదాచుకోవటానికి సీన్‌నది యొక్క వంతెన, ఎవరిఇంట్లో అయినాఉంటే ఖాళీ వరండా తప్ప ఇంకో మార్గంలేదు. ఎంతోమంది ఈ భయంకరమైన చలిబారినపడి గజగజ వణికి ప్రాణాలు కూడా కోల్పోయారు. వీళ్లల్లో ఒకరిద్దరు మాత్రమే నేరాలు చేసి పోలీసులకు దొరకకుండా తప్పించుకొని తిరుగుతున్నదొంగలు. మిగతావాళ్లందరూ కష్టపడి పనిచేసి పొట్టపోసుకునేవాళ్ళే.

ఒక మరుగుజ్జువాడే వీళ్ల దుఃఖాలను పంచుకునే ఏకైక వ్యక్తి. వారికి కూర, రొట్టెలు పంచుతూ రాత్రంతా అతను తిరుగుతూ ఉండేవాడు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్న ఆ చలిలో, వంటిమీద కోటు అయినా లేకుండా, మంచుతో తడిచి ముద్దయిన ఆ నేలమీద పడుకున్న అసహాయులను వంటరిగా వదిలి వెళ్లటానికి అతని అంతరాత్మ ఒప్పుకోవడం లేదు.

ఇంతటి సహృదయత కలిగిన ఆ వ్యక్తే అబ్బేపియర్. కష్టాల్లో ఉన్నవారి బాధలను తనవిగా భావంచేవాడు. కరుణార్ధ్ర హృదయుడైన ఆ వ్యక్తి వద్ద సేవచేసే సామర్థ్యం మాత్రమే ఉంది. దాన్నే అతను రెండు చేతులతో అందిస్తూ ఉండేవాడు.

తనకున్న అతి తక్కువ వనరులతో ఆ నిరాశ్రయులకు చేతనైనంత సహాయం చెయ్యటానికి అతను దృఢ సంకల్పం తీసుకొన్నాడు. వాళ్లకి తలదాచుకోవటానికి నీడ ఇవ్వటానికి అతని దగ్గర ఖాళీ స్థలం కాని సరిపడా డబ్బులు కాని లేవు.

పాతసామాన్లు అమ్మే దుకాణంలో ఒకసారి అతనికి తక్కువ ధరకి మిలటరీ వాళ్ల షామియానా దొరికింది. దాన్ని అతను కొని, ఒక ఖాళీ స్థలంలో పరిచాడు. ఆ పేదవాళ్ళకి తలదాచుకోవటానికి పైన షామియానా, ప్రక్క దుప్పటి స్థానంలో గాజు సామాన్లు అమ్మే వ్యక్తినుండి కొన్న ఎండుగడ్డి పరిచి, తనకు చేతనైనంతలో వాళ్లకి ఆశ్రయం ఇవ్వటానికి ఏర్పాటు చేశాడు. లారీని అద్దెకు తీసుకొని తనకు కనిపించిన ఆ అసహాయులను ఎక్కించుకొని, రాత్రంతా అక్కడకు చేరుస్తూ ఉండేవాడు.

ఆకాశాన్నే పైకప్పుగా చేసుకొని పడుకొనే వాళ్లసంఖ్య కొన్ని వేలల్లో ఉంది. కానీ వాళ్లను కాపాడటానికి అతనికి ఎటువంటి మార్గం కానరావట్లేదు. వాళ్లకి సహాయం చేయడానికి భిక్షమెత్తడానికయినా సరే అతను వెనకాడదలచుకోలేదు.

అతని మదిలో ఒక మంచి ఆలోచన తట్టింది. రేడియో ద్వారా తను ఈ సందేశాన్ని ప్రజలకు అందిస్తే ఈ సమస్యకు సమాధానం లభిస్తుందేమో. మనిషిలోని మానవత్వం ఇంకా మరుగున పడలేదు. దానిని మేల్కొపడమే నా ముందున్న తక్షణ కర్తవ్యం అని తలచాడు. ఆకాశవాణికి చెందిన అధికారులతో అబ్బేపియర్ మాట్లాడాడు. ఎంతో వినయంగా ప్రార్థించిన తరువాత ఏడునిముషాలు సమయం ఇవ్వటానికి అధికారులు అంగీకరించారు.

రేడియోలో మాట్లాడటానికి అబ్బేపియర్ ఎటువంటి ప్రసంగం తయారుచేసుకోలేదు. అతను మాట్లాడిన మాటలు అతని హృదయలోతుల్లోంచి పెల్లుబికిన కారుణ్యపు వెల్లువ– "గజగజ వణికే చలిలో, ఆ అసహాయులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎంతోమంది ఆ చలిలో బిగుసుకుపోతున్నారు. కొంతమంది దాని ధాటికి తట్టుకోలేక ప్రాణాలు వదిలేస్తున్నారు. ఆకలితో అల్లాడుతున్న వారు కొంతమంది, వంటి మీద బట్టలు కూడా లేకుండా ఉన్నవాళ్లు మరికొందరు, ఎటువంటి ఆశ్రయం లేని వాళ్లు ఇంకొంతమంది. వీరందరూ మనుష్యులే. ప్రపంచ ప్రజలారా ! మానవతా దృష్టితో సాటి మనుష్యులకు మీవంతు సహాయం అందించండి" అని తన ప్రార్థన వినిపించాడు.

నిష్కంళక హృదయంతో చేసిన ప్రార్థన భగవంతుణ్ణి కూడా ద్రవింపజేస్తుంది. ప్రతిమనిషిలో భగవంతుడు కొలువుంటాడు. ఆ భగవంతుని పట్ల అబ్బేపియర్‌కు అంతులేని విశ్వాసం. మనిషి హృదయంలో కొలువుదీరిన భగవంతుడు అతని దీనమైన పిలుపుని విన్నాడు. ఏడు నిమిషాల ప్రసంగం, ఒక సాధారణ ధర్మప్రచారకుడైన అబ్బేపియర్‌ను ఒక మహాత్ముణ్ణి చేసింది.

ఈ ప్రసంగం అయిన తరువాత, అబ్బేపియర్ పారిస్‌లో పేరుగాంచిన ఒక హోటల్ యజమానిని కలవడానికి వెళ్లాల్సిఉంది. ఆ అసహాయులకు సహాయం చెయ్యడానికి ఇంతకు ముందే ఆ హోటల్ యజమానిని అర్థించి ఉన్నాడు. సహాయం చెయ్యదల్చుకున్న వాళ్లు సంప్రదించటానికి అబ్బేపియర్ తన ప్రసంగంలో ఆ హోటల్ చిరునామానే సూచించాడు.

అతని ప్రసంగం రేడియోలో ప్రసారమవ్వటం ఆలస్యం, తండోపతండాలుగా ప్రజలు హోటల్‌కు రావటం మొదలుపెట్టారు.

**పరాధీనత పెరిగినకొద్దీ భయం పరిధి పెరిగిపోతుంది.**

ఆ ప్రసంగం అయిన పదినిమిషాలకే సహాయం చెయ్యడానికి ఆ హోటల్ ముందు పెద్దగుంపు ప్రోగయ్యింది. ఇలా వచ్చేవారి సంఖ్య క్రమక్రమంగా పెరగటం మొదలుపెట్టింది. ఆ దారి కార్లతో నిండిపోయి, కాలు కదపటానికి వీలులేని పరిస్థితి ఎదురయ్యింది. కొంతమంది డబ్బులు ఇస్తే, కొంతమంది కప్పుకోవడానికి రగ్గులు, కొంతమంది తినటానికి ఆహారపదార్థాలు తీసుకొని వచ్చారు. ఒకవ్యక్తి తన జేబులో ఉన్న మొత్తం నూటపద్దెనిమిది ఫ్రాంకులు తీసి ఇచ్చాడు. తన సంవత్సర లాభంలో ఐదు శాతం ఈ అసహాయులకు సహాయంగా ఇస్తానని ఒక వ్యాపారి మాట ఇచ్చాడు. విసెంట్ ఆరియల్ రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఏభై వేలఫ్రాంకులు విరాళం ఇచ్చాడు.

మొదటిరోజు హోటల్ దగ్గరకు సహాయం చెయ్యటానికి వచ్చేదాతలను క్యూలో నుంచోబెట్టి వారిని నియంత్రించడానికి ఇరవైఐదు మంది పోలీసులను నియమించాల్సి వచ్చింది. ఆ లైను అరమైలు పొడవు ఉంది. హోటల్‌లోని హాలంతా దాతలనుండి విరాళంగా వచ్చిన సామానుతో నిండిపోయింది. బయటనుండి వచ్చే సహాయాన్ని స్వీకరించడానికి ప్రత్యేకంగా ఒక రోడ్డును రైల్వేస్టేషను వరకు నిర్మించారు.

పారిస్ ఇతిహాసంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించి ప్రజల హృదయాల్లో కరుణరసధారలను ప్రవహింపజేసిన 'అబ్బేపియర్' అనోస్ నగరంలో, ఒక ధనవంతుడైన టెక్స్‌టైల్ మిల్ యజమాని ఇంట్లో జన్మించాడు. అతని జీవితనావ అంతరాత్మ ప్రబోధంతో, సన్మార్గం వైపు పయనించింది. అతనికి జీవితంలో ఎన్నో పరీక్షలు ఎదురయ్యాయి. లోభ, మోహాలనే అశాశ్వతమైన మార్గాన్ని వదిలివేసి త్యాగం, సేవ అనే శాశ్వతమార్గాన్ని ఆయన ఎంచుకొన్నాడు. అతని అంతరంగంనుండి ఒక దివ్యప్రేరణ స్ఫురించేది. అతని సంపూర్ణ అస్తిత్వాన్ని ఏకత్రితం చేసి ఒక గొప్ప ప్రయోజనం కోసం దానిని వినియోగించుమని అతని ఆత్మ ప్రబోధిస్తూ ఉండేది. ఆ పిలుపుని ఒక సామాన్యవ్యక్తి వినిపించుకోడు, తరువాత చేద్దాంలే అంటూ వాయిదా వేస్తూ ఉంటాడు, కాని అబ్బేపియర్ ఆ కోవకి చెందిన వ్యక్తి కాదు. ప్రేమ, సద్భావనలనే దైవీగుణాలు ప్రతిమనిషిలో ఉంటాయి. అవి అతన్ని దేవతగా మారుమని అనుక్షణం ప్రేరేపిస్తూ ఉంటాయని, మహాత్ముడుగా అవ్వాలని వెన్నుతట్టుతూ ఉంటాయని అబ్బేపియర్ ఎప్పుడూ చెపుతూ ఉండేవాడు.

ఈ దివ్యప్రేరణలే హెసరీ ఏంటసీ గ్రాండ్సని (అబ్బేపియర్ అసలు పేరు) అబ్బేపియర్ అనే విశ్వవిఖ్యాతి గాంచిన మహాత్ముడిగా మార్చివేసాయి. నలభైరెండు సంవత్సరాల వయస్సులో, పారిస్‌లో ఆయన ఈ అద్భుతాన్ని చేసి చూపించాడు. తను యువకుడిగా ఉన్నప్పుడు ఇటలీలోని సెంట్ ఫ్రాన్సిస్ గారి ఇంటిని దర్శించాడు. ఆ రాత్రి అతనికి నిద్ర రాలేదు. లోపల ఒక అంతర్మథనం చెలరేగింది. నేను కూడా ఆయన మార్గాన్నే అనుసరిస్తాను అని దృఢనిశ్చయం తీసుకొన్నతరువాత, అది పరిసమాప్తమయ్యింది.

పందొమ్మిది సంవత్సరాల చిరుప్రాయంలోనే సాధువుగా మారుదామని దృఢంగా నిశ్చయించుకొన్నాడు. అతను తన జీవితాన్ని సమాజసేవ కోసమే అంకితం చేద్దామని సంకల్పించాడు. వారసత్వంగా అభించిన ఆస్తిని సమాజసేవ కోసం పనిచేస్తున్న సంస్థలకు విరాళంగా ఇచ్చేశాడు.

ఇకనాకు ఎటువంటి జంజాటాలు లేవు అని సంతోషంగా నవ్వాడు. కేప్‌చిన్ మిషనులో సాధువుగా మారాడు.

ఆఫ్రికా వెళ్లి, అక్కడ చదువు లేక, పేదరికంలో మగ్గి అందరిచేత తిరస్కరించబడ్డ ఆదివాసులకు సేవ చెయ్యాలని సంకల్పించాడు. వారికి సేవ చెయ్యటం కోసం తన పేరును కూడా నమోదు చేయించుకొన్నాడు. కాని బలహీనమైన అతని శరీరాన్ని చూసి ఆఫ్రికా వెళ్లడానికి మిషను అనుమతి ఇవ్వలేదు.

రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న సమయంలో హిట్లర్ బారిన పడిన యూదులను రక్షించి వారిని సురక్షిత స్థానానికి చేర్చటానికి తన శాయశక్తులా ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో అతను చేతిబాంబులు, తుపాకీని కూడా ప్రయోగించాడు. ఒకసారి నాజీలకు పట్టుబడ్డాడు. ఎలాగో తప్పించుకొని పారిపోయాడు.

సేవ, మానవీయ సద్భావనల ప్రేరణతో ఆయన ఈ కార్యాలన్నీ నిర్వర్తించాడు. నేను ఇంత సేవచేస్తున్నాను. అందరూ నాకు సన్మానాలు చెయ్యాలి అని ఆయన ఏనాడూ ఆశించలేదు. సమాజసేవ చెయ్యటం తన కర్తవ్యం లాగా భావించేవాడు. అతను చేసిన సేవలకి గుర్తింపుగా ప్రభుత్వం 'క్రోక్స్ డీ గురే' పతకంతో సన్మానించింది. ఛేంబర్ ఆఫ్ డిపిటీస్' సభ్యుడిగా నియమింపబడ్డాడు. పగలు ఛేంబర్‌లో కూర్చొని, రాత్రిపూట తన నివాసస్థానానికి చేరుకునేవాడు.

తన మొత్తం జీతం దీనులకోసం దుఃఖంలో ఉన్నవారి సేవ కోసం వినియోగించేవాడు. ఒక మారుమూల ఖాళీగా ఉన్న ఒక పెద్ద ఇంటిని చవకలో తీసుకొన్నాడు. ఆ ఇంట్లోపంపులు లేవు, కరెంటు లేదు, ఎటువంటి సౌకర్యాలు లేవు. కిటికీలకు అద్దాలు కూడా లేవు. వర్షాకాలంలో పైకప్పు నుండి క్రిందకు నీళ్లు కారుతూ ఉండేవి. నిర్మానుష్యమైన ఆ పెద్ద ఇంటిని అతను ఒక భూతల స్వర్గంగా భావించేవాడు. చాలామంది దానికి కూడా నోచుకోలేదు కదా అని నిట్టూర్చేవాడు. ప్రపంచమానవాళి కష్టాలను తనవిగా

**ఎంతవిరామం లేకుండా పనిచేస్తే అంత విశ్రాంతి లభిస్తుంది. అదే జీవన సూత్రం.**

భావించే విశాల హృదయం అతని సొంతం. అతని కరుణకు పరిధులు లేవు. నా తోటివాళ్లకి లభించని సౌకార్యాలు నాకు మాత్రం ఎందుకు? అనుకునేవాడు.

నేలమీద చాపపరిచి, కిటికీలకు గుడ్డలు కట్టి, రజాయి కప్పుకొని పడుకొన్నప్పుడు ఆత్మసంతోషంతో అతనికి పట్టిన నిద్ర, మెత్తటి డన్‌లప్ పరుపుల మీద పడుకొన్న వాళ్లకు కూడ లభించదు.

నిర్మానుష్యమైన ఆ ఇల్లు కొద్దిరోజులకే అతని పరిజనులతో నిండిపోయింది. సహాయం కోసం వచ్చేవారికోసం, అతని తలుపులు ఎప్పుడూ తెరిచి ఉండేవి. వచ్చిన వారిని, వెళ్లమని అతను ఎప్పుడూ అనలేదు. ఇరవై సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించి జైలునుండి బయటపడ్డ హంతకుడు అతని అతిధిగా మారాడు. తరువాత ఆత్మహత్య చేసుకోవటానికి విఫలప్రయత్నం చేసిన ఒక వ్యక్తి అతని రెండవ అతిథి, ఇలా అతని పరివారం పెరుగుతూ వచ్చింది.

మనిషి స్వతహాగా చెడ్డవాడు కాదు, పుట్టిపెరిగిన వాతావరణం, పరిస్థితులు అతన్ని అపరాధిగా, హంతకుడిగా మార్చాయి అని అబ్బేపియర్ అంటూ ఉండేవాడు. ద్వేషించడం అన్న పదం అబ్బేపియర్ నిఘంటువులో లేదు, ఆయనకు కేవలం ప్రేమించటం మాత్రమే తెలుసు. ఆయనతో కలిసి ఉండటం మొదలు పెట్టిన తరువాత వాళ్లల్లో మార్పువచ్చింది. వారు రంగులు అద్దడం, బొమ్మలు చేసి వాటిని అమ్మడం చేసేవారు. ఆ విధంగా వచ్చిన డబ్బులతో తమ బతుకు తెరువు కొనసాగిస్తున్నారు.

కుటుంబం ఇంకా పెరిగి పెద్దదయి, సభ్యుల సంఖ్య పద్దెనిమిదికి చేరింది. ఇందులో ఒకరు శరణార్థి అయితే ఇంకొకరు దివాలా తీసిన వ్యాపారి, ఇంకొకరు వికలాంగుడు. తనకు వచ్చిన జీతం నుండి ఎంతో కొంత డబ్బు వారికి ఇచ్చి ఏదైనా వ్యాపారం ప్రారంభించటానికి సహాయం చేస్తూ ఉండేవాడు. ఏసుక్రీస్తు అంతిమ సందేశం ఇచ్చిన పేరును, తన పరివారానికి పెట్టాడు. ఏసుక్రీస్తు ఆ సందేశం ఇచ్చిన తరువాత శిలువ వెయ్యబడ్డాడు.

ఇల్లులేని వాళ్ల సంఖ్య చాలపెద్దది. పనిచేస్తూ రోజుమొత్తం ఎలాగో అలా గడిచిపోయేది. రోజంతా కష్టపడి పనిచేసి వచ్చిన వ్యక్తి రాత్రిపూట విశ్రమించటానికి శిధిలావస్థలో ఉన్న ఇల్లు అయినా కోరుకుంటాడు. ఆ మాత్రం భాగ్యానికి కూడా నోచుకోకపోతే, జీవించడం ఎట్లా?

అటువంటి అభాగ్యులకోసం పాత రైలు బోగీలు, పాతబడిన కార్లు, ట్రక్కులతో ఇళ్లు నిర్మించి, అనేక బస్తీలు తయారు చేసాడు. తనుకూడా, తన తోటివాళ్లతో కలిసి అటువంటి ఇళ్లలోనే ఉంటూ ఉండేవాడు. ఆ ఇళ్ల పైకప్పు కోసం రేకులను ఉపయోగించేవారు. అందువల్ల 'టిన్‌కేన్ సిటీ'గా ఆ బస్తీలకు పేరు వచ్చింది.

పన్ను అధికంగా చెల్లించాల్సిన కారణంగా ఆ రోజుల్లో ఇళ్లను నిర్మించడం అత్యధిక భారమే కాకుండా, అసాధ్యం అని కూడా అనిపించేది. పారిస్‌లోని నలభైశాతం ఇళ్లల్లో ముప్పు పొంచి ఉన్నా ప్రజలు వాటిల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అటువంటి ఇళ్లు కూడా అందరికీ లేవు. ఇళ్లులేని వారికోసమే అబ్బేపియర్ ఇటువంటి ఇళ్లను నిర్మించి వారికి నిలవనీడను ఏర్పాటు చేసాడు.

పందొమ్మిది వందల ఏభైతొమ్మిదవ సంవత్సరంలో ఆయన పార్టీ ముక్కలయిన కారణంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సభ్యత్వం రద్దయ్యింది. ఆదాయం వచ్చే ఏకైకమార్గం మూసుకుపోయింది, పరివారం చూస్తే పెద్దదయింది. పరిస్థితి విషమించింది.

అబ్బేపియర్ తోటివాళ్లతో కలిసి చిరిగి, పాతబడిన బట్టలు, ఫర్నిచరు, రేకులు, పెట్టెలు మొదలైన పాతసామాను సేకరించి వాటిని బాగుచేసి క్రొత్తవస్తువులుగా, కొత్తబట్టలుగా తయారు చేసి వాటిని అమ్మటం మొదలు పెట్టాడు. ఈ పథకం కొన్ని వందలమందికి ఉపాధి కల్పించింది. వారి నిస్సారమైన జీవితంలో క్రొత్తఆశలను చిగుర్చింది.

నలభైరెండు సంవత్సరాల చిన్నవయస్సులో మానవజాతికి ఆయన చేసిన విశిష్ట సేవ, ఆయన విశాల హృదయానిది, త్యాగం, తితీక్షలతో కూడుకున్న ఆయన జీవితానిది. ప్రతి ఒక్క వ్యక్తి దుఃఖాన్ని ఆయన తన దుఃఖంలా భావించారు, వారి చలిని తన శరీరంలో అనుభవించారు. అసలైన మహాత్ముడికి నిజమైన మనిషికి ఇదే నిదర్శనం. "ఆత్మవత్ సర్వభూతేషు" అనే సూక్తిని తన జీవితంలో ఆచరించి ఒక సాధారణ వ్యక్తి నుండి అబ్బేపియర్ మహామానవుడిగా మారాడు. మనిషి తన జీవితంలో ఆర్జించిన ఈ సంపద ముందు కొన్నికోట్ల మంది ధనవంతుల సంపద దాసోహం అనక తప్పదు.

★★★

## అందరికీ ఆహ్వానం - మౌన సాధనాశిబిరం

13-12-08, 14-12-08 రెండు రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో మౌన సాధనా శిబిరం నిర్వహింపబడుతుంది. ఆసక్తి గల పరిజనులు శిబిరంలో పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి (0863 2534440, 9292202139) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 12-12-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

**స్వార్థాన్ని వదిలేస్తేనే అసలైన ఆనందం లభించేది.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-27

# గ్రామాల పర్యటనలో అనుభవాలు

గురుదేవులు సూచించిన విధంగా కార్యకర్తలందరికీ నా ఉపన్యాసాలలో కార్యక్రమ వివరాలు ఇలా తెల్పాను– ప్రతి గ్రామానికి వెళ్లి, గురూజీ సందేశాలు అందజేయాలి. అక్కడ మంచి మంచి సందేశాలను గోడలపై వ్రాయాలి. ప్రతిచోటా ఏకకుండీయజ్ఞం జరగాలి. పల్లెప్రజలు ఆ యజ్ఞంలో తమలో ఉన్న ఒక చెడు అలవాటును వదలివేసే విధంగా చెప్పాలి. ఒక మంచి అలవాటును స్వీకరించే ఏర్పాటు చేయాలి. రామాయణ గ్రంథాన్ని ఉదాహరించి, అందులోని అన్నదమ్ముల మధ్యగల ప్రేమనూ, అత్తాకోడళ్ల మధ్య ఉండవలసిన సఖ్యతనూ, సమాజ అభివృద్ధికి ప్రజలు ఏమి చేయాలో, మన ఋషులు ఏమి చేసేవారో, గీతలో, రామాయణంలో భారతంలో ఏమి చెప్పబడినవో ఉదాహరించాలి.

నేను నా ఉపన్యాసం ముగించగానే డా॥ రతన్ సక్సేనా లేచి నిలబడి "మీరు వేదికపై నుండి మాట్లాడగలరు. మీరు పల్లెలకు వెళ్లి ఎలా చేయాలో మాకు ప్రదర్శన పూర్వకంగా చెప్పండి" –అన్నారు. అలాగేనని, ఆ రోజునుండి శాంతికుంజ్‌లో సైకిలు నడపడం ఒక నెలపాటు నేర్చున్నాను. సాధనాశిబిరాలకోసం అక్కడ ఉంటున్నానుగదా. శాంతికుంజ్‌లో కార్యకర్తలతో చర్చలు జరిపే వాడిని. అలాగే సాహిత్యాన్ని అందరూ చదివేవిధంగా చేసేవాడిని. మథుర వచ్చిన తర్వాత సైకిల్‌యాత్రకు ఒక కార్యక్రమం తయారు చేశాను. మొదట కాన్పూరు వెళ్లాను. నాతోపాటు అయిదుగురు ఉన్నారు. శుక్లాజీ, సంగేర్‌జీతో సహా. అందరం సైకిళ్లపై వెళ్లాము. అయిదురోజుల కార్యక్రమం అది. సైకిళ్లపైనే మా పరుపు చుట్టలూ, ఆహారం తయారుచేసికోడానికి పరికరాలూ, అన్నీ ఉన్నాయి. క్రొత్త గ్రామాలకు వెళ్లాము. గ్రామం చేరగానే గోడలపై సందేశాలు వ్రాయడం ప్రారంభించాము. ఒక కార్యకర్త భోజనాలు తయారు చేసేవారు. రాత్రిళ్లు ఉపన్యాసాలు ఏర్పాటు చేశాము. నేను భోజనం తయారు చేసేవాడిని. పగలు ఏక కుండీ యజ్ఞం, అందులో గ్రామస్థులు ఒక దురలవాటు వదిలివేసే విధంగానూ, ఒక మంచి అలవాటు స్వీకరించే విధంగానూ చేసేవాళ్లము. హరిప్రసాద్ శుక్లా మా నాయకుడు. మేమందరం వారి ఆజ్ఞలను శిరసావహించేవారము. ఈ విధంగా 10, 15 గ్రామాలు పర్యటించాము.

ఒక గ్రామంలో నేను భోజనాలు తయారు చేస్తున్నాను. కొందరు గోడలపై వ్రాయడం ప్రారంభించారు. మేము విడిది దిగినచోట ఒక భవనంలో ఒక వృద్ధురాలు ఉంది. నేను వెళ్లి ఆమె పాదస్పర్శ జేసి నిలబడ్డాను. 'బిడ్డా, ఏమిటి సంగతి' –అని ఆమె అడిగింది. 'అమ్మా, మేము భోజనాలు తయారుచేసుకోడానికి పాత్రలు ఇవ్వగలరా' –అని అడిగాను. 'మీరెవరు' –అని అడిగింది. 'నేను బ్రాహ్మణుడను' –అన్నాను. అప్పుడామె గిన్నెలు ఇచ్చింది. కొంచం కట్టెలు ఇవ్వమని అడిగాను. ఆమె వద్ద కట్టెలులేవు. కాని మంటకు కొన్ని చిన్న చిన్న పుల్లలు ఉన్నాయి. వాటినే ఇచ్చింది. ఇదంతా కొందరు గ్రామస్థులు చూశారు. అందులో ఒకరు మరొకరితో, 'చూడండి పొట్టఎంత చెడ్డదో, ఈ ముసలి వ్యక్తి భోజనం తయారు చేస్తున్నాడు. దానికి ఆయన ఎంత డబ్బు తీసుకుంటున్నాడో' –అన్నాడు. శుక్లాజీ ఈ మాటలు విన్నారు. అందరూ వచ్చిన తర్వాత, ఒక్కొక్కరికి ఒక్కొక్క రొట్టెను ఇచ్చాను. మిగతావి రాత్రికి ఉంచాము. శుక్లాజీ అందరితో చెప్పారు– 'గ్రామస్థులు ఈ ముసలాయన భోజనం తయారుజేస్తుంటే మిగతావారు గ్రామంలో పడితిరుగుతున్నారు' –అని అనుకొంటున్నారనీ, ఈయనకు మనం అంతా కలసి జీతం ఇస్తున్నామనీ, అందుకే ఇంత శ్రమపడుతున్నాడు అనీ అనుకొంటున్నారు.' అందరూ నవ్వటం ప్రారంభించారు. ప్రతివ్యక్తీ పనిచేసి తిరిగివచ్చిన తర్వాత, మా అనుభవాలు పంచుకునేవారము. అందరం కలసి నవ్వుకొనే వారము. ప్రతి ఒక్కరూ ఒక్కో కథ చెపుతూ ఉండేవారు. ఆ రాత్రి ఉపన్యాసంలో శుక్లాజీ గ్రామస్థులతో చెప్పారు. "మీకు పండిట్‌జీ గూర్చి చెడు అభిప్రాయం ఉన్నట్లు ఉంది. మేమంతా ఆయన ఆజ్ఞలకు లోబడి పనిచేస్తున్నాము. వారు మా పెద్దన్నగారు" –అని. నేను వేదికపై కూర్చుని ఉన్నాను. శ్యామ్ లాల్‌జీతో పాటు కార్యకర్తలందరూ నా పాదాలు స్పృశించారు. గ్రామస్థులు ఆశ్చర్యపోయారు– నాయకుడు వంటజేసి పెడుతున్నాడా అని. వారికి ఆకళింపు అయింది– వీరంతా ఒక మంచిపనికోసం ఇలా తిరుగుతున్నారనీ, గోడలపై వ్రాస్తున్నారనీ, గ్రామస్థులను చెడ్డ అలవాట్లను వదలమనీ, వారికి గ్రామస్థులపై అపారప్రేమ ఉందనీ వారందరికీ ఇలా తెలియజేసాను. 'మాకు ఒక గురూజీ హరిద్వార్‌లో

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది పేదరికమే.

ఉన్నారనీ, వారిని మీరంతా దర్శించండనీ.' అలాగే అన్నారు వారు. 'ఒక గురూజీ శిష్యులు ఇంత పనిచేస్తుంటే, ఆ గురూజీ ఎంతటివారో, వారిని తప్పకుండా దర్శించాలి' -అని వారన్నారు.

ఆ విధంగా మేము ఒక గ్రామం తర్వాత మరోగ్రామం తిరుగుతున్నాము. ఒకచోట మాకు ఒక కాలువ అడ్డువచ్చింది. అందరూ ఆగారు. నేను ముందుగా నా సైకిల్ నా భుజంపై పెట్టుకొని ఆ కాలువ దాటాను. తర్వాత అందరూ దాటారు. దాటిన తర్వాత నవ్వడం ప్రారంభించారు'- పండిత్‌జీ, ఒక కాలువేకాదు సముద్రం కూడా దాటగలరు' అని. ఆ అయిదు రోజులు మాకు అత్యంత ప్రియమైనవి. ఇప్పటికీ నాకు ఆ అనుభవాలు గుర్తువస్తుంటాయి. శుక్లాజీ ఫోటోలు గూడా తీశారు. కాన్పూరు వచ్చిన తర్వాత పర్యటన వివరాలు గురుదేవులకు తెలియజేశాము.

తర్వాత గుజరాత్ వెళ్లినపుడు, అక్కడి గ్రామాలను సైకిళ్లపై సందర్శించాము. మా సైకిల్ యాత్ర విషయం అక్కడి శాఖలకు తెలిసింది. ఆ గ్రామాలలో ఒక కుండీ యజ్ఞం, యజ్ఞదక్షిణగా ఒక చెడు అలవాటు వదులుకోమని చెప్పడం, ఒక మంచి అలవాటు స్వీకరించుమని చెప్పటం- ఇదంతా గ్రామస్తులను ఆకట్టుకుంది. ఆ రకంగా చిన్న చిన్న యజ్ఞాల ప్రక్రియ ప్రారంభమైంది.

ఒకరోజున గురూజీ నుండి వచ్చిన ఆదేశం తమకు మంచి నైపుణ్యం గల ఇంజనీర్ల అవసరం ఉందని. ఇప్పటివరకూ మామూలు కార్యకర్తల ద్వారానే యజ్ఞశాలల నిర్మాణం చేయించుకుంటున్నాము. ఇక పక్కా నిర్మాణాలను చేయడానికి, ధైర్యం, సాహసం, గుండె నిబ్బరం ఉన్న కార్యకర్తలు కావాలి. త్యాగాలు చెయ్యగలవారు కావాలి. ఒక గుంపుతో పనిలేదు. ఎక్కువమంది ఉంటే మురికి ఎక్కువ చేస్తారు. ఇప్పుడు మంచి పనితనం ఉన్నవారిని కార్యకర్తల నుండి తీసికోవాలి. గ్రామాల్లో జరగవలసిన కార్యక్రమాల నిర్విరామంగా జరగాలి. ఇప్పుడు ధైర్యం ఉన్న, సాహసికులైన కార్యకర్తల అవసరం ఉంది. ప్రతి ఇంటిలో గాయత్రీమాత ఫోటో ఉండాలి. గాయత్రీ జపం జరగాలి. గ్రామాల అభివృద్ధి కార్యక్రమానికి ప్రచారం జరగాలి. ఒకలక్ష గ్రామాల్లో యజ్ఞాలు జరగాలి. గ్రామాల్లో సంస్థ శాఖల ఏర్పాటు జరగాలి. ఈ కార్యక్రమాలకు నైపుణ్యం గల ఇంజనీర్లు కావాలి. ఆలోచనతో చేసే మంచిపనులు ఎన్నో సమస్యలను తీరుస్తాయి. మంచి కార్యకర్త ఒక్కరు ఉన్నా వేయిమంది పని చేయగల్గుతాడు.

★★★

## స్వధర్మమే - శ్రేష్ఠ ధర్మం

*17వ శతాబ్ది ఉత్తరార్థం. కాశ్మీరులోని డోగ్రా రాజపుత్ర పరివారము. ఆ పరివారంలో లక్ష్మణదేవ్ అనే పేరుగల బాలుడు ఉదయించాడు. పసితనం నుండే ఆతనికి స్వాభిమానం మెండు. అత్యాచారపరులైన మొగలు చక్రవర్తులపై మనస్సులోనే కారాలు మిరియాలు నూరుతుండేవాడు. వేట అనే ఆటలో అనుకోకుండా నిండు చూడిదైన లేడి చనిపోయింది. దాని గర్భము నుండి రెండు చిన్న చిన్న పిల్లలు బయటకు వచ్చాయి. ఆ హృదయ విదారక దృశ్యం లక్ష్మణదేవ్‌ని విరాగిగా చేసింది. 16 సంవత్సరాల ఆ చిన్న వయస్సులోనే లక్ష్మణదేవ్ నాసిక్ వెళ్లిపోయాడు. అక్కడ పంచవటికి చేరి తపస్సు చేయసాగాడు. ఆ చిన్నారి విరాగిని చూచి అందరు "భైరాగి" అని పిలవటం మొదలుపెట్టారు. ఆ పిలుపుకు కంగారుపడి అక్కడి నుండి దక్షిణ పంజాబుకు వెళ్లిపోయాడు. అక్కడ గురుగోవిందసింగ్ దృష్టికి వచ్చాడు. ధర్మ రక్షణకై ముందుకు సాగాల్సిందిగా ప్రోత్సహించాడు. గురుగోవిందుని ధ్యేయానికి బందీ అయ్యాడు లక్ష్మణ్. అప్పటి నుండి బైరాగి కాస్తా "బందా బైరాగి"గా పేరుబడ్డాడు. 25 మంది శిష్యులను కూడ వెంటపెట్టుకుని రాష్ట్ర కార్యంలో నిమగ్నుడయ్యాడు. మెల్ల మెల్లగా సిఖ్ఖుసైనికులను కూడగట్టుకుని ఒక సైన్యాన్ని తయారు చేశాడు.*

*దేశాన్ని, ధర్మాన్ని రక్షించే కార్యంలో వారు ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో సరహిందు నవాబు గురుగోవిందు కుమారుల నిద్దరిని గోడలోపెట్టి సజీవ సమాధి చేయించాడు. ఆ చిన్నారులు ధైర్యంగా మృత్యువును కౌగిలించుకున్నారే తప్ప తమ ధర్మాన్ని విడువలేదు. దీనితో చలించిపోయిన బందాబైరాగి తన సిఖ్ఖుసైన్యంతో దండెత్తిపోయి నవాబును ఓడించాడు. ఆ రాజ్యంలో బందాబైరాగి గురుగోవిందుని పేరుతో నాణేలు ముద్రింపచేశాడు.*

*యవనులు మాత్రం బందాబైరాగిని విడిచిపెట్టలేదు. ఆతని సైన్యాన్ని ఛిన్నా భిన్నం చేశారు. కాని బైరాగి ఏమాత్రం తొణకలేదు. పరధర్మాన్ని స్వీకరించలేదు. నవ్వుతూ నవ్వుతూ స్వధర్మం కోసం ప్రాణాలర్పించాడు.*

**రైతైనా - రాజైనా ప్రథమంగా కోరుకునేది ఇంటిలో ప్రశాంతత.**

# ఒక్క రొట్టె చాలు - ఆకలి తీరడానికి

పరమపూజనీయ గురుదేవులు అదృశ్య గురుసత్తా మార్గదర్శనంలో సర్వసమృద్ధి సంపన్నులు. అయినప్పటికీ తన జీవితమంతా పేదతపస్విగానే గడిపివేశారు. వందనీయ మాతాజీ కూడ వారికి సంపూర్ణ సహకారాన్నందించారు. గురువర్యులు తన ఆలోచనా సరణిని క్రొత్తవారికి అవగాహన చేయిస్తున్నరోజులవి. తన దగ్గరకు వచ్చిన వారందరికీ ప్రేమను పంచియిస్తూ ప్రభావితులను చేసేవారు. అప్పటికే గాయత్రీ తపోభూమి నిర్మాణం జరిగిపోయింది. అనుష్ఠాన సాధన కోసం ప్రతిరోజు 10-15 మంది వస్తూ ఉండేవారు. తపోభూమిలో నివాసముండే వసతులు లేవు. భోజనానికి మాతాజీ వంట గదికి చేరాల్సివచ్చేది. అందువల్ల అనుష్ఠానంకాగానే అఖండ జ్యోతి కార్యాలయమున్న ఘీయామండీకి వెళ్లేవారు. ఒక్కొక్కసారి అతిథుల సంఖ్య పెరిగిపోయేది. చేసిన వంటకాలు తక్కువయ్యేవి. అయినా గురుదేవులు దిగులు పడేవారు కారు. ఆయన చెప్పేవారు- "వంటకాలు మధ్యలో పెట్టుకోండి. చుట్టూ కూర్చోండి. నేను చెప్పేది శ్రద్ధగా వినండి. తక్కువ ఆహారంతోనే ఆకలి తీర్చుకోవచ్చు. రొట్టెను చిన్న చిన్న ముక్కలుగా చేయండి. వాటిని చాలాసేపు బాగా నమలండి. నములుతూనే ఉండండి. ఎవరు ఎక్కువసేపు నములుతారో నేను చూస్తూనే ఉంటాను. ఎక్కువసేపు నమిలిన వారి ఆకలి ఎక్కువ శాతం తగ్గిపోతుంది. దీనివల్ల మీ ఆకలిమాత్రం తీరుతుంది. కాని కడుపు నిండదు. ఆ మాటలు వారు అక్షరాలా పాటించేవారు. ఆనందంతో తిరిగి వెళ్లేవారు.

ఆయన తన జీవితాన్నే ప్రయోగశాలగా చేసికున్నారు. తన జీవితంలోని అనుభవాలనే అందరికీ పంచిపెట్టేవారు. రాజస్థాన్‌కు వెళ్లిన టోలీలోని ఒక సభ్యుడు చెప్పాడు"-మాటోలీలో అయిదుగురు సభ్యులం ఉన్నాం. జైపూర్ వెళ్లాం. భోజనానికి కూర్చున్నాం. మాదగ్గర 5 రొట్టెలు మాత్రమే ఉన్నాయి. గురుదేవులు చెప్పిన ప్రయోగం గుర్తుకువచ్చింది. సరదాగా నవ్వుకుంటూ ఆచరణలో పెట్టాం. పోటీపడి నమిలాం. నిజం చెప్పాలంటే ఒక్కొక్కరం అయిదేసి రొట్టెలు తిన్నట్లు అనిపించింది."

ఒకసారి చండీఘఢ్‌లో ఉన్న పి.జి.ఐ. హాస్పటల్లోని హార్ట్‌స్పెషలిష్ట్ డా॥ యశ్‌పాల్ వెయ్యిమంది మీద ఒక ప్రయోగం చేశారు. "మానవుడు ఈట్ విద్ హెల్ప్ ఆఫ్ బ్రైన్ సిగ్నల్" అనే టెక్నిక్‌ను అమలు చేశాడు. మానవుడు భోజనానికి పెట్టే ఖర్చును తగ్గించుకోగలుగుతాడు. అంటే ఒక్కరొట్టెతోనే ఆకలిని తీర్చుకోవచ్చు నన్నమాట. కార్డియాలజిస్ట్ డా॥ యశ్‌పాల్ ఈ పరిశోధనను 'యశ్ ఇండియా టెక్నిక్' అన్న పేరుతో కాపీరైట్ కూడ చేయించాడు. వారు దీనిని అమెరికన్ జనరల్ ఆఫ్ కార్డియాల్జీలో ప్రకటించడానికి పంపించారు.

ఈ టెక్నిక్‌లో డా॥ యశ్‌పాల్ ఏంచెప్పారంటే- "మానవుడు ఒక్కరొట్టెను చిన్న చిన్న ముక్కలుగా చేసి బాగా నమిలి నమిలి తినాలి. కడుపులోకి ఆహారంపోగానే వెంటనే కొన్ని తరంగాలు బయలుదేరుతాయి. అవి మస్తిష్కం నుండి బయలుదేరిన వేగస్ తంత్రుల ద్వార మస్తిష్కంలోని హైపోథెలేమస్ భాగానికి చేరుకుంటాయి.

అక్కడ స్టాహటీ సెంటర్ ఉంటుంది. దానిని 'సేటిస్ ఫేక్షన్ మోటర్' అని కూడా అంటారు. ఈ కేంద్రంలో ఆ తరంగాలు ప్రవేశించగానే ఆకలితీరిన అనుభవం స్పష్టమౌతుంది. భోజనం ఆపివేస్తాం." ఇంకా ఏం చెప్పారంటే- "నమలకుండా వేగంగా భోజనం చేస్తే పొట్టలో బయలుదేరిన సిగ్నల్ (స్టాహటీ సెంటర్) ఆకలి తీరిన అనుభవాన్ని అందించదు. అందువల్ల ఆహారాన్ని అధికంగా తీసికోవాల్సివస్తుంది. అధికంగా తిన్న తరువాత సిగ్నల్ స్టాహటీ సెంటర్‌కు ఈ విధంగా అధికంగా తిన్న ఆహారం జీర్ణం కావడంకోసం తగినంత శక్తిని పొట్టకు పంపాల్సివస్తుంది. దానికోసం పూర్తి శరీరం నుండి రక్తం పొట్టవైపు పరుగులు తీస్తుంది. ఫలితంగా ఇతర అవయవాలలో రక్తం క్షీణించిపోతుంది. అంతే. ఇక బలహీనత ప్రారంభమౌతుంది. బద్ధకం ప్రవేశిస్తుంది. శరీరం భారమనిపిస్తుంది. ఎప్పుడూ మనస్సు విశ్రాంతినే కోరుకుంటూ ఉంటుంది. రక్తం తగ్గిన అవయవాలకు రక్తాన్ని నింపడం కోసం గుండె ఎక్కువగా శ్రమపడాల్సి ఉంటుంది. గుండె కొట్టుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ విధంగా ఎక్కువకాలం గడిచిందంటే గుండె జబ్బులు వచ్చే అవకాశం పెరిగిపోతుంది."

**గతాన్ని మరువడంలోనే ఉంది జీవిత మాధుర్యం.**

గడిచిన కొన్ని సంవత్సరాలనుండి మనకు తగినంత ఆహారపదార్థాలు దొరకడంలేదు. అందువల్ల విదేశాలనుండి దిగుబడి చేసుకోవాల్సి వస్తున్నది. రసాయనిక ఎరువుల వల్ల, పురుగుమందుల వాడకం వల్ల భూమి బలహీనపడి పోతున్నది. దిగుబడి తగ్గిపోతున్నది. వ్యవసాయ భూములే కరువైపోతున్నాయి. పెరిగిపోతున్న జనాభాకు నివాస భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, దుకాణాలు, ఫ్యాక్టరీలు నిర్మించడానికే ఎక్కడెక్కడి భూమి సరిపోవడంలేదు. అధిక జనాభా కారణంగా పంట భూములు తరిగిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఆహార సమస్య విలయతాండవం చేయబోతున్నది. అధిక ధరల వల్ల కూలినాలి జనం రెండుపూటలా తినలేని పరిస్థితి వస్తున్నది. ముందు ముందు ఆహార సమస్యను పరిష్కరించాలంటే డా॥యశ్‌పాల్ చేసిన పరిశోధనా కార్యానికే పెద్ద పీట వేయాల్సి ఉంటుంది.

మనం గమనించాల్సిన విషయమేమంటే గురుదేవులు స్వానుభవంతో అందించిన పొదుపుసూత్రం. వారు ఈ పరిస్థితిని 50 సంవత్సరాలకు ముందే ఊహించగలిగారు. ఈనాటి వైజ్ఞానికులు దానిమీద పరిశోధనలు చేస్తున్నారు. గురుదేవులు ఏనాడో చెప్పిన మాటను ఈనాడు శాస్త్రవేత్తలు ఋజువుచేసి చూపుతున్నారు. యుగద్రష్ట అనడానికి ఇంతకన్న ప్రత్యక్ష నిదర్శనం ఏంకావాలి.

యుగద్రష్ట - సర్వ జగద్రక్ష

★★★

## దుఃఖానికి కారణం పాపాలేకావు

సాధారణంగా ఎవరూ దుఃఖాన్ని ఇష్టపడరు, పాపాలవల్ల, ఈశ్వరుని కోపం వల్ల మనిషికి దుఃఖాలు వస్తాయని భావిస్తారు. కాని ఈ మాట పూర్తిగా సత్యం కాదు. దుఃఖము రావడానికి ఒక కారణం- మనం చేసిన పాపాలే కావచ్చు. అయితే అన్ని దుఃఖాలకి కారణం పాపమే కాదు.

చాలా సార్లు ఈశ్వరుని కృప వల్ల, పూర్వ సంచిత పుణ్యం వల్ల, పుణ్య సంచయనం కోసం చేసిన తపస్సు వల్ల కూడా దుఃఖాలు వస్తాయి. భగవంతుడు ఏ ప్రాణిపై తన కృపాదృష్టి సారించి తన శరణ్యంలోకి తీసుకుందామనుకొంటాడో, కళ్యాణ పథంవైపుకి నడిపిద్దామని అనుకొంటాడో ఆతడిని ఈ భవబంధనాల నుండి తప్పించడానికి దుఃఖకరమైన పరిస్థితులు కల్పిస్తాడు. దానితో మనిషి తన తప్పులను తెలుసుకొని, నిద్రమత్తుని వదిలి జాగ్రత్తపడ్తాడు.

ఈ ప్రాపంచిక మోహము, మమత, విషయ వాసనల రుచి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని మామూలు అనుకుంటే వదలలేము. జీవితమువంటి బహుమూల్యమైన వస్తువుని ఏ శ్రేష్ఠ కర్మలకో వెచ్చించాలని సామన్యమైన కోరిక ఉన్నా, ఇంకొక వైపు ఆకర్షణీయమైన పరిస్థితుల కారణంగా ఈ కోరిక దూది పింజలాగ ఎగిరిపోతుంది. ఈ విధమైన బురదనుండి బయటపడేయటాన్కి భగవంతుడు తన భక్తుని వెన్నుచరచి మేల్కొలుపుతాడు. ఒక్కొక్క సారి గట్టిగా కుదుపుతాడు. ఈ కుదుపే మనకు దుఃఖంలా కనిపిస్తుంది.

మృత్యుసమీపం వరకు తీసుకెళ్లే జబ్బు, పరమ ప్రియులైన స్వజనుల వియోగం, అసాధారణమైన నష్టం, దుర్ఘటన, బాగా నమ్మకమున్న మిత్రులవల్ల అవమానం లేక నమ్మకద్రోహం వంటి సంఘటనలు కల్పిస్తాడు. దీనివల్ల తప్పుదారిన వెళ్లున్న వారు సరిఅయిన మార్గంలోకి వచ్చేస్తారు.

పూర్వ సంచిత శుభ సంస్కారం వల్ల ఇలాంటి దుఃఖాలు వస్తాయి. ఈ శుభసంస్కారాలు ఒక మంచి కాపలావానివలె మనిషిని ఉత్తమ మార్గంవైపుకి మళ్లించాలని ప్రయత్నిస్తాయి. అయితే పాపకర్మవైపుకి అతని ప్రవృత్తి దారితీస్తే, శుభ సంస్కారాలు వీటిని తనవైపుకి వచ్చిన ఆక్రమణగా భావించి వీటినుండి రక్షించుకోవడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తాయి. పాపకర్మ చేయడానికి వెళ్లినపుడు ఆతడు చేసే పనిలో విఘ్నాలు కలిగి, ఆతడిపని విఫలమవుతూ ఉంటుంది. పాపకర్మ చేయలేనపుడు అది మంచే కదా ! దొంగతనానికి వెళ్తున్నప్పుడు దారిలో కాలు విరిగిపోతే దుష్కర్మ పూర్తి కాదు కదా ! అలాంటి సంఘటన వల్ల పూర్వ సంచిత శుభ సంస్కారాలవల్ల, పుణ్యఫలం వల్లనే ఆ చెడు జరిగిందని అర్థం చేసుకోవాలి.

నిశ్చయంగా కొన్ని దుఃఖాలు పాపాల పరిణామ స్వరూపంగా ఏర్పడుతాయి. కాని కొన్ని దుఃఖాలు భగవంతుని కృపవల్ల పూర్వ సంచిత శుభసంస్కారాల వల్ల ధార్మికసేవ అనే తపశ్చర్యవల్ల కూడా వస్తాయి. ఇదే విధంగా మనకి ఏదైనా విపత్తి వస్తే "మనం పాపులం, దురదృష్టవంతులం, ఈశ్వరుని ఆగ్రహానికి గురి అయిన వారం" అని అనుకోకూడదు. ఆ కష్టాల మాటున మన అల్పమైన మస్తిష్కానికి అందని ఏదో లాభం దాగి ఉందని, దాని స్వరూపం మనకి ప్రస్తుతము గోచరించటం లేదని అర్థం చేసుకోవాలి.

**ఆత్మ వెలుగుతున్న జ్యోతి - శరీరం శుభ్రపరచిన గ్లాసులా ఉండాలి.**

సద్గురులీలామృతం

# ఉత్తరం దెబ్బకే జ్వరం పరార్

*(జబల్పూర్ నుండి శ్రీ సూర్యభాను వ్రాసిన విశేషాలు)*

1988లో సూర్యభాను భార్యకు ఆరోగ్యం సరిగాలేదు. అకస్మాత్తుగా జ్వరం బారిన పడి బాధపడుతోంది. డాక్టర్లు చికిత్స చేస్తూనే ఉన్నారు. కాని ఫలితం కనిపించడం లేదు. 4 నెలల నుండి విడిచిపెట్టని జ్వరం. డాక్టరు యాంటీ బయాటిక్స్ ఇచ్చీ ఇచ్చీ ఆమె ఆరోగ్యాన్ని మరింత ఖరాబు చేశాడు. పూర్తిగా బలహీన పడిపోయింది.

చేసేదిలేక సూర్యభాను గురుదేవులకు లేఖద్వారా తన గోడును నివేదించుకున్నాడు. విచిత్రం. ఏనాడైతే ఉత్తరం పోస్టుచేశాడో అదే రోజునుండి ఆమెకు మెల్ల మెల్లగా జ్వరం తగ్గనారంభించింది. ఇంతలో జవాబు కూడ రానేవచ్చింది. గురుదేవుల ఆశీర్వాదం రామబాణంలా పనిచేసింది. రెండు నెలల్లో పూర్తిగా కోలుకొనడమే గాక లేచి మామూలుగా తిరగసాగింది. తన దినచర్యలో తాను నిమగ్నమయింది. అంతేకాదు. ఆమె మరల ఎన్నడూ అంత స్థాయిలో జబ్బుపడలేదు.

# గురుసత్తా అంటే ఇదే

అశ్వినీకుమార్ శర్మ భోపాల్‌లో బి.హెచ్.ఇ.యల్.లో నౌకరీ చేస్తుండేవాడు. 7-5-1982 నాడు ఆయన భార్యకు మొదటిసారిగా మూర్ఛరోగం వచ్చింది. మూర్ఛలే కాకుండా కోమాలోకి వెళ్లిపోయేది. కస్తూరిబా హాస్పటల్లో జాయిన్ చేశారు. పరిస్థితి రాను రాను విషమించసాగింది. కోమాలో నుండి తేరుకోగానే తీవ్రంగా మూర్ఛ వచ్చి గిల గిల కొట్టుకునేది. మూర్ఛ నుండి తేరుకోగానే కోమాలోకి వెళ్లిపోయేది. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ కె.డి. పండ్యా నలుగురు స్పెషలిష్టులను పిలిపించాడు. అందరు కలసి అనేక రకాలుగా పరీక్షలు చేశారు. స్కానింగ్ తీశారు. కాని అసలు వ్యాధి ఏమిటో ఎవరికీ అంతుచిక్కడంలేదు. చికిత్స మాత్రం నడుస్తోంది.

శర్మ 29-7-1983 నాడు భార్యను తీసికొని దర్శనార్థం శాంతికుంజ్ వెళ్లాడు. బ్రహ్మముహూర్తంలో గురుదేవుల గది నుండి "నాయనా ! ఏడవ వద్దు. నేనామెకు జీవనదానం చేశాను." అన్నట్లుగా మాటలు వినిపించాయి. తరువాత ఒకరోజున హాస్పటల్లో రాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో ఆమె శ్వాస చాల వేగవంతమైంది. డాక్టర్లంతా చివరిక్షణాలుగా భావించారు. అపస్మారక స్థితిలో కూడ ఆమె పెదవులు గాయత్రీ మంత్రాన్ని స్పష్టంగా ఉచ్చరించేవి. శర్మ కోరిక మీద డా॥ పండ్యాజీ స్వయంగా రోగి వివరాలు గురుదేవులకు టెలిగ్రాం ఇచ్చారు. పోస్టాఫీసులో టెలిగ్రాం ఇచ్చి వచ్చేసరికి శ్రీమతి శర్మ శ్వాస మామూలుగా అయింది. నాలుగు రోజుల తర్వాత స్వహస్తాలతో వ్రాసిన జాబు వచ్చింది.

"మేము నీ భార్య ఆరోగ్యం గురించి మాతను పూజిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం .ఆమె ప్రాణాలు రక్షించబడ్డాయి. ఆమెకేమీ భయంలేదు. అమ్మమీద విశ్వాసం ఉంచు." జాబును చదువుకున్న శర్మ ఆశ్చర్యానికి, ఆనందానికి అవధుల్లేవు. ఒక సంవత్సరంలోపు ఆమె జబ్బు పూర్తిగా నయమైంది. డాక్టర్లంతా విస్తుపోయారు. తరువాత ఇద్దరూ అత్యంత భక్తి శ్రద్ధలతో శాంతికుంజ్‌కు వచ్చేశారు. శ్రేష్ఠపరిజనులుగా సేవలందించారు. గురుసత్తాకు తలలువంచారు.

★★★

**ఉన్నవాళ్లను దోచి పేదలకిస్తే పెరిగేది పేదరికమే. ఆర్థిక శాస్త్రంలో ఆరంభసూక్తి ఇది.**

# సిద్ధికి సంబంధించిన సిద్ధాంతాలు

ఆధ్యాత్మిక విద్యలో ఏ కొంచెం ప్రవేశమున్న వారికైనా వారికి సాధనల వల్ల సిద్ధులు లభిస్తాయని తెలుసు. అష్టసిద్ధులు నవ నిధులు సుప్రసిద్ధమైనవి. విభిన్నమైన యోగాల ద్వారా విభిన్న శక్తులు హస్తగతమౌతాయి అన్నది తెలిసిన విషయమే. ఇంద్రియాలను ఆకర్షించే భోగాలను, విలాసాలను, విశ్రాంతిని వదిలివేసి ఏ వ్యక్తి కూడా కష్టదాయకమైన, కఠోరమైన, శ్రమతో కూడుకొన్న సాధనలు చేయదు. ఎక్కువ విలువైన వస్తువు కోసం తక్కువ విలువైన వస్తువుని త్యాగం చేయవచ్చును. సాధనలను కష్టపడి ఎందుకు చేస్తారంటే ఏ సుఖాలనైతే త్యాగం చేశారో అంతకంటే గొప్ప సుఖాలను పొందాలనే ! ఇలా కాని పక్షంలో ఏ వ్యక్తి కూడా సాధన అనే కష్టాన్ని కొని తెచ్చుకోదు.

చాలాసార్లు చాలా మంది వ్యక్తులు సాధారణమైన మనిషి చేయలేని కష్ట సాధ్యమైన పనులు చేస్తూ ఉండటం మనం గమనిస్తాం. మామూలు మనుషులు చేయగలిగే సామర్థ్యాన్ని దాటి చేసే పనులను 'సిద్ధులు' అని అంటారు. ఉదాహరణకి గాలిలో ఎగిరే మనిషిని 'సిద్ధుడు' అని అంటారు. కాని అలాగని పక్షిని ఎవరూ 'సిద్ధి పొందినది' అని అనరు. సాధారణంగా పక్షి అంటే 'ఎగిరేది' అని అర్థం. ఎగరటం దానికి అసాధారణమైన పని కాదు. కాని మనిషి ఎప్పుడు ఎగరడు కాబట్టి అతడికి అది అసాధారణ సామర్థ్యం. నీటిలో మునిగి ఉండగలగటం మనకి సిద్ధి కాని చేపకి కాదు. గంటకి 20 మైళ్లు పరుగెట్టగలగడం మనిషికి సిద్ధి గాని గుఱ్ఱానికి కాదు. ఏనుగును జయించిన మనిషి సిద్ధుడు. కాని తరచుగా ఏనుగును జయించే సింహానికి అది సిద్ధి కాదు. తాత్పర్యం ఏమిటంటే ఏ విషయాలయితే సాధారణ మనిషిలో కనిపించవో వాటిని 'సిద్ధులు' అని అంటారు. ఆశ్చర్యకరమైన అసాధారణ కార్యాలకు ఇంకొక పేరే 'సిద్ధి'.

ఒక కాలములో సర్వ సాధారణమైన విషయాలు కాలము, పరిస్థితుల వశాన అసాధారణమైపోతాయి. త్రేతాయుగము, మొదలైన ప్రాచీన కాలానికి చెందిన మనిషి ఇప్పటి మనిషితో పోలిస్తే ఒడ్డు పొడుగుగా ఉండి ఎక్కువ తిండి తినగలిగే వాడు, ఎక్కువ పని చేయగలిగే వాడు, కాని ఇప్పుడు అప్పటికన్నా మనిషి శరీరము, తినే ఆహారము, బలిష్ఠత బాగా తగ్గిపోయాయి. సత్యయుగానికి చెందిన పొడవైన బలశాలి అయిన మనుషులను నేడు తెచ్చి చూపితే నిస్సందేహంగా ఆశ్చర్యపోతాం. అప్పటి మనిషి అప్పుడు ఆశ్చర్యకరమైన వ్యక్తి కాదు, ఇప్పుడు ఉండే వ్యక్తిని ఇప్పుడు ఆశ్చర్యంగా చూడరు. సమయం, పరిస్థితుల వల్ల వచ్చిన మార్పే మనకి వింతగా తోస్తుంది. ఒక దేశంలోని వారు ఇంకొక దేశపు వారి రీతి-రివాజులను, తినే పద్ధతులను, వేష భూషలను, భాషను ఆశ్చర్యంగా చూస్తారు. కాని తమ దేశపు రీతులను ఆశ్యర్యంగా చూడరు. సిద్ధులు మనకి ఆశ్యర్యాన్ని కలిగిస్తాయి. ఎందుకంటే అవి వర్తమాన కాలంలో సాధారణ మనుషులలో మనకి గోచరించవు కాబట్టి ! ఏదైతే సాధారణంగా అందరి వద్ద ఉండవో అదే ఆశ్చర్య కరమైన, చమత్కారం, వైభవం. ఇత్తడి గిన్నెలు అందరి ఇళ్లల్లో ఉంటాయి. వాటిని చూసి ఎవరు కుతూహలపడరు, కాని పుత్తడి గిన్నెలను, కంచాలను చూస్తే మాటి-మాటికి వాటి వైపు దృష్టిని తిప్పుకుంటాము. అదే బంగారం ఇత్తడి వలె బాగా ఎక్కువగా ఉత్పత్తి ఆయి అందరి ఇళ్లలోను ఉంటే అది కూడా ఇత్తడి వలె ఆకర్షణారహితమైపోతుంది. అందరికి భవనాలు, కార్లు కలిగి గొప్ప ధనవంతులైపోతే అలాంటి భాగ్యవంతులను ఇప్పటివలె ఎవరు లెక్కచేయరు. కాబట్టి సిద్ధులని చూసి ఆశ్చర్యం పడటమనేది ఇటువంటి విషయమే ! ఎక్కువ శాతం వారి వద్ద లేనివి తక్కువ శాతం వ్యక్తులలో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది, విచిత్రంగా అనిపిస్తుంది.

చమత్కారాలను చూసి ఆశ్చర్యమనిపించవచ్చును. కాని వాస్తవానికి అందులో వింత ఏమీ లేదు. గాలిలో ఎగరటం, నీటిపై నడవడం, వేగంగా నడవగల్గడం మొదలైన పనులన్ని స్వతహాగా ఆశ్చర్యపరిచే విషయాలు కావు. ఎందుకంటే ఎన్నో ప్రాణులు ఈ ప్రపంచంలో ఈ క్రియలన్నింటినీ సహజంగానే ఆచరిస్తాయి. కాబట్టి అష్ట సిద్ధులు, నవ నిధులు గగన కుసుమాలని భ్రమపడాల్సిన అవసరం లేదు. కాని అవి సాధారణ మనుషులలో మనకి కనిపించవు. సాధారణ మానవులకు అంటే మానవులకు ఆ సామర్థ్యం సహజమని అర్థం కాదు. అంతే కాక ఎక్కడినుంచో అకస్మాత్తుగా ఊడిపడేవి కావు.

మనిషి అనంత శక్తుల మహాభాండాగారం. ఆతనిలో ఎంతగొప్ప సామర్థ్యం ఉందంటే ఆతనిలోని ఒక్కొక్క కణముతో ఒక్కొక్క ప్రపంచాన్ని నిర్మించ వచ్చును. ఆతనిలో ఉండే శక్తిలో సహస్రాంశం కూడ వాడుకోవడం లేదు. ఈ దాగి ఉన్న మహాభాండాగారంలో అగణిత, అతులిత రత్నరాశులు నిండి ఉన్నాయి. ఎవరు

దురదృష్టవంతుని చక్కచేసే బాధ్యత అదృష్టవంతునిదే.

అందులోనుండి ఎంత తీసుకోగలిగితే అంత ధనవంతులు అవుతారు. అమరుడైన రాజకుమారుడు తనలో ఉన్న తన తండ్రి యొక్క సంపూర్ణ శక్తులకు యదార్థమైన ఉత్తరాధికారి. కోరికతో ప్రయత్నిస్తే అవన్నీ అతడి హస్తగత మౌతాయి. తండ్రి ఖజానానుంచి దొరకని వస్తువు అంటు అతడికి లేదు. నేటి వరకు మనం చూసిన, విన్న సిద్ధులు ఎన్ని ఉన్నాయో అవి చాలా తక్కువ. వీటిని మించినవి, అనంతమైనవి అనేకంగా దాగి ఉన్నాయి. మనిషి వికసిస్తూ పరమాత్మనే పొంది, పరమాత్మగా మారగలిగినపుడు, పరమాత్మలోని గొప్పతనం, శక్తులను కూడా పొందగలడు. పరమాత్మ ఇచ్చువల్ల ఏ అసంభవమైనా సంభవం అవుతుంది. ఇక పరమాత్మ స్థాయికి ఎదిగిన మనిషి అసంభవాన్నీ సంభవం చేయగలుగుతాడు. సిద్ధులు అసంభవం అని అనుకోవడం ఒక భ్రమ. ఒక దానిని మించిన మరొక్క రకం చమత్కారాలు మనుష్యుల ద్వారా సంపన్నమయినాయి. ఇకముందు కూడా జరుగుతాయి. మనలోని యోగ్యత లేక దక్షత ఎంత ఉచ్చస్థాయిలో ఉన్నదంటే అది మన ఊహకు అందదు.

కాలుతున్న నిప్పుపై నివురు లేక బూడిద కప్పినప్పుడు అది కేవలం బూడిద వలె కనిపించి, ముట్టుకొన్నా పర్వాలేదు అనిపించినా ఆ బూడిదను తొలగించిన వెంటనే నిప్పుకణిక ప్రకాశిస్తుంది. ఒక వెలుగుతున్న విద్యుత్ బల్బ్‌ని గుడ్డలతో కప్పేస్తే దాని వెలుగు బయటికి రాలేదు. కాని ఆ గుడ్డలను తొలగించటము మొదలు పెట్టగానే వెలుగు కనిపించడం మొదలవుతుంది. అన్ని గుడ్డలు తొలగిస్తే నలువైపులా వెలుగు నింపుతుంది. అలాగే బొగ్గులో ఉండే దాహక శక్తిని బూడిద కప్పేసింది. బల్బు వెలుగుతూనే ఉంది. కాని దానిని బట్టలు కప్పేశాయి. ఇదే విధంగా మానవుడు అనంత శక్తుల భాండాగారం. అయితే చెడుకోర్కెలు, చెడు ఆలోచనలు, భోగలాలస, అనీతి మొదలైన ఆవరణాలు కప్పి వేయడం వల్ల అవి కనిపించవు. ఈ ఆవరణాలు ఎంత దట్టంగా చుట్టివేస్తాయి. అందువల్ల మానవుడు తుచ్ఛుడుగా, నిర్బలుడుగా, అసహాయుడుగా, దీనుడుగా, హీనుడుగా తయారు అవుతాడు. పశు పక్ష్యాదులకన్నా క్రిమి కీటకాలకన్నా తీసికట్టుగా తయారు అవుతాడు. రక రకాల కష్టాలతో దుఃఖిస్తూ ఉంటాడు. చిన్న చిన్న దుఃఖ దారిద్ర్యాలను కూడా తొలగించుకోలేక పోతాడు. ఈ విధమైన పతనావస్థలో పడి ఉన్నజీవుడు, ఆధ్యాత్మిక సిద్ధులను చూసి అచ్చెరువొంది, వాటి అస్తిత్వాన్నే శంకించడంలో ఆశ్చర్యంలేదు. మనం మన అవాంఛిత కోర్కెలను, దుర్భావనలను సరిచేసుకుంటూ వాటి స్థానంలో సత్ప్రవృత్తులను, సద్భావనలను పెంపొందించుకుంటే ఆత్మ తేజము నిర్మలమై తనలోని అనంత మహత్తును ప్రకటిస్తుంది. ఈ విధంగా ప్రకటితమవడాన్నే సిద్ధి అని అంటారు. పతంజలి యోగ సూత్రాలలో యమ నియమాలు. (అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము) సిద్ధులకి మూలాధారాలు. అహింసను పాటించడం వల్ల ఉన్నవారు తమలోని వైర గుణాన్ని మరిచిపోతారు. ఆవు సింహము ఒకే చోట నివసిస్తాయి. సత్య పాలన చేస్తే వాణి శుద్ధి అవుతుంది. శాపాలు-వరదానాలు సిద్ధిస్తాయి. అస్తేయాన్ని పాటించడం వల్ల సకలసంపదలను సాధింప వచ్చును. లక్ష్మి స్వాధీనమౌతుంది. అపరిగ్రహము వల్ల పూర్వ జన్మ విషయాలు జ్ఞప్తికి వస్తాయి. తపస్సు వల్ల శరీరం తేలికపడి దూర దృష్టి లభిస్తుంది. పతంజలి చెప్పిన విషయాల పట్ల లోతుగా చూస్తే ఈ సిద్ధులు బయటినుంచి కాక తమ ఆంతరిక యోగ్యతను వికసింప చేసుకోవడం వల్ల లభిస్తాయని తెలుస్తోంది. హింస, అసత్యం, దొంగతనం, వ్యభిచారం, లోభం, బద్ధకం, తృష్ణ, అవిద్య, నాస్తికత మొదలైన దుర్గుణాల వల్ల మనలోని దివ్య శక్తులు దుర్బలమై, భ్రష్టమై కుంచించుకు పోతాయి. ఈ బలహీనతలు తొలగించుకొంటూ, మన స్వాభావికమైన సాత్విక స్థితిని పొందగలగాలి. అప్పుడే విజయులమై సఫలత సమృద్ధి, సిద్ధులను పొంది దేవమానవులమౌతాం.

★★★

## అందరికీ ఆహ్వానం - సంజీవనీ సాధనాశిబిరం

21-12-08 నుండి 25-11-08 వరకు 5 రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో 'సంజీవనీ సాధనా శిబిరం' నిర్వహింపబడుతుంది. ఆసక్తి గల పరిజనులు శిబిరంలో పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి (0863 2534440, 9292202139) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 20-12-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

క్షమించరాని మహాపాపం - పిరికతనం.

వార్తలు

# రాష్ట్రంలో దేవీనవరాత్రులు-పంచకుండీయ యజ్ఞాలు

## గాయత్రీ చేతనా కేంద్రం-హైదరాబాదులో నవరాత్రులు

గాయత్రీ చేతనా కేంద్రం- హైదరాబాదులో 30-9-08 నుండి 8-10-08 వరకు దేవీనవరాత్రుల సందర్భంగా 9 రోజులు అనుష్ఠానాలు జరిగాయి. రోజూ గాయత్రీ మహామంత్ర అఖండ జపం, క్రాంతి ధర్మీ సాహిత్య పఠనం పరిజనులు వంతుల వారీగా నిర్వహించారు. 9-10-08 విజయదశమి నాడు పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞంతో పూర్ణాహుతి జరిగింది. మధ్య మధ్యలో అక్షరాభ్యాసాలు, అన్న ప్రాశన, నామకరణ సంస్కారాలు నిర్వహింపబడ్డాయి. 8-10-08 నాడు ఎ.ఎస్. రావు నగర్ సికింద్రాబాద్‌లో శ్రీ జవహర్ లాల్- పద్మగార్ల షష్టిపూర్తి సంస్కారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని చేతనాకేంద్రం నుండి శ్రీమతి అనసూయమ్మ, శ్రీ రఘు, శ్రీ సత్యనారాయణ వెళ్లి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ జవహర్ లాల్ త్వరలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం చేయాలన్న సంకల్పం తీసికున్నారు.

10-10-08 నాడు దక్షిణ దేశ సంచాలకులు- విశ్వ గాయత్రీ పరివార్- శ్రీ అశ్వినీ సుబ్బారావుకు 61వ జన్మదిన సంస్కారం నిర్వహింపబడింది. 61 దీపాలతో దీపయజ్ఞాన్ని శ్రీమతి అనసూయమ్మ దేదీప్యమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్బారావు శక్తివంచన లేకుండా గురుదేవుల కార్యం నిర్వహిస్తానని సంకల్పం తీసికున్నారు. అదేరోజున వారి మూడవ అల్లుడు శ్రీరాజేశ్ జన్మదినం కూడ కావడంతో అందరు కలసి ఆశీస్సులు అందుకున్నారు.

## వైభవంగా షష్టిపూర్తి మహోత్సవం

12-10-08 నుండి 14-10-08 వరకు మూడురోజులు ప్రొ॥ శ్రీరామ కృష్ణ షష్టిపూర్తి మహోత్సవం కాకివాయి ఆశ్రమంలో వైభవోపేతంగా నిర్వహింపబడింది. ఈ కార్యక్రమానికి శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది, తదితర శాంతికుంజ్ సభ్యులు హాజరయ్యారు. దక్షిణ దేశ సంచాలకులు- విశ్వగాయత్రీ పరివార్- శ్రీ అశ్వినీ సుబ్బారావు దంపతుల సమక్షంలో జరిగింది. మూడు రోజులు వరుసగా 24 కుండాల గాయత్రీ మహాయజ్ఞం శాంతికుంజ్ వారి ఆధ్వర్యంలో జరిగింది. మొదటిరోజు లక్ష్మీగణపతి హోమం, రెండవరోజు నవగ్రహ శాంతి హోమం, మూడవరోజు ఆయుష్య హోమం జరుపబడ్డాయి. ప్రముఖ అస్ట్రాలజర్ శ్రీ జి.ఎస్. కృష్ణ అత్యంత భక్తి శ్రద్ధలతో మూడు రోజులూ విడిగా నిర్వహించారు. రాబోయే 27 సంవత్సరాలలో దేశదేశాలు వారు తిరిగి పరమ పూజ్య గురుదేవుల కార్యక్రమాలను ప్రచారం చేయగలరని శ్రీ జి.ఎస్. కృష్ణ ప్రకటించడంతో సభలో హర్షోల్లాసాలు మిన్నుముట్టాయి. ఈ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలలనుండి పరిజనులు దాదాపు 800 మంది దాకా తరలి రావడం ముదావహం.

ఈ కార్యక్రమానికి శ్రీరాంగోపాల్ ఐ.ఎ.ఎస్. నెల్లూరు జిల్లా కలెక్టరు, శ్రీ కొమ్మిలక్ష్మయ్య నాయుడు స్థానిక ఎమ్.ఎల్.ఎ. హాజరయ్యారు. గాయత్రీ శక్తి పీఠకార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తామని వాగ్దానం చేశారు. వారికి మాష్టరుగారు క్రాంతిధర్మీ సాహిత్యాన్ని బహూకరించారు. "బీహార్ స్కూల్ ఆఫ్ యోగా" కార్యకర్త శ్రీ సత్యానంద యోగనిద్ర గురించి వివరిస్తూ అభ్యాసం చేయించారు.

శ్రీ అశ్వినీ సుబ్బారావు జి.ఎస్. కృష్ణగారిని, శ్రీ పరమానంద ద్వివేది స్వామి సత్యానంద గారిని సత్కరించారు.

## నారాకోడూరులో దేవీనవరాత్రులు

గాయత్రీ శక్తిపీఠం- నారాకోడూరులో 30-9-08 నుండి 8-10-08 వరకు 9 రోజులు దేవీనవరాత్రులు దివ్యంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రొ॥ మారెళ్ల శ్రీ రామకృష్ణ సాధనాకార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు. దాదాపు 70 మంది సాధకులు ఉత్సాహంతో పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో నారాకోడూరు శక్తిపీఠం "బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్" గాను, కాకివాయి ఆశ్రమం "ఆంధ్రప్రదేశ్ శాంతికుంజ్" గాను రూపుదిద్దు కుంటాయని ప్రొ॥ శ్రీరామకృష్ణ భవిష్యవాణిని వినిపించారు. అందువల్ల దానికి తగిన కార్యక్రమాలు చేపట్టాలని సాధకులకు ఉద్బోధించారు.

9-10-08 విజయదశమినాడు శ్రీ ఐనాల మల్లేశ్వరరావు రచించిన ''గాయత్రీ శతకం'' ప్రొ॥ శ్రీరామకృష్ణ చేత ఆవిష్కరింపబడింది. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ మన మందరం సూర్యుని ద్వారానే జీవిస్తున్నామనీ, గాయత్రికి ప్రత్యక్ష రూపం సూర్యుడేననీ, అందువల్ల అందరు సూర్యోపాసన ప్రతిరోజు తప్పనిసరిగా చేయాలనీ నొక్కివక్కాణించారు. గాయత్రీ శతకంలో రచయిత గాయత్రీ మంత్రంలోని రహస్యాలను పట్టికలో చూపారనీ, అందరు కొని చదువదగిన పుస్తకమనీ చెప్పారు.

స్వాధ్యాయం మానవునికి మార్గదర్శకుడు - నాయకుడు - మిత్రుడు.

శ్రీ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం వందనీయ మాతాజీ - పరమపూజ్య గురుదేవుల సూక్ష్మ సంరక్షణలో, శాంతికుంజ్ హరిద్వార్ వారి సలహా సంప్రదింపులతో 24 మంది విద్యార్థులతో, గురుకుల పాఠశాల ప్రారంభింపబడుతుందనీ, క్రమంగా అదే దేవసంస్కృతీ విశ్వ విద్యాలయంగా రూపుదిద్దుకుంటుందనీ భవిష్య యోజనను చదివి వినిపించారు. ఈ యోజనకు తనవంతు ధనసహాయాన్ని అందిస్తానని స్థానికులు శ్రీ మిత్రా వాగ్దానం చేయడం జరిగింది.

## మంగళగిరి శాఖ ప్రచార కార్యక్రమాలు-2008 సెప్టెంబరు మాసం

2-9-08 నాడు 'ఉండవల్లి' పాత గ్రామంలో వీధులన్నీ పసుపు పచ్చ కాంతులతో కళకళలాడాయి. పరివార సభ్యులు గాయత్రీ మంత్ర పఠనంతోపాటు యుగ సంగీతం పాడుకుంటూ పాదయాత్ర చేశారు. సాయంత్రం 6 గంటలకు సత్సంగం ఏర్పాటు చేసి గురుదేవుల విశిష్టతను, ఆలోచనలను వివరించారు. గాయత్రీ యజ్ఞ విధానంతోపాటు, యజ్ఞ ప్రక్రియను వివరించారు. గోడలపై సద్వాక్యాలను వ్రాయడం జరిగింది.

8-9-08, 11-9-08 తేదీలలో సాయంత్రం 5 గంటలకు గ్రామస్థులతో కలసి 'పెనుమాక' గ్రామంలో పైవిధంగా పాదయాత్ర చేశారు. అచ్చటకూడ సత్సంగం నిర్వహించబడింది. పంచకుండీయ యజ్ఞానికి సంకల్పం తీసికోబడింది.

15-9-08, 22-9-08 తేదీలలో 'యర్రబాలెం' గ్రామంలో 18-9-08 నాడు 'తాడేపల్లి' గ్రామంలో, 28-9-08 నాడు 'నిడమర్రు' గ్రామంలో యథాతథంగా పాదయాత్ర సత్సంగాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ప్రముఖులు- (1) శ్రీ జి. చెన్నకేశవరావు (2) శ్రీ ఇసునూరు వెంకట తాతారావు (3) శ్రీ బచ్చుశివ శంకర్రావు (4) శ్రీమతి గౌతమి (5) పంచుమర్తి మోహన కోటేశ్వర్రావు తదితరులు. వీరు ఆగష్టు 2008లో కూడ ఇదేవిధంగా ప్రచారం నిర్వహించారు. వీరి కృషి ఆకర్షణీయం.

## ఒంగోలులో పంచకుండీయ యజ్ఞాలు

యుగ శిల్పి దంపతులు శ్రీ మలసాని వెంకటేశ్వర్లు- శ్రీమతి మలసాని శ్యామలాదేవి తోటి కార్యకర్తల సలహా సహకారాలతో విశేష కృషి చేసి జిల్లాలో విస్తారంగా పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 29 పంచకుండీయ యజ్ఞాలను నిర్వహించారు. అంతేకాక ప్రతి ఆదివారం నిర్వహించిన యజ్ఞాలు 304. దీపయజ్ఞాలు 253 అని సగర్వంగా తెలియ చేశారు.

ప్రస్తుతం అక్టోబరులో నిర్వహించిన పంచకుండీయయజ్ఞాల వివరాలు :-

## భారతీయ సంస్కృతీ జ్ఞానపరీక్ష

*భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్ష అన్ని జిల్లా కన్వీనర్‌లకు తెలియచేయటమేమనగా పరీక్ష నిర్ణయించిన తేది ప్రకారము 22-11-08 (శనివారము) జరుగును. ఇంత వరకు తీసుకున్న పుస్తకాలకు మొత్తానికి డబ్బు పంపగలరు. డబ్బు ఈ క్రింద చెప్పిన ప్రకారము డి.డి. తీసి పంపించగలరు.*

Sri Vedamatha Gayathri Trust, B.S.G.P (payable at Hyderabad).

*డబ్బు నవంబరు 8వ తేదీలోగా పంపుతూ వారికి కావలసిన ప్రశ్నపత్రాలు ఎన్ని కావలెనో వివరముగా తెలుపగలరు. అనగా తెలుగులో, ఇంగ్లీషులో, హిందిలో- 5-6, 7-8, 9-10, ఇంటర్ మీడియేట్ ఎన్ని కావలెనో తెలుపగలరు.*

*ఏదైనా వివరములకు ఈ ఫోన్ నంబర్‌లో సంప్రదించగలరు. ఫోన్ : 9440722860, 040-65520133.*

*బి. హనుమంతరెడ్డి*
*కన్వీనర్ - B.S.G.P*

2-10-08నాడు ఉదయం 11-00 నుండి 1-00 వరకు అంకమ్మ పాలెం- ఒంగోలు కాళికాంబ దేవాలయంలో 94 మంది భక్తులతోను, అదేరోజు సాయంత్రం 6-00 నుండి 8-30 వరకు మంగళిపాలెం చీమకుర్తి- ప్రకాశం జిల్లాలో 47 మంది భక్తులతోను, 3-10-08 నాడు కన్యకా పరమేశ్వరి గుడి - అమల నాథుని వీధి- ఒంగోలులో 63 మంది భక్తులతోను, 8-10-08 నాడు ఉ॥ 11-50 నుండి 1-20 వరకు కాళికాంబ పరమేశ్వరి గుడి- ఒంగోలులో 66 మంది పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞాలు నిర్వహింపబడ్డాయి. ఈ యజ్ఞాలలో **"గురుదేవులకు సంపూర్ణ సమర్పణ"** పుస్తకాలు 38, శాంతికుంజ్ హరిద్వార్ నమూనా ఫోటోలు 38 విక్రయించడం జరిగింది. వీరి కృషి ఆదర్శప్రాయం.

## జగిత్యాలలో

6-9-08 నాడు సారంగాపురం మండలం తుంగూరు గ్రామంలోని దళితవాడలో గణేశ ఉత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా ఆడెపు గంగారాం గారి ఆధ్వర్యంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. 9 మంది గాయత్రీ మంత్ర దీక్షను స్వీకరించారు.

7-9-08 నాడు పొరండ్ల గ్రామంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. దాదాపు 200 మంది పరిజనులు పాల్గొన్నారు.

**అశ్లీల సాహిత్యం అందరికీ ఆగర్భశత్రువు.**

11-9-08 నాడు జగిత్యాల విద్యానగర్‌లోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మహిళా మండలివారి ఆధ్వర్యంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. దాదాపు 150 మంది మహిళలు పాల్గొన్నారు.

దళితవాడల వైపు కృషి చేస్తున్న జగిత్యాల వారి కృషి అభినందనీయం.

## పోచారంలో

రంగారెడ్డిజిల్లా ఘటకేశ్వర్ మండలం పోచారంలో, యూత్ అసోసియేన్ ఆధ్వర్యంలో, పంచాయతీ ఆఫీసు వద్ద దుర్గా నవరాత్రుల సందర్భంగా 5-10-08న పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. అంతకు ముందురోజు 4-10-08 సాయంకాలం ఘనంగా కలశయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీమతి అనసూయమ్మ, శ్రీ సంతోష్ ఆధ్వర్యం వహించారు.

## నెల్లూరులో

1-8-08 నుండి 24-8-08 వరకు వరుసగా 24 రోజులు గాయత్రీ మహాయజ్ఞాలు, దీపయజ్ఞాలు, సంస్కారాలు మొదలైనవి నిర్వహింపబడ్డాయి. ఈ కార్యక్రమాలను శ్రీమతి పి.వి.లక్ష్మి, శ్రీ ఓబులేసు, శ్రీ ఎస్.లక్ష్మణరావు, వరలక్ష్మి, శ్రీ సి.సత్యనారాయణ-సంధ్య, రాణి, జె.నాగరత్నం, సరళ, సురేశ్, వెంగమ్మ, శ్రీ టి.సీతారామస్వామి-హైమవతి, రమేశ్‌బాబు-శ్రీకళ, తులసి, చంద్రకళ, శ్రీమతి టి.సరళ, సురేఖారాణి, ఆర్. భాస్కరనాయుడు, శ్రీ పి. శ్రీనివాసులు, శ్రీ టి. రమణమూర్తి, శ్రీమతి టి. భువన, శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీ వేణుగోపాలరెడ్డి, నాగలక్ష్మి, గోవర్ధనసింగ్ రాజపురోహిత్, తిరునారాయణ, ఎన్.వి. ప్రసాదు. పద్మజ, కె. మోహనరావు-రేవతి, గోపాలకృష్ణ-రాధమ్మ, కె. కాంతారావు-కాంచన, శ్రీ పచ్చున వెంగయ్య-వెంగమ్మ, మొదలైన ప్రముఖ కార్యకర్తలు నిర్వహించారు.

## భీమిలిలో

28-9-08 నుండి 9-10-08 వరకు భీమిలిలో శ్రీ దుర్గాగాయత్రీ శక్తిపీఠంలో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రారంభం రోజున శ్రీమతి జి. భారతి, శ్రీ చంద్రశేఖరం త్రిపద గాయత్రీ దేవాలయలో కలశ స్థాపన గావించారు. శ్రీమతి లక్ష్మీబాయి తదితరులు సహకరించారు. వారి వారి పరిస్థితులకు అనుగుణంగా భక్తులు అనుష్ఠానం, జపం నిర్వహించారు. 7-10-08 నాడు 108 మంది కన్యలు పూజలో పాల్గొనడం విశేష విషయం. నవమినాడు సువాసినులచేత కుంకుమపూజలు, దశమినాడు గాయత్రీ మహాయజ్ఞం-పూర్ణాహుతి నిర్వహింపబడ్డాయి.

## నంబూరులో

27-9-08 న పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మదిన సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నంబూరు గ్రామ గాయత్రి ప్రజ్ఞామండలి యందు శివమ్మ, సుబ్బారావు, హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగింది. సుమారు 70 మంది పరిజనులు పాల్గొన్నారు.

## వరంగల్లులో

గాయత్రీ పరివార్ వరంగల్లు వారి ఆధ్వర్యంలో 2-10-08 నాడు గాయత్రీ దేవాలయం-ధర్మసాగర్‌లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం అఖండహోమం నిర్వహించబడింది. దాదాపు 100 మంది భక్తులు పాల్గొన్నారు.

5-10-08 నాడు జిల్లా కన్వీనర్ టి.ఎమ్.గుప్తాగారి ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీ-వరంగల్ శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. 150 మంది భక్తులు పాల్గొన్నారు. ఐదు జన్మదిన సంస్కారాలు జరిగాయి.

6-10-08 నాడు సాయంత్రం 8 గంటలకు కనకదుర్గా మాతదేవాలయంలో 200 మంది మహిళలతో విరట్ దీపయజ్ఞం నిర్వహింపబడింది.

# జిల్లా సమన్వయ సమితి మరియు ప్రజ్ఞామండళ్ళ సమ్మేళనం

*ఈ కార్యక్రమము రాష్ట్ర సంయోజకులు శ్రీ అశ్విని సుబ్బారావు గారు, శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిథులు సంత్ బ్రిజ్‌మోహన్ గౌడ్ గారు, శ్రీ పరమానంద ద్వివేదిగారు, శ్రీ హీరాసింగ్ రాజపురోహిత్ గార్ల ఆధ్వర్యంలో ఈ సమావేశములు నిర్వహింపబడును.*

**ఉదయం** : 10 గంటలకు ఆయా జిల్లా కమిటీ సభ్యులందరూ, పట్టణ, మండళ్ళ సమయదాన సభ్యులు, కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావలెను.

**సాంయత్రం** : 2 గంటల నుండి జిల్లాలలోని ప్రతివొక్క ప్రజ్ఞా, మహిళా మండళ్ళ నుంచి ముఖ్య సభ్యులు. కనీసం ఐదుగురు హాజరుకావలెను.

బ్రతకడానికి జీవించకూడదు - జీవించడానికి బ్రతకాలి.

ప్రతి జిల్లా సమావేశాల్లో రీజనల్ కమిటీ సభ్యులు తప్పక హాజరుకాగలరు. జిల్లా కన్వీనర్లు సమావేశానికి వచ్చేటప్పుడు ఈ క్రింది పూర్తి విషయముల వివరములు తీసుకురాగలరు.

1) సక్రియ ప్రజ్ఞా మండలి, మహిళామండళ్ళ వివరాలు.

2) భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షల వివరాలు.

3) 5 కుండీల యజ్ఞ వివరాలు.

4) ప్రముఖుల చిరునామాలు, ఫోను నంబర్లు.

5) క్రాంతిదర్శీ సాహిత్యం అమ్మకాల వివరాలు.

6) పట్టణ, మండళ్ళలో పత్రిక సభ్యత్వం యొక్క వివరాలు.

వీటిని సేకరించి వివరముగా సమావేశమునకు తీసుకురాగలరు. సమావేశాల తేదీల వివరములు ఈ క్రింద సూచించబడినవి.

| తేది | స్థలము | జిల్లా | నైట్ హాల్ట్ |
|---|---|---|---|
| 28-11-08 | సంగారెడ్డి | మెదక్ | కామారెడ్డి |
| 29-11-08 | కామారెడ్డి | నిజామాబాద్ | జగిత్యాల |
| 30-11-08 | జగిత్యాల | కరీమ్‌నగర్ | మంచిర్యాల |
| 1-12-08 | మంచిర్యాల | ఆదిలాబాద్ | వరంగల్ |
| 2-12-08 | వరంగల్ | వరంగల్ | ఖమ్మం |
| 3-12-08 | ఖమ్మం | ఖమ్మం | హైదరాబాదు |
| 7-12-08 | హైదరాబాదు | హైదరాబాదు ఆర్.ఆర్. | హైదరాబాదు |
| 8-12-08 | మహబూబ్‌నగర్ | మహబూబ్‌నగర్ | కర్నూల్ |
| 9-12-08 | కర్నూల్ | కర్నూల్ | అనంతపూర్ |
| 10-12-08 | అనంతపూర్ | అనంతపూర్ | కడప |
| 11-12-08 | కడప | కడప | చిత్తూరు |
| 12-12-08 | చిత్తూరు | చిత్తూరు | నెల్లూరు |
| 13-12-08 | నెల్లూరు | నెల్లూరు | చీరాల |
| 14-12-08 | చీరాల | ప్రకాశం | నారాకోడూరు |
| 16-12-08 | నర్సరావుపేట | గుంటూరు | మల్లేపల్లి |
| 17-12-08 | మల్లేపల్లి | నల్లగొండ | హైదరాబాదు |
| 20-12-08 | - | - | విజయవాడ |
| 21-12-08 | విజయవాడ | కృష్ణా | అమలాపురం |
| 22-12-08 | అమలాపురం | ఈస్ట్ గోదావరి | విశాఖపట్నం |
| 23-12-08 | విశాఖపట్నం | విశాఖపట్నం | పార్వతిపురం |
| 24-12-08 | పార్వతిపురం | విజయనగరం | శ్రీకాకుళం |
| 25-12-08 | శ్రీకాకుళం | శ్రీకాకుళం | కాకినాడ |
| 26-12-08 | కాకినాడ | ఈస్ట్ గోదావరి | హైదరాబాదు |

**సమాజం నీకు ఏమిచేసిందనికాదు - నువ్వు సమాజానికి ఏమిచేశావో ఆలోచించు.**

# నేత్ర రక్షణకు చాక్షుషీ విద్యా ప్రయోగం

ఉపనిషత్తులు చాక్షుషీ విద్యకు మహత్తరమైన స్థానం ఇచ్చాయి. ఈ మంత్ర పఠనం ద్వారా అనేక దేశాలలో ప్రజలు కంటి జబ్బుల నుండి విముక్తి పొందారు. మన రాష్ట్రంలో హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలోని శ్రీమతి బి.అనసూయమ్మ ఈ మంత్రం ద్వారా కంటి ఆరోగ్యాన్ని పూర్తిగా పొందారు.

సూర్యోదయం నుండి ఒక గంటకాలం ఈ సాధన చేయవచ్చు. తూర్పువైపు సూర్యునికెదురుగా కూర్చొని- పవిత్రీకరణం, ఆచమనం, శిఖావందనం, ప్రాణాయామం, న్యాసం, చందన ధారణం చేసి, గాయత్రీ మహామంత్రం 24 సార్లు జపించిన తర్వాత ఈ క్రింది మంత్రంతో ఒక చెంచా నీరు భూమి మీద సమర్పించాలి.

**త స్యా శ్చాక్షుషీ విద్యాయా అహిర్బుధ్య ఋషి గాయత్రీ**
**ఛందః సూర్యోదేవతా చక్షురోగ నివృత్తయే జపే వినియోగః**

తర్వాత ఈ క్రింది మంత్రాన్ని 12 సార్లు జపించాలి.

**ఓం చక్షుః చక్షుః తేజః స్థిరోభవ । మాం పాహి పాహి ।**
**త్వరితం చక్షురోగాన్ శమయ శమయ । మమ జాతరూపం తేజో**
**దర్శయ దర్శయ । యధాహం అంధోన స్యాం తధాకల్పయ కల్పయ**
**కళ్యాణం కురు కురు । యాని మమ పూర్వజన్మోపార్జితాని చక్షుః**
**ప్రతిరోధకదుష్కృతాని సర్వాణి నిర్మూలయ నిర్మూలయ । ఓం నమః చక్షుస్తేజో**
**దాత్రే దివ్యాయ భాస్కరాయ । ఓం కరుణాకరాయామృతాయ ।**
**ఓం నమః సూర్యాయ । ఓం నమో భగవతే సూర్యాయాక్షితేజసే నమః ।**
**ఖేచరాయ నమః । మహతే నమః । రజసే నమః । తమసే నమః ।**
**అసతోమా సద్గమయ । తమసోమా జ్యోతిర్గమయ । మృత్యోర్మా అమృతం గమయ ॥**

ఇలా పఠించిన తర్వాత పంచపాత్రలోని జలాన్ని సూర్యభగవానునకు అర్ఘ్యరూపంలో సమర్పించి మిగిలిన రెండు చుక్కల జలాన్ని రెండు చేతివ్రేళ్ళకు రాసుకొని కళ్ళు తుడుచుకోవాలి.

ఇలా నెలరోజులు చేసిన తర్వాత కళ్ళు పరీక్ష చేయించుకొని, 3 నెలలదాకా వరుసగా చేయండి. మీ అనుభవాలను యుగశక్తి గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాదుకు తెలియజేయండి.

★★★

వైవాహిక జీవితంలో చిన్న చిన్న త్యాగాలే పెద్ద పెద్ద సౌఖ్యాలు